ఆంధ్రపత్రిక


దీపావళి సంచిక

సచిత్రవారపత్రిక



4 అణాలు

15—10—'52



పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
కోసలదేశము కొకానొకప్పుడు సురథుడు అనబడు నృపాలుడుండెను ఆయోధ్య అతనికి ముఖ్యపట్టణము
ఒకనాడొక వార్త పొరుడొచ్చే. "వింధ్యప్రాంతపు భిల్లనాయకులు మనపై ఎదురూ తిరిగారు. వారికి బుద్ధి చెప్పుటకై మన మంత్రి గారిని పంపండ"నగా
నీడలాగ తననెప్పుడు వదలక సలహాలిచ్చే ధీరబలుడు అను మంత్రి ని రాజూ పంపాడు.
మంత్రి గారు అటుపోగానే యిటు గడ్డం పెంచిన దొంగ యోగొకడు రాజధానిలో కొచ్చాడు.
ఆయన చాలా పండితుండనీ, వేదాలన్నీ తలకిందులుగా అప్పచెప్పగల ధీమంతుండని పట్టణమంతా పుకారుపుట్టెను.
కర్ణాకర్ణిగ యీ విషయం మన-రాజు గారి చెవి సోకింది.- సంగతేమిటో తెలుసుకొనుటకై- స్వాములవారిని ఆస్థానానికి రాజుగారు పిలిపించారు.
స్వాములవారు తన మాయ మాటలతో- రాజును బుట్టలో పెట్టాడు
స్వాములారు ఒక రోజున కొలువుకు ఆలస్యంగా వచ్చాడు
"రాజా! ఇందాకేదో పనిపై- దేహమిక్కడే వదిలేసేసి- స్వర్గలోకమూ పోయొచ్చాను.- దేవతలంతా మిమ్మడిగామని -ఎంతో ఇదిగా చెప్పారు!"
"ఆహా! ఎంతటి మహాత్ములండీ! ఇన్నాళ్లైనా ఎరుగ్గనైతినే!"
అని ఆరాజూ ప్రజలను మరచి- రాత్రింబగళ్లు స్వాములారికే సేవలు చేస్తూ వున్నాడు రాజకార్యములు మూలను బడగా- అరాజకం వ్యాపించింది ఇట్లావుండగ వింధ్య ప్రాంతం వెళ్లిన మంత్రీ వచ్చాడు
"రాజ్యం గీజ్యం శాశ్వతమటోయి? ఇరుగో వీరిని చూశావా! రోజుకి నాలుగుసార్లైనా వైకుంఠానికి రాకపోకలూ చేయగలంతటి సమర్థులోయి!"
"మంత్రిగార్కి నా శక్తిని గూర్చి అనుమానంగా వున్నట్టుందే! చూసుకోండి. నా స్వర్గప్రయాణం ఇపుడే ఋజువూ చేస్తాను."
అంటూనే ఒక గదిలో దూరి తలుపులు లోపల గడివేశాడు

సంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతి 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 8
15-10-52

నందన ఆశ్వయుజ బహుళ ద్వాదశి బుధవారము



భారతప్రధాని నెహ్రూ రాయలసీమ పర్యటన: తాడిపత్రి తాలూకా కొండపల్లి

[illegible]

విషయానుక్రమణిక

ముఖచిత్రం : కృష్ణాపిక్చర్సువారి "అమ్మలక్కలు"లో లలిత.

దీపావళీ భావబీజావళి—	3
నల్లద్దాల కళ్లజోడు—	6
అమవసనిశి—	8
రెండుమహానగరాలు—	9
సేవింగ్‌లో షేవింగ్—	12
రావణాఫిరంగులు—	14
విరిగిన మనస్సు—	17
పరోరి—	21
విజ్ఞానవీధులు—	26
భామకలాపం—	28
దీపావళి—	30
టంగుటూరి మిరియాలు—	31
'దీలామాస'—	35
దీపావళి—	36
డాన్‌క్విక్ సెట్	40
జంతుకోటిలో మానవలక్షణాలు	43
సినిమా	45
ప్రశ్నలు సమాధానాలు	48

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక.

సంక్రాంతికి ప్రత్యేక సంచిక, కథలపోటీ

రాబోయే సంక్రాంతికి (14-1-1953) ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. ఈ సంచికలో ప్రత్యేకాకర్షణగా కథలపోటీని ఏర్పాటు చేయదలచాము. గ్రామీణ వాతావరణం, గ్రామీణ జీవితం, గ్రామీణసమస్యలు ఆధారం చేసుకుని, మా వారపత్రికలో ఆరుపేజీలకు మించకుండా, స్వతంత్రంగా రచించబడిన కథానికలను పోటీకి స్వీకరిస్తాము. మొదటి బహుమతి కథకు 75 రూ॥లు, రెండవ బహుమతి కథకు 50 రూ॥లు పారితోషికం ఇవ్వబడుతుంది. పోటీలో యావన్మంది రచయితలు పాల్గొనవచ్చును.

పోటీ కథానికలు డిసెంబరు 1 వ తేదిలోగా మా కార్యాలయానికి చేరాలి.

సంక్రాంతి సంచికకు ఇతర కథానికలు, గేయాలు, పద్యాలు, ఛాయాచిత్రాలు, లిఖితచిత్రాలు పంపగోరేవారు కూడా డిసెంబరు 1 వ తేదీలోగా పంపగలరని ఆశిస్తున్నాము. ముఖ్యంగా ఛాయాచిత్రాలు, లిఖితచిత్రాలు గ్రామీణ వాతావరణం, సంక్రాంతిపండుగ దృశ్యాలు చూపించేవైతే మరీ సంతోషం.

పోటీకి పంపే కథానికలను "సంక్రాంతి సంచిక కథానికల పోటీకి" అనీ, సంక్రాంతి సంచికకు పంపే ఇతర రచనలను లిఖిత చిత్రాలను "సంక్రాంతి సంచికకు" అనీ స్పష్టంగా వ్రాయాలి.

సంక్రాంతి సంచికను సాధ్యమైనంత ఆకర్షకంగా వెలువరించాలని మా ప్రయత్నం. పాఠకులు, రచయితలు, అభిమానులు మా యీ ప్రయత్నానికి సర్వవిధాలా సహకరిస్తారని ఆశిస్తున్నాము.

దీపావళీ భావబీజావళి

దీపజ్యోతిః పరంబ్రహ్మ
దీపస్సర్వ తమోపహః
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యాదీప నమోస్తుతే.

దీపమునే భగవంతుని స్వరూపంగా ఆరాధించడం దీపారాధన. అగ్నిని గృహస్థు అయినవాడు విధిగా ఆరాధించాలి. నాలుగు వేదములలో కెల్ల పురాతనమైనది ఋగ్వేదం - మన పురాణాలూ ప్రబంధాలూ ప్రారంభమైనట్లుగా ఋగ్వేదం "శ్రీ" కారముతో ప్రారంభం కాలేదు.

"అగ్నిమీళే పురోహితం" అనే ఋక్కుతో ఋగ్వేదము ప్రారంభమైంది. ఆ వేదము "అగ్ని"యొక్క స్తోత్రంతో ప్రారంభింపబడింది. "భవిష్యత్ శ్రేయస్సు కోసం (పురోహితం కోసం) అగ్నిని స్తోత్రము చేయుచున్నాను." అనే వాక్యంతో వేదపఠనం ప్రారంభమైంది. ఆర్యులున్నూ, బొంబాయిరాష్ట్రములో ఉన్న పారసీలు అనబడే జోరాస్టరు మతస్థులున్నూ అగ్నినే ఆరాధిస్తారు. ఈ జోరాష్టరు మతస్థులకు "ఛందో అవెస్థా" అనే గ్రంథం వేదము వంటిది – ఈ ఛందో అవెస్థాలోనూ వేదంలోనూ అనేక విషయములు ఒక్కటే విధంగా ప్రస్తావింపబడినవి. ఈ పారసీ వారు పరిషియా దేశమునుండి పారిపోయి ఆత్మరక్షణకోసం కాందిశీకులుగా భారత దేశపు పశ్చిమోత్తర ప్రాంతంలో అనగా బొంబాయి రాజధానిలోని గుజరాతు ప్రాంతంలో స్థిరనివాసులైనారు.

ఒకటో శతాబ్దంలో మహమ్మదు పుట్టిన తర్వాత మహమ్మదుయొక్క మతాన్ని వ్యాపింపజేయడానికి అరాబియా దేశంనుంచి పరిషియా దేశంలోనికి మహమ్మదీయ మత వీరావేశులు దండెత్తివచ్చారు. అప్పుడు యీ జోరాష్టరు మతస్థులు భారతదేశానికి పారిపోయి వచ్చారు. అంతకు పూర్వమే పరిషియాలో (క్రీస్తు పుట్టక పూర్వము అనేక శతాబ్దాలక్రిందట, యీ పరిషియా దేశంలో ఆర్యులు ఉండేవారు. పరిషియాకు ఇరాన్ అనే పేరు ఉంది. "ఇరాన్" అనే శబ్దము 'ఆర్య'న్ అనే శబ్దానికి మరొక రూపం.

ఈ పరిషియాలో ఆర్యులు ఉంటూ ఉండినకాలంలో వారందరూ అగ్నిని ఆరాధిస్తూ ఉండేవారు. వేదాలలో 33 దేవతలు స్తుతింపబడిఉన్నారు. ఈ దేవతలందరిలో "వరుణుడు" అగ్రస్థానం వహించియున్నాడు. కాని, కొంత కాలానికి ఈ ఆర్యులలో కొందరు "ఇంద్రుణ్ని" సకలదేవతాధిపతిగా పూజింపవలె నన్నారు.

ప్రాతసంప్రదాయమే అమలులో ఉండవలెనని వాదించినవాళ్ళు అందుకు అంగీకరించలేదు. ఈవిధంగా ఆరాధనవిధానంలో అభిమత భేదాలు వారిలో వారికి వచ్చాయి. ఒకరినొకరు తూలనాడుకొన్నారు. వారి దేవుళ్లను వీరు రాక్షసులన్నారు. వీరి రాక్షసులను వారు దేవుళ్లన్నారు. ఈవిధంగా జోరాస్టరు మతస్థులు వేదమతస్థులతో విడిపోయి, బ్రాహ్మణ ద్వేషులైనారు. ఆర్యులు వేదములను చంకను బెట్టుకొని పర్షియానుంచి సింధునదీ ప్రాంతాలకు పిషది వేలఏండ్లక్రిందటనో వచ్చారు.

వామన

సపిండ వివాహములు చేయడం మంచిది కాదని కొందరు వాదించారు అనగా పినతండ్రి పెత్తండ్రి కుమార్తెలను వివాహంచేసికొనే ఆచారం కూడదన్నారు. ఈ ఆచారం మార్చకూడదని అప్పటి సనాతనులు వాదించారు. చనిపోయినవారి శవములను దహనంచేస్తే, పవిత్రమైన అగ్ని అపవిత్రమవుతుందని అప్పటి సనాతను లన్నారు. దహన సంస్కారమే మంచిదని ఆనాటి సంస్కారప్రియులు వాదించారు. ఈ విధంగా ఆచారవ్యవహారసంస్కరణలలో కూడా వారిలోవారికి అభిమతాలు భేదించాయి. అందువల్ల వేదమతస్థులు వారిలోనుంచి విడిపోయినారు. జోరాస్టరు మతస్థులు ప్రత్యేక కూటంగా పరిషియాలో ఉండిపోయిరి. కాని, వారికి వీరికి చిరకాల సన్నిహిత సంపర్కం ఉండడంవల్ల వారి ఛందోఅవెస్థాలో కన్పించిన దేవతల పేర్లు ఋగ్వేదంలో కన్పిస్తాయి. అందులో ఉన్న అంశాలు ఇందులో కూడా కన్పిస్తాయి. ఏమైనప్పటికీ పారసీలు అగ్నిని అప్పటినుంచి ఇప్పటివరకు పూజ చేస్తున్నారు—వైదికమతస్థులుకూడా అగ్నిని పూజచేస్తున్నారు.

చలిదేశాలలోనివారికి వెచ్చదనంకోసం అగ్నిహోత్రం విధిగా యింట్లో ఉండాలి. గృహస్థు అయిన తర్వాత అగ్ని చల్లారిపోకుండా శ్రద్ధగా చూచుకుంటూ ఉండాలి. సీమదేశాలలో కూడా ప్రతియింటిలోను వెచ్చదనంకోసం సెగడు ఒకటి ఉండాలి. దానిని *Hearth* (హార్తు) అంటారు. "హార్తు" అనేది గృహస్థాశ్రమ చిహ్నం. *Cloister* (క్లాయిష్టరు) అనగా ప్రార్థనామందిరం – మఠంలోచేరి సన్యసించినవానియొక్క సన్యాసాశ్రమ చిహ్నం "క్లాయిష్టరు" — ఈవిధంగా "అగ్నికి" ఎటువంటి గృహస్థాశ్రమ గౌరవం ఉన్నదో, దీపానికికూడా అటువంటి గృహస్థాశ్రమ గౌరవం ఉంది.

"నరకచతుర్దశి" యున్నూ దీపావళీ అమావాస్యయున్నూ వెళ్ళిపోగానే కార్తీకమాసం ప్రారంభమవుతున్నది. కార్తీకమాసారంభంనుంచిన్ని, ఆకాశదీపం వెలిగించవలెననే ఆచారం ఉంది. యమదంష్ట్రి కాలం అని దీనికిపేరు. ఉత్తర్వ్యలో కానికి

★ దీపావళీ భావ బీజావళి ★

పోయేటటువంటి ప్రేతాత్మలకు మార్గమును చూపించుటకై ఒక దీపాన్ని ప్రతిగృహస్థున్నూ వెలిగించవలెననే నమ్మకము ఉన్నది. ప్రతియింటి వాకిళ్లలోను ఒక్కొక్క ఆకాశదీపం వెలిగిస్తే వీధి పొడుగునను దీపాలే ఉంటాయి. ఊరంతా దీపాలే — ఇదే దీపావళి.

నరకచతుర్దశి కాగానే ఈ దీపాలు వెలిగించడం ప్రారంభించాలి. ఋగ్వేదంలో "యముడు" ప్రత్యేక దేవతగా ప్రస్తావింపబడినాడు. ఇతడు వివస్వతుని కుమారుడనియు, చనిపోయినవారి ఆత్మలన్నియు చేరేటటువంటి లోకానికి అధిపతి యనియు చెప్పబడినది. ఈ యముడు ధర్మమూర్తి యనియు పుణ్యలోకానికి అధిపతి యనియు ఛందోఅవెస్తాలోని వెండిడాడ్ గ్రంథంలో వర్ణింపబడి ఉంది. నరకమునకు అధిపతి యముడు అని పురాణాలు వర్ణించాయి. కాని, యీ యమలోకములో ప్రేతాత్మలు హింసల పాలు అవుతాయని వేదంలో చెప్పలేదు. ఈ యమలోకమునకు కంటకుడైన నరకాసురుడు ఎవడైనా ఉంటే వానిని సంహరించి యమధర్మరాజుయొక్క ధర్మపరిపాలన అవిచ్ఛిన్నంగా సాగించడమే నరకాసురవధయొక్క గాని నరకచతుర్దశియొక్క గాని అంతరార్థమై ఉండాలి. "యమలోకం" అనేది, భగవంతుడు సృష్టిచేసిన ఆనందమయలోకము అని ఛందో అవెస్తాలో చెప్పబడింది.

ఆశ్వయుజ మాసంలో దసరాపండుగ ముందు వచ్చేడి మహాలయఅమావాస్యనాడు పితృదేవతలకు తర్పణములు విడుస్తాము. ఏ యుద్ధంలోనో, ఏ ఆకస్మిక ప్రమాదాలలో ఏ రోజున చనిపోయినదీ తిథి కూడా తెలియనటువంటి మృతులందరికీ మహాలయ అమావాస్యనాడు తర్పణాలు విడిచి తద్దినం పెట్టవలెనన్నారు. తదితర పితృదేవతలకు కూడా ఆనాడు తర్పణములు విడుచుట అవశ్య కర్తవ్యం అన్నారు. మహాలయం అనగా "మహా ప్రళయం" ఏదైనా అనాదికాలములో (ఆర్యులు ఎరిగియున్నంతలో, వారి అనుభవజ్ఞానమును బట్టి, ఏ ఉత్తర ధృవప్రాంతంనుంచి అయినా వారుబయలుదేరిన యుగంలో,) సంభవించి యుండవచ్చు. ఏమైనప్పటికీ లయమైన పితృదేవమండలికి మహాలయ అమావాస్యనాడు తర్పణములు విడిచి, దీపావళి అమావాస్యనుండియు ఆకాశదీపాలు వెల్గించి పితృదేవతలకు పుణ్యలోకమునకు మార్గం చూపించాలి. నదులలోను ప్రవాహ జలములలోను కాల్వలలోను కూడా కార్తీకమాసమంతయును తెల్లవారకముందే చీకటిఉండగానే స్నానాలుచేసి అరటిదొప్పలలో దీపాలు వెల్గించి నీటిలో విడిచిపెట్టాలి. గతించిన మహాపురుషులకు ఆత్మశాంతి కలుగుతుంది. ఆమహాపురుషుల సత్సంకల్పములను మనము కొనసాగించడం వల్లను, వారి సదుపదేశములను మనము శిరసావహించడం వల్లను, వారి పేరైనను తలచుకొని వారిని గౌరవపూర్వకంగా స్మరించడంవల్లను, వారి ఆత్మలకు శాంతి కలుగుతుంది. భగవంతునకైనా సరే, ఆ వైకుంఠంలో మన శాంతి ఉండాలంటే,

దెయ్యాలు భయం లేకుండా చెయ్యదగిన కొన్ని పనులు:-

(1) హృదయాలు దొంగిలించడం.

(2) డబ్బు తగల పెట్టడం

(3) భోజనానికి రమ్మని బలవంతం చెయ్యడం

(4) సిగరెట్ పీకె నొక్కెయ్యటం


(5) తెలుగు భాషను ఖూనీ చెయ్యటం.

భూలోకంలో పాపం పెరుగకూడదు. పుణ్యచింత నశించి పాపం పెరిగితే భగవంతుడు తిరిగి అవతారం ఎత్తి కిందికి రాక తప్పదు. ఏ మహాత్ముడో ఏతపశ్శాలియో అపుణ్య లోకంలో ఆత్మశాంతి చెడి, ఆందోళనపడి, మనకు సద్బుద్ధి కలుగచేయడానికి అవతరించవలసి వస్తుంది. మన పెద్దలకు మన గురుతుల్యులకు ఆత్మశాంతి కలుగడానికి త్రికరణశుద్ధిగా సగౌరవంగా వారిని స్మరించి అందుకు సూచనగా యీ ఆకాశదీపం ప్రతి గ్రహస్థూ వెలిగించాలి. ప్రతి గృహస్థు, ప్రతి యిల్లాలు, గతించినవారిని స్మరించి వారి పేరుమీదుగా నదిలోగాని, కాల్వలోగాని దీపాలు వదలిపెట్టాలి. అదే పుణ్యలోకానికిపోవు జీవుడని భావించాలి. దొప్పలలో కర్పూరం వెలిగించి గంగానదిలో (హరిద్వారమువద్ద) నిత్యము విడిచిపెట్టుతూ ఉంటారు. అక్కడ గంగానదిలో నిత్యదీపావళిగా ఉంటుంది. కాలప్రవాహములో యాత్రచేయుచున్న జీవులకు ఆ దీపాలు చిహ్నమాత్ర రూపాలు.

"పోలి" అనునది ఒక కమ్మరదాని అరవకోడలు. అత్త కోపగించునసే భయములో, అది అత్తకు తెలియకుండా కార్తీకమాసం అంతా ప్రతిరాత్రీ దీపం వెలిగించి, చివరిరోజున, మార్గశిర శుద్ధపాడ్యమినాడు సశరీరంగా విమానంమీద స్వర్గానికి వెళ్లినదనే కథ ఒకటి ఉంది.

గతించిన పెద్దలకు, పిన్నలకు గౌరవానురాగభావంతో యింటింటా దీపాలు వెలిగిస్తే, అది గృహస్థ జీవితానికి జాతీయ జీవనానికి, శ్రేయస్కరం. పూర్వులను స్మరించని జాతికి పురోభివృద్ధి లేదు. గతించినవారి మాతృవిషయం ఆలోచించని జాతికి మాతృం లేదు. దీపావళీ పండుగ అంటే మహాత్ములను లోకోద్ధారకులను దేశోద్ధారకులను దివంగతులైన పెద్దలను పిన్నలను ధ్యానించుకొని వారి జీవాత్మలకు చిహ్నమాత్రంగా వినమ్ర హృదయులమై వెలిగించవలసిన దీపాల పండుగయిది. పుణ్యలోకంచేరిన ఆజీవాత్మలు ఈ దీపములని భావించి నమస్కారం చేయవలసిన పుణ్యదినం. అంతేగాని, మందుగుండు సామగ్రులను కాల్చి యింట్లో ఎవ్వరికీ మనశ్శాంతి లేకుండా యిల్లూ వాకిలీ కూడా యుద్ధరంగంవలె "ధాం" "ధాం" అనే భయంకర శబ్దాలతోను, లంకాదహనం లాగున చిచ్చుబుడ్ల జ్వాలలతోను, తోటాల లడాయిలతోను, ఘోర భీభత్సంగా జరుపవలసిన పండుగ కాదిది. ఆ విధంగా యీ పండుగ జరుపవలెనని మన మతగ్రంథాలలో ఎక్కడా వ్రాయబడియుండలేదు.

భక్తితో, గౌరవంతో, ప్రేమతో, దీపములు వెలిగించాలి.



ఇన్స్పెక్టరుగారు బడి తనిఖీ చేస్తూ మధ్యలో నిట్టూర్పు విడిచి ఇలాగన్నారు: "మళ్ళీ చిన్నపిల్లడినై రోజూ బడికి వచ్చి చదువుకుంటే ఎంత బాగుంటుందో అని పిస్తోంది...."

క్లాసులో ఎవరూ పలకలేదు. ఇన్స్పెక్టరు గంభీరంగా అడిగారు: "అలా ఎందుకని పిస్తోందో తెలుసా?"

ఒక చిన్న పిల్లలేచి సమాధాన మిచ్చింది.


"బహుశా మీరు చిన్నప్పుడు నేర్చుకున్నదంతా మరిచిపోయి ఉంటారు."

"దీపజ్యోతిః పరం బ్రహ్మ" అని ధ్యానించి నమస్కరించాలి.

ఆ విధంగా దీపావళి పండుగ చేసి దీపాన్ని ఆరాధిస్తే—

"దీపేన సాధ్యతే సర్వం"

అట్టి దీపారాధనవల్ల సర్వం సార్థమవుతుంది. తథాస్తు. ★



పదిగంటలకు ఆఫీసుకు వెళ్ళటం బాధగా వుంది. ఎండలో కళ్లు మండిపోతున్నాయి. అందుకని నల్లద్దాల కళ్ళజోడు కొందామని కాకినాడ వెళ్లాను. ఆ వేళ శనివారం. సాయంకాలం నాలుగింటికి ద్వారకా లంచ్ హోంలో కాఫీ సేవించి బయటకు వచ్చి నిలుచున్నాను. కాలేజీనుంచి రకరకాల నల్లద్దాల కళ్లజోళ్లు సజీవంగా నడచిపోతున్నాయి. అవన్నీ నా ముఖాన్ని చూచి వెక్కిరిస్తున్నట్లుగా నా మనసెందుకో తహతహలాడసాగింది. ఏరకం కొందామా అన్న ఆలోచనలో పడ్డాను. రకరకాలు. వింత వింత-వివిధ పద్ధతుల కళ్ళజోళ్లన్నీ ఒక్కొక్కటీ నా మెదడులో తళుక్కున మెరయజొచ్చేయి.

ఇంతలో పిడుగులాంటి ఒక కేక. ఉలిక్కిపడ్డాను. నాముందొక నవనాగరికతా సుందరీమణి నిలుచునివుంది. ఎందుకో-ఏమిటో-అర్థంకాక కళ్ళప్పగించి చూస్తున్నాను. ఆమె కళ్ళకొక 'మంచి' నల్లద్దాల కళ్లజోడుంది. అది సరిగ్గా నేను కొందామని నిశ్చయించుకున్న రకమే! దాన్ని చూస్తూ తక్కిన ప్రపంచాన్నే మరచిపోయాను. ఇంతలోనే మరొక వురుము. "మీకే చెప్పేది! వినిపించటంలేదే! అలా చూస్తూ నిలుచుంటారేం! తప్పుకోండి దారిలో" అన్న ఆమె మాటలు మొట్టికాయల్లాగ తగిలేయి. అప్పటి కర్థమయ్యింది ప్రస్తుత వాతావరణం. తప్పుకున్నాను. ఆమె చకచకా మేడమీదికి చక్కాపోయింది. నాచేత యింత పని చేయించింది ఆ నల్లద్దాల కళ్లజోడేకదా! అది లేకపోతే అసలలా అమాయికంగా ఆమెవంక అదే లోకం చూడకపోదును. చూచినా ఆమె అవసరాన్ని గుర్తించి వెంటనే తప్పుకుందును. ఆ నల్లద్దాల కళ్లజోడేకదా యింతకూ కారణం-ఈ సంఘటన చూచినవాళ్లంతా నాగురించి యేమనుకుంటున్నారో" అన్న ఆలోచనతో మరలా యీ ప్రపంచాన్ని విడిచిపెట్టాను.

అబ్బా! జబ్బ విరిగిపోయిందే అనుకున్నాను. ఎవడో ఎత్తుడు బరువున వడేశాడు. ఆచరుపుతో నావళ్లు మండిపోయింది. నమలకుండా మ్రింగుదామన్నంత కసి పుట్టుకొచ్చింది. చర్‌మని వెనక్కు తిరిగేను...ఇంకేముంది నా వుద్రేకమంతా చచ్చి వూరుకుంది. అతని కళ్లకో మంచి నల్లద్దాల కళ్లజోడు వుంది. దానిని చూడగానే నా కోపమంతా జాలిగా మారిపోయింది. సందిగ్ధంలో పడ్డాను. ఏమిటి చేయటం. పాపం! నన్ను తన స్నేహితుడనుకొని అలా కొట్టివుంటాడు. అనుకున్నాను......కానీ వాడింకా చేయి తీయడే భుజంమీదనుంచి. "ఎక్స్యూజ్‌మీ" అనడే-చివరకు "సారీ" అనియైనా అనడే-పైగా నవ్వుతున్నాడు. ఈసారి నిజంగా కోపమొచ్చింది. తల వంచుకొనే ఇదంతా ఆలోచిస్తున్నాను. చాచిపెట్టి గూబమీద కొడదామనుకున్నాను. కొట్టటానికి సర్దుకున్నానుకూడాను. చచ్చాం! మరలా జ్ఞాపకమొచ్చింది. కొడితే పాపం అంత అందాల కళ్ళజోడు విరిగి ముక్కలైపోదూ! అది చూచి నేను సహించగలనా - మరలా చల్లారేను. నిలువుచూపడింది. చూస్తూనే వున్నాను. కాని నాకేమీ కనిపించటంలేదు.

'కావ్యశ్రీ'

"అదేమిట్రా - అలా చూస్తున్నావు. పిచ్చిగాని యెత్తలేదుకదా" అన్నాడు. నాకు నిజంగా సిగ్గేసింది. వాడు నా ముఖ్య స్నేహితుడు దాసు. ఎంత పనిచేసింది ఆ కళ్ళజోడు. "ఆ నల్లద్దాల కళ్ళజోడు లేకపోతే నిజంగా వాడిని కొట్టేవాడినే... కాదు కాదు......అది లేకపోతే అసలింత రభస జరిగేదేకాదు." అనుకుంది నా మనసు మా యిద్దరకు తెలియకుండా! నల్లద్దాల కళ్ళజోడు చూడగానే తక్కిన ప్రపంచాన్నే మరచిపోయేలాగ నామనః ప్రవృత్తి యెందుకంతలా మారిపోతూ వుందో నా కర్థం కావటంలేదు.

ఇద్దరం కలసి రూముకు వెళ్లాం. మాటల ధోరణిలో నేను వచ్చిన పనివాడికి తెలిసింది "ఎందుకు కొనటం-పద్దు-నాదగ్గర రెండున్నాయి. నీకు నచ్చింది పట్టుకువెళ్లు" అన్నాడు. చివరకు వాడిమాటే నెగ్గింది నాకు నచ్చింది తగిలించుకొని సినీమారోడ్డుకు బయలుదేరాం. ఇంకేముంది నా కక్కడిలేని ధైర్యం పుట్టుకొచ్చింది. నా కళ్లు ఇతరులకు కనిపించవుగా. ఈసారి నిర్భయంగా అందరివంక అన్ని కోణాలలో నుంచీ చూడవచ్చు; చూచి, ఎత్తుపల్లాలు-జాగ్రత్తగా-పరిశీలించవచ్చు-అన్న సంబరంలో-ఒకప్రక్క సూర్యాస్తమయమయిపోతున్నా-గమనించకుండా యింకా అలాగే పెట్టుకు తిరుగుతున్నాను. ఇంతలో ఒక అమ్మాయి (B. A. లో నా క్లాస్ మేటు) రిక్షా దిగి డబ్బులిస్తూ నావంక చూచింది. నేను ఆనవాలు తెలియననే నా వుద్దేశ్యం ఆ నమ్మకంతో ఆమెవంక "ఇలారా" అన్నట్లుగా చేయి వూపేను. జవాబు లేదు. ఇంకా అలాగే చూస్తుంది. మరలా వూపేను. రామరామ! చివరకు చిరునవ్వయినా విసరకేం! "ఏరా! అలా చూస్తుంది" అన్నాను. "అబ్బే! మరేముంది: నల్లద్దాల కళ్ళజోడుతో-ప్రపంచాన్ని మరచి- పళ్ళికిలిస్తున్న ఒక చదువుకున్న మూర్ఖునిచూచి" అన్నాడు మా కుర్రవెధవ. మరొక మొట్టికాయ తగిలింది.

"రండి బాబూ" అన్న పిలుపు. చూచేసరికి రిక్షావాడు. మరలా అదేమాట.

"ఎక్కడికి-?"

"తమరెక్కడికెడితే అక్కడికేబాబూ"

నాకు మతిపోయింది. నేనసలు వాడిని రమ్మనందే!

"నిన్నెవరు రమ్మన్నారని వచ్చావ్" అడిగేను.

"తమరు పిల్చారుగదా. బాబూ" అదో మాదిరిగా అన్నాడు.

"ఛా! ఛా! అసలు నేను పిలవందే"

"అదేటిబాబూ! తమర్లాంటోరే అబద్దాలాడాలా! పొమ్మంటే-పోతాంగానీ-యీమాత్రం దానికే అబద్దా లెందుకండి!" ఓ చిన్న లెక్చరు దంచాడు.

"శాస్త్ర గుర్తించు మాట్లాడు! ఎవడు పిల్చేడు నిన్ను-" మావాడు సీరియస్‌గా
"ఉప్పుడుకదేటి బాబూ! రమ్మని చేత్తో సైగచేశారు. వత్తున్నానన్నా యిని పించుకోకుండా-నాలుగుసార్లు వూపేరు చేయి రమ్మని-మహా అరిజంటుగా" అన్నాడు కొంచెం కోపంగానే!


మేము మొగమొగాలు చూచుకున్నాం-తెల్లమొగాలు-వేశాం-ఏమిటి చేసేది. వాడికో బేడ డబ్బులిచ్చి బ్రతిమాలి పంపించాము-బలే గమ్మత్తులు చేస్తూవుందే నా నల్లద్దాల కళ్లజోడు!

పిక్చరు చూస్తున్నాం-కథ మంచి రసకందాయంలో వుంది. నాకు స్పృహ తప్పింది. తెరమీది ఒక విధవ-సరిగ్గా నా జోడువంటిదే-అచ్చంగా-అదే ప్రేము-అదేషేపు-తగిలించుకొని తయారయ్యాడు. దానితో నా కళ్ళజోడుకు-ఒక ప్రత్యేకత-విశిష్టత-లభించాయి. ఎందుకంటే సినీమాయాక్టర్‌ది నాదీ సమానమే! రేపటి నుంచి లోకమంతా నావంక చాలా గౌరవ దృష్టితో చూస్తారు!...ఇంకా-ఇంకా..." లైట్లు వెలిగాయ్! మరలా తగిలిందిమరో మొట్టికాయ్! తర్వాత సినిమా యేమయ్యిందో నాకు తెలిస్తేగా! యింటికి పోయి పడుకున్నాం!



నేను మాయింట్లోవాలు కుర్చీలో కదల కుండా కూర్చుని యేదో ఆలోచిస్తున్నాను. అలాగ కూర్చునే నిద్రపోవటం నా కలవాటు! కళ్ళజోడుమాత్రం అలాగే వుంది. ఇంతలో మా ఆవిడ స్నానంచేసి తువాలు చుట్టబెట్టుకొని చక్కా వచ్చింది. పలుకరించింది. నేను పలకలేదు. నిద్రపోతున్నాను అనుకుంది. అది మామూలేగా మరి! నేనుచూస్తూనేవున్నాను. కాని నా కళ్ళు మాఆవిడకు కనిపించటంలేదు పాపం! ఇంకేముంది! ఈసారి నాకళ్లు నిజంగా మూతలుపడ్డాయి. నా గుండెలు మహావేగంగా కొట్టుకుంటున్నాయి. లేద్దామనుకున్నాను కాని లేవలేకపోయాను. నేను నిద్రపోతున్నాననే మా ఆవిడ తీరిగ్గా చీర మార్చి కట్టుకుంటోంది. కోకకు ముడివెయ్యాలన్న సంగతి నాకంతవరకూ తెలియనే తెలియదు-ఫాంటు తప్పించి పంచయినా కట్టివుండకపోబట్టి! వెంటనే వరూధిని, ప్రవరుడు జ్ఞాపకం వచ్చారు. మోహావేశంలో కోక ముడివూడిపోయిందని మనుచరిత్రలో పెద్దన వ్రాసింది పట్టి కల్ల-వచ్చి అబద్ధంగా తోచింది. ఎంత యిదైతేమాత్రం-దాని మొఖం మండ-అంత గట్టిముడి-ఒకటికాదు. రెండు-తామంతట నవి వూడిపోవటమే-ఆవర్ణన-అసంభవంగా-అక్రమంగా-అ సందర్భంగా తోచింది. పెద్దనగారిమీద కోపంవచ్చింది. "ఇదేమిటయ్యా! యీ కోతలు. యీమాత్రం చిన్న విషయం యధార్థంగా చిత్రించలేకపోయేవు. యింకెందుకయ్యా నీ చరిత్ర! మనుష్యుల్ని చదవమనకు" అని విసరి పారేశాను. టపీమంది చేయి మంచానికి తగిలి. విరిగినంత పనిజరిగింది. కన్ను తెరచాను. కటికచీకటి-ఆవిడా లేదు. ఆ అందమూలేదు. మనుచరిత్రాలేదు. పెద్దనాలేడు. లైటువేశాను. మా బుడ్డాయిమాత్రం నిద్రపోతున్నాడు నో రావలించి! వెంటనే నా నల్లద్దాల కళ్ళజోడు జ్ఞాపకంవచ్చింది. చూశాను. పాపం టేబిలుమీదనే వుంది. దానికేం తెలుసు నా హృదయావేదన.

మరునాడు, ఇంటికిపోతూ-కారులో-అందరి ముఖాలవంకా, అందులోను ఆడవాళ్ళ, ముఖ్యంగా-పడుచువాళ్ల ముఖాల వంక తేరిపార చూస్తున్నాను. నా చూపు లెంత ఓరగావున్నా-మారుగావున్నా యెవరికీ తెలియవుగా. పట్టప్పుడు ఇతరులకళ్లల్లోకి అందులోను ఆడవాళ్ళ కళ్లల్లోకి అసలు చూడలేం. కాని నా నల్లద్దాల కళ్ళజోడు నాకు చక్కటి అవకాశాన్ని ప్రసాదించింది. అందరి ముఖలక్షణాలు తీరికగా పరిశీలిస్తున్నాను. చివరకు తేలింది. అందరూ నన్నొక వింతమృగంలా చూడటంలేదు కదా అన్న అనుమానం.



కిటికీముందు కూర్చుని అద్దంలో
అందాలు చూసుకుంటున్నాను,
నల్లద్దాలకళ్ల జోడుతగిలించుకుని
...ఆ అమ్మాయి కూడా నా
వంకే నిదానంగా చూస్తోంది.

ఇంటికిచేరాను. నన్ను చూడగానే చేతులుచాపి మీదికురికే మావాడు రమ్మన్నా రావటంలేదు. పైగా నావంక చూచి యేడుస్తూ తల్లిని గట్టిగా పట్టుకుంటున్నాడు. "అదండీ పాపం గానుగెద్దు కళ్ళగంతల్లాంటి మీ నల్లద్దాల కళ్ళజోడు చూచి భయపడుతున్నాడండి!" అంటూ నా కళ్ళజోడు తీసి అబ్బాయిని అందించి లోనికి పోతూవుంది. అంతలో చటుక్కున రాత్రి కల జ్ఞాపకంవచ్చింది.

భోజనాలయిపోయి తీరుబడిగా వున్నానుగదా అని కిటికీముందు కూర్చుని

"అమవసనిశి"

★

వీధి మళుపున పైకి లేచిన
జువ్వ పువ్వులు బద్ధకంగా ఆవులించాయి
చూరు నీడను చుట్ట చుట్టిన
శునకరాజం సామగానం ఆలపించింది.
బద్ధకంగా కోటువిప్పిన మధ్యతరగతి కుటుంబీకుడు
శాకపాకా లేమిటంటూ భార్య నడిగాడు.
జమీన్దారుని దివాణంలో
ఔటు ప్రేల్పులు చూసి చూసీ
గెంతుకుంటూ కుర్ర వెధవా
ఇంటికొచ్చాడు
తండులాలూ నిండుకున్నాయ్, ప్రొద్దుటన్నం
ఆకుకూరా మూతపెట్టీ వుంచినానని భార్య
చెప్పింది.
"నాన్న, నాన్నా నాకునాకూ తిచ్చుబుడ్లూ తిసింద్రీలూ
తపాకాయలు, మతాబాలూ తెచ్చిపెత్తేవా
అల్ల యింటో చూడునాన్నా ఎన్ని ఎన్ని
తిచ్చుబుడ్లూ, తిసింద్రీలూ, మతాబాలూ
కాల్చినారోనూ."
మొండి మొలతో గంతులేసే
కుర్రవెధవా వీపు సర్వం
విమానం మోతెత్తి పోయింది.
శూనిదీర్ఘం మొదలుపెట్టిన కుర్రకుంకని
బుజ్జగిస్తూ
కొర కొరా చూసింది అటువైపు!
చుర చురా కాల్చేటి కోశం
కళ్ళరూపందాల్చి ఆయమ చెంపమీదా
ఛళ్ళుమన్నాది!
బాణసంచా బుట్టతోటీ, కొత్తచీరా జాకెటోటీ
తలుపు తెరుచుకు నాన్నగారూ లోని కొచ్చారు
కళ్ళనీళ్ళూ దాచిపెట్టీ సలకవంకతో తుడుచుకుంటూ
స్వాగతం చెప్పింది నాన్నకి మంచితీర్థంతో,
మతాబా ముత్యాలతోటీ టపాకాయల సద్దుతోటీ
అంధకారపుటమావాస్య కొత్తవెలుగులు
కానక యిచ్చింది.

"శ్వేతకాంత్"

నల్లద్దాల కళ్ళజోడు

అద్దంలో అందాలు చూసుకుంటున్నాను నల్లద్దాలకళ్ళజోడు తగిలించుకుని. మేమున్న యింటివాళ్ల అమ్మాయి చాలా అందంగా వుంటుందని మా ఆవిడ రెండుమూడుసార్లు చెప్పింది. చూద్దామంటే కనిపించదు. నన్ను చూడగానే తుర్రుమంటుంది ఇప్పుడాఅమ్మాయి మా కిటికీ కెదురుగానున్న దారంపటవస్తూవుంది. చూశాను. అబ్బా! నిజంగా చాలా అందంగావుందే! ఇంకా చూస్తున్నాను. ఆ అమ్మాయి కూడా, నావంకే-నిదానించి-చూస్తూవుంది! నేను తల క్రిందికి వంచివుండటము, ఎదురుగా అద్దముండటం చూచి నేను అద్దములో చూచుకుంటున్నాననుకొని నావంక చూస్తూ నిలబడిపోయింది. ఈమారు ఆమెను మరింత శ్రద్ధగా చూశాను. పాపం నాకళ్ళామెకు కనిపించటంలేదుగా నాకు నవ్వువచ్చింది: గడ్డం క్రింద చేయి పెట్టుకొని నవ్వుకుంటున్నాను. నేను అద్దంలో పోజులు కొట్టంకుంటూ మురిసిపోతున్నాను కాబోలు ననుకొని ఆపిల్లకూడా నవ్వుకుంటోంది నోటిలో పైటచెంగు కుక్కుకుంటూ. ఇంక నాకు నవ్వాగిందికాదు. గట్టిగా నవ్వాను. తల పైకి లేచింది. అంతే అందాల చందమామ అదృశ్యమయ్యింది. ఎన్నాళ్ళనుంచో యెంతగా ప్రయత్నించినా చూడలేక పోతున్నయీ అమ్మాయిని యీవేళ యీ విధంగా చూపించి పుణ్యం కట్టుకుంది నా కళ్ళజోడు! ఎంతమంచిది నా నల్లద్దాల కళ్ళజోడు!

★

మేష్టారు:- గొడుగుల వల్ల ఉపయోగ మేమిటి?

విద్యార్థి:- వర్షంలో తడవకుండా ఉండటానికి.

మేష్టారు:- సరే. వర్షంవల్ల ఉపయోగ మేమిటి?

విద్యార్థి:- గొడుగులమ్మేవాళ్లు బాగుపడటం.

సీరియల్ నవల

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

37

తెల్లవారి, తిరిగి బ్యాంకు తెరిచే సమయం ఆసన్నమయేసరికి లారీగారి లౌకిక హృదయంలో ఒక అభిప్రాయం పొటమరించింది. టెల్సన్సు బ్యాంకుభవనంలో, ఒక పరారీఖైదీ భార్యకు ఆశ్రయమిచ్చి, బ్యాంకును చిక్కుల్లోకి తీసుకురావటానికి తనకు ఎలాంటి హక్కూ లేదనుకున్నాడు. లూసీకోసం లూసీ బిడ్డకోసం, తనకున్న ఆస్తిపాస్తులనూ, తన జీవిత సర్వస్వాన్నీ త్యాగం చేయవలసివస్తే, నిశ్చితంగా త్యాగం చేయగలిగేవాడు. కాని బ్యాంకు తనది కాదు; తనపైన మోపబడివున్న బాధ్యతను అలా త్యాగం చెయ్యటానికి తనకు ఎలాంటి అధికారమూ లేదు. లారీ వ్యవహారంపట్ల వ్యవహారంగా నడిచే కచ్చితమైన మనిషి; ఏమి చెయ్యాలా అని ఆలోచించాడు.

ఆయన మనస్సుకు మొట్టమొదట తట్టినవ్యక్తి డిఫార్జ్. పానశాలకి వెళ్లి అతన్ని కలుసుకుని ఆలోచించితే బాగుంటుం దనుకున్నాడు. ఈ కుటుంబం సురక్షితంగా తలదాచుకునే సావకాశంవున్న వసతిని అతను చూపగలడనుకున్నాడు. కాని మరుక్షణంలో ఆ అభిప్రాయం మార్చుకున్నాడు. కారణ మేమిటంటే: అది మరీ కల్లోలంగా జ్వాలలు లేస్తున్న ప్రాంతం; పైగా, డిఫార్జ్ ఆ కల్లోల వాహినిలో నడుందాకా మునిగివున్న మనిషి; ఎటుబోయి ఎటువస్తుందోనని సందేహించాడు.

మిట్టమధ్యాహ్నంవరకూ యెదురుచూసినా డాక్టర్ మానెట్ రాలేదు. ఇంతసేపూ, అనుక్షణం, బ్యాంకుకు యేమి మునుగుతుందోనని కంగారుపడుతున్నాడు లారీ. ఎంతసేపటికీ డాక్టర్ తిరిగి రాకపోవటంతో అతను ఇక ఉండబట్టలేకపోయాడు: తన ఆలోచన లూసీకి చెప్పేశాడు. లూసీ కూడా యేమీ నొచ్చుకోలేదు: 'అవునండీ! మా నాన్న కూడా అలాగే అనుకున్నారు. ఇక్కడ బ్యాంకు ప్రాంతంలోనే యేదైనా చిన్నియిల్లు అద్దెకు పుచ్చుకుందా మన్నారు. చార్లెస్ విడుదలైనా కూడా యిప్పుడప్పుడే యింగ్లండు వెళ్ళిపోవటానికి వీల్లేదుగదా!' అన్నది. లూసీ మాట పుచ్చుకుని, లారీ, అలాంటి చిన్నభాగం యేదైనా అద్దెకు దొరుకుతుందేమోనని, చుట్టూవున్న సందులూ గొందులూ అన్నీ గాలించాడు. చివరికి కొంచెం మారుమూలగా వుండే ఒక గొందిలో ఒక మేడమీది భాగం అద్దెకు కుదిర్చాడు. ఆ మేడ కిటికీలన్నీ యెప్పుడూ మూసేవుంటై. అందుచేత చూచేవాళ్లకి పాడుబెట్టిన దయ్యాలకొంపలా కనుపించుతుంది.

లూసీనీ, లూసీ బిడ్డనీ, దాదినీ తీసుకుపోయి ఆ మేడమీద చేర్చాడు. వాళ్ళకి కావలసిన సౌకర్యాలన్నీ యేర్పాటు చేశాడు. వాళ్ళకు కాపలాకోసం, తన తాలూకు నౌకర్ను క్రంచర్ను కూడా వాళ్ళతో వుండిపొమ్మన్నాడు.

నిమిషాలు లెక్కబెడుతూ, సాయంత్రందాకా డాక్టర్ మానెట్ కోసం యెదురు చూశాడు. బ్యాంకు మూసేసే వేళయింది. అప్పటికీ ఆయనింకా రాలేదు. పోయి తన గదిలో పడుకుని, తరువాత కథాక్రమం యెలా జరగాలా అని తీవ్రంగా ఆలోచించుతున్నాడు. ఇంతలో లేసే యెవరో పయికివస్తున్నట్లు మెట్లమీద అడుగుల చప్పుడు వినిపించింది.

తలుపు తెరిచి చూసేసరికే, ఆ వ్యక్తి కళ్ళెదుట నిల్చుని: 'లారీగారూ!' అని పలకరించాడు.

'విధేయుణ్ణి!—తమరు నన్ను యెరుగుదురా యేమిటి?' అన్నాడు లారీ.

'మీరు నన్ను ఎరుగుదురా?' అని తిరిగి అదే ప్రశ్న వేశాడు ఆ వచ్చిన వ్యక్తి.

'మిమ్మల్ని ఎక్కడో చూసి నట్టే వుంది'—

'బహుశా నా పానశాలలో చూసివుంటారు?'

ఆ మాట వినేసరికి లారీకి ప్రాణాలు లేచొచ్చినట్టయింది: 'డాక్టరుగారు పంపారా?'

'అవును' అంటూ ఆ వ్యక్తి డాక్టర్ మానెట్ స్వదస్తూరితో వున్న ఒక చీటీని లారీగారికి అందించాడు:

“చార్లెస్ క్షేమంగా వున్నాడు—కాని నేను ఇక్కడినుంచి క్షేమంగా బయటికి రాగల అవకాశం ఇంకా దొరకలేదు. చార్లెస్ తన భార్యకు, ఈ వ్యక్తిద్వారా ఒక ఉత్తరం ముక్క పంపించుకోవటానికి మాత్రం అవకాశం సంపాదించాను. ఈవ్యక్తి చార్లెస్ భార్యతో ముచ్చటించటానికి తగిన అవకాశం కలుగజేయండి.—లాఫోర్సు జైలునుంచి—డాక్టర్ మానెట్” అని వుంది.

ఈ ఉత్తరం చదువుకున్న తరవాత లారీకి తల భారందించి నట్టనిపించింది.

'చార్లెస్ భార్యావాళ్లూ వున్న యిల్లు చూపిస్తాను—నా వెంట దయచేస్తారా' అన్నాడు.

'సరే' నన్నాడు డిఫార్జ్. యంత్రంలాగు, మాటకు మాట సమాధానం చెబుతున్న డిఫార్జ్ధోరణి గమనించకుండానే, లారీ నెత్తిమీద టోపీ తగిలించుకుని బయలు దేరాడు. ఇద్దరూ మెట్లుదిగి క్రిందికి వచ్చేసరికే, మెట్లదగ్గిర యిద్దరు స్త్రీలు కనుపించారు. అందులో ఒకావిడ లతలు కుడుతోంది.

'ఓహో! మాడమ్ డిఫార్జ్!' అన్నాడు లారీ—అలాగే లతలు కుడుతూ నిల్చునుండగా మాడమ్ డిఫార్జ్ ని, లారీ, ఇప్పటికి 17 సంవత్సరాల క్రిందట చూచాడు. ఆ స్త్రీ మూర్తిని యింకా అతను మరిచిపోలేదు.

అనువాదం: తెన్నేటి సూరి

★ రెండు మహానగరాలు ★

'అవును నా భార్యే' అన్నాడు డిఫార్జ్. వాళ్ళతోపాటు ఆవిడకూడా కదలటం చూసి: 'ఆవిడకూడా మనతో వస్తారా'? అన్నాడు లారీ.

'వస్తుంది—వాళ్ళని గుర్తు బట్టటానికి వస్తుంది; వాళ్ళ క్షేమంకోసమే—'

ఒక్క క్షణం డిఫార్జ్ ముఖంలోకి సందిగ్ధంగా చూచాడు లారీ—మళ్లా మౌనంగా బయలుదేరాడు, ఆ యిద్దరు స్త్రీలూకూడా వాళ్ళవెంట నడుస్తున్నారు. ఆ రెండవస్త్రీ ప్రతీకారిణి అనే సంగతి పాఠకులకు వేరె చెప్పనక్కరలే దనుకుంటాను.

వాళ్లు నలుగురూ త్వరత్వరగా నడిచిపోతున్నారు. సందు మలుపు తిరిగి మేడమెట్లెక్కారు. దరవాజాదగ్గర జర్రీక్రంచర్ యెదురై, సాల్యూట్ చేశాడు. గదిలో లూసీ, ఒంటరిగా, మోకాళ్ళమీద తల బెట్టుకు ఏడుస్తోంది. ఆ ఉత్తరం చేతిలో బెట్టేసరికి లూసీకి స్వర్గధామానికి యెగిరినట్టయింది. ఆనంద బాష్పాలు రాలుస్తూ, ఆ ఉత్తరం అందించిన డిఫార్జ్ చేతిని ముద్దుపెట్టుకుంది.

"ప్రియమైన లూసీకి! ధైర్యంగా వుండు; మీ నాయన గారికి వున్న పలుకుబడివల్ల మనకు క్షేమం కలుగవచ్చును—నువ్వు నాకు సమాధానం పంపే ఆస్కారం లేదు—బిడ్డకు ముద్దులు'—

ఆ చీటీలో వున్నవి ఆ నాలుగు ముక్కలే; ఆ నాలుగు ముక్కలే లూసీకి ఎంతో ఆనందాన్ని యిచ్చాయి. డిఫార్జ్ చెయ్యి వదలి, కృతజ్ఞతాపూర్వకంగా మాడమ్ డిఫార్జ్ చేతిని అలుముకుని హృదయానికి హత్తుకుంది. కాని మాడమ్ డిఫార్జ్ చేతిలో ఎక్కడా మానవచైతన్యం స్పందించటం లేదు; చల్లటి ఉక్కు పిడికిలి.

ఆ స్పర్శతో లూసీ కంగారై మాడమ్ డిఫార్జ్ ముఖంలోకి బెదురుగా చూసింది. మాడమ్ డిఫార్జ్ కూడా లూసీ కళ్ళలోకి తీవ్రంగా చూస్తోంది. లూసీ కంగారు చూసి, లారీ, నెమ్మదిగా అందుకుని, భయం పోగొట్టటానికి ప్రయత్నించాడు:

'ఏమీ లేదు తల్లీ! వీధిలో అస్తమానం యేవో గందరగోళాలు చెలరేగుతూ వున్నయి గాదూ!—వాటివల్ల నీకేదో ప్రమాదం వస్తుందని కాదనుకో—అథవా అలాటిది ఏదైనా తటస్థించితే నీబోటివాళ్ళకు మాడమ్ డిఫార్జ్ రక్షణనిస్తూ వుంటుంది; అందుకోసం, నీమొహం, పోలికా బాగా గుర్తుండటానికి, ఆవిడ

నిన్ను చూట్టానికి వచ్చారు—అవునా డిఫార్జ్ గారూ?' అంటూ డిఫార్జ్ మొహంలోకి చూశాడు.

డిఫార్జ్ సమాధానం యేమీ చెప్పలేదు—ఏమీ చెప్పాలి అన్నట్టు ఒక పొడిదగ్గు దగ్గి భార్య ముఖంలోకి అదో వెర్రిచూపు చూశాడు

ఆ సంఘటనను మార్దవ వాతావరణంలోకి తిప్పటానికి తిప్పటానికి లారీ నానా తంటాలూ పడుతున్నాడు. 'అమ్మాయ్! లూసీ, పాపాయేదీ?—మనవాళ్ళకి చూపించవేం?—ప్రాస్ ఎక్కడ—అహాఁ!—డిఫార్జ్ గారూ—మా ప్రాస్ చూశారూ! చాలా మంచిమనిషి లెండి!—ఆవిడకి ఫ్రెంచిభాష రాదు,' అని నీళ్లు నమిలాడు.

ఆ సంభాషణ జరుగుతున్నంతసేపూ, మిస్ ప్రాస్, ఈ విదేశీయులు తనకు లెక్కేవిటన్నట్టు అసలు వాళ్ళ అజే లేకుండా అమిత ధీమాగా కూర్చుంది తన ప్రసక్తి వచ్చేసరికి గబగబా లేచి దగ్గిరికి వచ్చింది చేతులు కట్టుకుని ఆంగ్లేయపడుచు దర్జాలో అతి ఠీవిగా నిల్చుని ప్రతీకారిణి వంకచూసి, మెచ్చుకోలుగా: 'బాగున్నావ్!—మంచి ధైర్యంగల మొహం' అన్నది అలాగే మాడమ్ డిఫార్జ్ వంకజూసి కూడా, మెచ్చుకోలుగా ఒక చిన్న యింగ్లీషుదగ్గు దగ్గింది? కాని వాళ్లెవళ్లూ ఈ పటాటోపాన్ని ఖాతరీ చెయ్యలేదు.

లతలు కుడుతున్న సూది, బిడ్డవైపు సూచిస్తూ మాడమ్ డిఫార్జ్ 'ఆయన, కూతురు ఆ బిడ్డేనా?' అన్నది

'అవును తల్లీ—మన ఖైదీ తాలుకు ఏకైక సంతానం' అన్నాడు లారీ.

అంతవరదాకా, మాడమ్ డిఫార్జ్ ముఖాన్ని ఆవరించి వున్న కఠోరాంధతమసచ్ఛాయలు భీభత్సంగా ఆ బిడ్డమీదికి దూకినట్టనిపించింది లూసీ గుండె లెందుకో దబదబా కొట్టుకున్నయ్ గబగబా బిడ్డ దగ్గిరికిపోయి చేతుల్లోకి తీసుకుని హృదయానికి హత్తుకుంది.

మాడమ్ డిఫార్జ్ భర్త వంకతిరిగి—'సరే—చూశాను—ఇక మనం వెళ్ళొచ్చు' అన్నది.

మాడమ్ డిఫార్జ్ మొహంమీది ఆ కఠోర మౌనంలో లూసీకి యేదో ప్రళయచ్ఛాయ గోచరించి గుండెలు దడదడ లాడిపోయినై దిగులుగా, వేడికోలుగా, మాడమ్ డిఫార్జ్ గౌను కుచ్చెళ్లను ముని ప్రేళ్ళతో పట్టుకుని.

'నా పెనిమిటి అమాయకుడు—రక్షించండి—ఆయన కేమీ అపకారం చెయ్యకండి—ఆయన్ను ఒక్కసారి కంట జూచుకునే అవకాశం యిప్పించండి'అని అంగలార్చింది.

'నీ మొగుడు సంగతి నాకు అనవసరం—డాక్టర్ మానెట్ కుమార్తె క్షేమం నాకు కావాలనింది.' అన్నది మాడమ్ డిఫార్జ్.

'అలాగైతే—కనీసం నాకోసం నా భర్తమీద దయ చూపండి—నాబిడ్డను చూచైనా ఆ యన్ను కాపాడండి—ఈ బిడ్డ ఈ చిట్టిచేతులుతో తన తండ్రికోసం మిమ్మల్ని వేడుకుంటోంది రక్షించండి—మీళ్ళందరి కంటే మీవంకచూస్తే మాకెందుకో ఎక్కువ భయగావుంది.'

ఆ చివరి వాక్యాన్ని మాడమ్ డిఫార్జ్ అభినందన వాక్యం క్రిందే తీసుకుంది చూశావా నా తడాఖా అన్నట్టు తన మొగుడి మొహంలోకి ఒక కోరచూపు చూసింది అంతవరకూ అయోమయావస్థలో గోళ్లు కొరుక్కుంటూ నిల్చున్న డిఫార్జ్‌కి గతుకు తిన్నట్టయి స్పృహలోకొచ్చాడు

ఒక చిన్న విషపు నవ్వునవ్వుతూ మాడమ్ డిఫార్జ్ మళ్లా లూసీవంక తిరిగి 'ఆ చీటీలో నీ మొగుడు రాసిందేవిటి?—పలుకుబడి అంటాడేవిటి?'—

లూసీ, ఆ ప్రశ్నతో అలజడి పడిపోయింది—ఆదరాబాదరా హృదయందగ్గిర దాచుకున్న ఆ ఉత్తరాన్ని బయటికి తీసి 'ఎబ్బె! ఏవీ లేదండీ?—మా నాన్నా సంగతి వ్రాశారు—మా నాన్నకు పలుకుబడి వున్నదని'—

'ఆపలుకుబడి తన్ను రక్షిస్తుందన్న మాట'—సరే చూద్దాం,' అన్నది డిఫార్జ్.

లూసీ కలవళపడ్డది. 'పసిబిడ్డతల్లిని—బ్రతిమాలుకుంటున్నాను—నా భర్తను కాపాడండి—ఆయనమీద కోపం బెట్టుకోకండి—మీరు నా తోడబుట్టువులాంటివారు—నా మొహం చూసి కనికరించండి—బిడ్డతల్లిని అంగలార్చి అడుగుతున్నాను'—

మాడమ్ డిఫార్జ్ లూసీకి సమాధానం చెప్పకుండా ప్రతీకారిణి వైపు తిరిగి మొదలెట్టింది

'మనం ఈ లోకంలో కన్ను తెరిచినప్పటినుంచీ, ఎంతమంది యిల్లాళ్లనూ, బిడ్డ లిల్లుల్నీ చూళ్ళేదు? వాళ్ళందర్నీ కనికరించిం దెవరు? వాళ్ళ భర్తల్నీ తండ్రుల్నీ దిక్కూదివానీ లేకుండా జైళ్ళలో పారేసి వాళ్ళకు దూరం చెయ్యటం కొత్త గనకనా? తోటి ఆడవాళ్లు బాధలు పడటం యింతప్పటినుంచీ యెంతోమందిని చూశాం—తమకూ బిడ్డలకూ కూడులేక ఏడ్చేవాళ్లు, గుడ్డలేక ఏడ్చేవాళ్లు, రోగాలతో తీసుకు చచ్చేవాళ్లు, దార్ఢన్యం క్రింద, దిక్కులేకుండా నలిబిలైపోతూ వుండేవాళ్లు—ఎంతమందిని చూళ్ళేదు'

'అవును అంతకుమించి మన జీవితంలో అనుభవించిన సౌజన్యత ఎక్కడ' అంటూ వంత పలికింది, ప్రతీకారిణి

మళ్ళా అందుకుంది మాడమ్ డిఫార్జ్: 'ఇల్లాంటి వన్నీ ఎన్నో వోర్చాం—ఇప్పుడు ఒక యిల్లాలు కంట తడిబెడుతుందంటే—ఒక తల్లి అంగలారుస్తుందంటే మాకు కనికర మేవిఁటి?'

ఆ రెండు ముక్కలూ అనేసి మళ్లా లత కుట్టుకుంటూ బయటికి వెళ్లిపోయింది. ఆవిడ వెంట ప్రతీకారిణీ, డిఫార్జ్ కూడా బయటికి నడిచారు.

కుప్పగా కూలిపోయిన లూసీని లారీ లేవదీస్తున్నాడు: 'ధైర్యంగా వుండాలి తల్లీ!—మనవిషయంలో ఇంతవరకు అంతా సవ్యంగానే వుంది; మనకంటే ఘోరయాతనలు అనుభవించిన వారు ఇంకా ఎంతోమందివున్నారు ఇక్కడికి సంతోషించాల్సిన సంగతి'—

'ఆవిడ ముఖంవంక చూస్తే నా కెందుకో భయంగా వుంది—నా ఆశలన్నీ కూలిపోయేలా వున్నయ్'—

'ఛట్! ధైర్యంగల తల్లివి!—నీ గుండెల్లో ఈ పిరికితనం యేవిఁటి?' అంటూ లూసీకి ధైర్యం చెబుతున్నాడే గాని, అసలు గుండె దిగజారిపోయింది ఆయనకే. ★

"ఒరేరామూ! తమ్ముడికి ఏం కావాలంటే అది ఇమ్మనలా? వాడిందు కలా ఏడిపిస్తావ్?"

"కాదే అమ్మా. పిచ్చికగూడు కట్టమని ఏడిస్తే కట్టిపెట్టానే అది ఇంట్లోకి తీసుకు రమ్మని మళ్లీ ఏడుస్తున్నాడు."

సేవింగ్ లో షేవింగ్

ట్ క్...టక్...టక్...టక్...తలుపు...తలుపు....తలుపు....(తలుపు తట్టుతున్న శబ్దం—)

అమ్మడు (వచ్చి తలుపుతీస్తూ)—

"ఏమండీ! యింత అర్ధరాత్రివరకూ ఎక్కడ నిద్దురపోతున్నారండీ! ఏమిటండీ! అంతకంతకూ-చిన్నపిల్లలైపోతున్నారు. ఓ కబురూ-కాకరకాయా లేకుండా-సినీమా రెండాటలూ చూసూ చూచోపోతే వేళుండగా ఇంటికి జేరుకోరాదూ? పాడు సినీమా పిచ్చి! ఇంతకీ మిమ్మల్నననాల్సిన పరిస్థితి కాదులెండి! అంటూ తలుపుతీసీ-తీస్తూనే ఝుఠాయించేస్తోంది యింటి యజమానురాలు.

వాసుదేవరావు: నోరుముయ్యవే! అవతల స్నేహితుడొకడున్నాడు.

అమ్మడు: మనమే చాల కేడుస్తుంటే-యీ కొంపలో ఇదొకటా! బాగుంది. యిరుకుసందూ, భీముడు బుర్రా.

వా: బాగుంది-మరి ఒకరోజు కట్లాగో-ఊరుకుండూ! హాలోమిష్టర్!...సన్యాసిరాజూ! కమాన్! కమాన్! (స్విచ్ వేసి) చూడు - సన్యాసిరాజూ! ఆ క్యాంపు కాట్ మీద పడుకో-నే నిలా పడుకుంటా.

సన్యా: ఎందుకోయ్! నే నే ఆ ఉయ్యాలబల్లమీద పడుకుంటా.

వా: ఇస్! పడుకోవయ్యా ఏదో రెండు ఘడియలు కళ్లుమూసుకుంటే-తెల్లారిపోతుంది.

స: చంపుతున్నావ్! సరే. ఆ! అన్నట్టు అద్దెలోయ్?

వా: ఇరవైఆరు-గానీ, నిద్రొస్తుంది పడుకో.

(స్విచ్ ఆఫ్ చేసి పడుకుంటాడు)

*　　*　　*

(ఉదయం సుమారు ఏడుగంటలవేళ - స్థలం వంటిల్లు.)

వా: రావోయ్! రాజూ!

స: అహా! నా కలవాటులేదోయ్!

వా: నీ తస్సాదియ్యా-మొహమాటం అయితే ఎలాగోయ్! కప్పు కాఫీకి నిన్న హోటల్లోఉన్న అలవాటు-ఇక్కడ లేదూ?

స: చంపుతావోయ్! అబ్బ-మళ్ళీ-ఈ ఇడ్డీ ఎందుకోయ్? అయ్యబాబోయ్! నే నేం మనిషి ననుకున్నావా? లేకపోతే నన్ను నుకున్నావా? నాలుగు వేసెతే!

వా: నీ అసాధ్యం గూలా! సమయానికి నూతి కెళ్ళిందిగానీ! వింటే చంపేసిపోను యిద్దర్నీ-నువ్ చేస్తున్న హంగామాకి. ఇష్-ఊరోక్క-సైలన్స్.

స: అయ్య బాబోయ్-చచ్చే చిక్కే! (రహస్యంగా) నువు రెండు తీసుక్కో.

వా: ఇంకేం గొడవ చెయిబోకు.

స: (భయంతో) అయితేసరి.

*　　*　　*

స: సెలవ్ వాసూ!

వా: నమస్తే! దయుంచు.

స: నే కాదు; దయుంచాల్సింది-నీవు. సెలవ్ మరి - ఒకవేళ హెడ్‌గుమాస్తాగా రేమైనా చెప్తే; ముప్పావులాడబ్బులుచ్చుకొని వెంటనే టెలిగ్రాం యిచ్చేస్తే! కాకిలావచ్చి వాల్తా.

వా: ఓస్-నువ్వంతగా చెప్పాలిటోయ్?

స: సెలవ్ మరి-నమస్తే-వెళ్ళొస్తా!

శ్రీ దేశరాజు శేషగిరిరావు

వా: నమస్తే! సెలవ్.

స: అన్నట్టు ఎడ్రస్ జ్ఞాపకముందా? వ్రాసుకున్నావ్ కావు.

వా: అడేకదోయ్-వెలంపాలెం-వాల్టేర్ R. S.

స: చంపేశావు - అది కాదోయ్. (వీధిలో బస్ బంయ్ - బంయ్-మంమటూన్న హారన్ శబ్దం) అప్పుడే వచ్చేసింది-వస్తా-వస్తా (అత్రుతగా వీధిలోకి పరుగెడుతూ) ఆపండోయ్-ఆపండోయ్-(కేకలేస్తాడు. అప్పుడే పది అడుగులు దాటేసి కాఫీక్లబ్ దగ్గర ఆగుతుంది.

సన్యాసిరాజు (పరుగెడుతూ) - వస్తా-వస్తానోయ్ ఎడ్రస్: కేరాఫ్ R. M. పాత్రుడుగారు. అస్సాం గార్డెన్సు-వాల్టేర్ రాసుకో-వస్తా మరి.

*　　*　　*

స్థలం: వంటిల్లు-సమయం-10 గం॥ ఉదయం (భోజనాల సమయం)

వా: (భోంచేస్తూ) అమ్మడూ! నీ కంతకంతకు మతిపోతూంది. మరి-బుద్ధిరాదేమో! అనిపిస్తోంది. రాత్రా పెద్దమనిషి విని-ఏం అనుకున్నాడో! మొన్నటికి మొన్న మా తమ్ముడొస్తే విదలించి పారేశావ్! ప్రాయానికి చిన్నవాడైనా - చదువుకు పెద్దవాడేనా? B. A. చదువుతూన్నవాడు ఆమాత్రం అర్థంచేసుకోలేడూ?

అమ్మడు: (విసనకర్రతో విసురుతూ దగ్గరగా కూచుంటుంది) నే జేసిన ఘోర తప్పిదమేమిటి ప్రభూ? ఆయన వాళ్ళకు ఆకుల్లోనూ-కానివాళ్ళకు కంచాల్లోనూ-అన్నట్లుంది మీ వ్యవహారం-మా వెంకటిగాడికి ఏదైనా పనిప్పించండీ-ఏడాదై ఏ పనీ లేక ప్యాసై కూర్చున్నాడండీ అంటే. అందుకు చేతులు రావు-ఎవడండీ ఆ అషాఢభూతి-ఎవరెట్లా ఏడుస్తే నాకేం! నా సంగతేమిటో చూస్తే సరి.

వా: నీకేం నిక్షేపంలా! ఏం తక్కువ చేశాను? నీకేదైనా లోటుచేస్తే అనాలి.

అ: ఓ! అన్నీ చేశారు-అంచుకు తొగరొక్కటే లోటు. గాజులకే గతిలేదు ఇప్పటికి!

వా: ఓ! అదా ఈ దెప్పిపొడుపులకి కారణం-పులుసుపోయ్-చెప్తా!

అ: ఇంట్లో ఇల్లాలు లేదంటే-పెళ్లామా అని పిల్చాడట. చింతపండు తెమ్మని రెండురోజులైంది.

వా: అయితే యింతకూ ఏమున్నట్లు

అ: మజ్జిగవుంది.

వా: అదేపోయ్.

అ: జీతం అందుతే చిల్లర సామాను తెస్తామన్నారు. తెస్తేగానీ, నే వేగలేనీ వచ్చేపోయే వెధవకొంపలో!

వా: నోరెందుకు పారేస్తావ్! మొన్న మా తమ్ముడూ-ఈరోజుకి సన్యాసిరాజూ-వీళ్లేగా చుట్టాలు. ఇంతకీ నీవన్న గాజులు తెచ్చాంలే!

అ: బహువచనం ప్రయోగిస్తున్నారు-యిద్దరూ కలిసి చేసిన బేరంగామోసు.

వా: బేరానికేముంది. ఈ రోజుల్లో! అంతా-ఫిక్సెడ్ రేట్లూ-కెరోస్సు కేష్-బోర్డులేగా. అదిచూచి అట్లాంటివి ఓ రెండురూపాయల గాజులు అట్టపెట్టెలో వేశాను. కోటుజేబులో ఉన్నయ్.

అ: అయితే! ఇంతకూ, నిన్న బిల్లెంత?

వా. రూ 8-0-3



“నోరుముయ్యవే! అవతల స్నేహితు డొకడున్నాడు.”

అ : ఆ కానీకూడా ఎందుకండీ! సేల్సు టాక్సులా చివర-అవునుగానీ ఎందుకండీ అంత ఖర్చు ఒక్క రాత్రికి?

వా : ఆ, ఏదో పోనిస్తూ-వాడొకడు వాడుగా! టిక్కట్లు 2-8-0 జీడిపప్పు ప్యాకెట్స్ 0-4-0 రిక్షా 0-12-0 భోజనం 1-8-0 సిగరెట్లు 1-0-8 మొత్తం. రు. 6-0-8 నీ గాజులు 2 రూపాయలతో ఎనిమిది రూపాయల కానీ.

అ : ఏడిసినట్టే ఉంది-వ్యవహారం-ఇంట్లో పస్తు-బయటదస్తు. ఆమిగతాది నాముఖాన తగలెయ్యండి.

వా : ఏదో పోనిస్తూ!

అ : ఆ గాజులేవీ?

వా : కోటుజేబులో ఉన్నాయనేగా చెప్పింది.

(చేతులు కడుక్కోవటానికి లేస్తాడు)

అమ్మడు గదిలోకెళ్లి కోటు పట్టుకొస్తుంది.

అ : ఇదెవరిదంట! ఈ కోటూ! ఈ వేషం.

వా : (నివ్వెరపోయి) సన్యాసిరాజుదే! తొందర్లో నా కోటు తొడిగేశాడు. అరి వీడి తస్సాదియ్యా! జీతంకూడా అందులోనే ఉండిపోయిందే?

* * * *

సమయం : 11 గంటలు. పగలు.

అమ్మడు ఉయ్యాల బల్లపై ఊగుతూ పత్రిక చదువుతూంది. వీధి తలుపు చప్పుడు.

రావణాఫిరంగులు

"శతఘ్ని" అంటే నూరు మందిని ఒక్కసారిగా చంపివేసేది. అనగా ఒక్కదెబ్బతో చాలామందిని చంపివేసేద అని అర్థం. రామాయణకాలంలో ఫిరంగులు ఉన్నాయి. విశ్వామిత్రుడు శ్రీరామచంద్రునకు అస్త్రవిద్య నేర్పుతూ అనేక అస్త్రములను యిచ్చెను. వానిలో "ఆగ్నేయము" "శిఖరము" అనేవి రెండు ఉన్నాయి.

"ఆగ్నేయమస్త్రన్దయితం
శిఖరన్నామనామతః

"శిఖర" శబ్దమునకు జ్వలించు సాధనమని పండితులు అర్థం చెప్పియున్నారు.

హరివంశములో అగ్న్యస్త్రమును గూర్చిన శ్లోకం.

ఆగ్నేయమస్త్రం లబ్ధ్వాచ
భార్గవా త్సగరోనృపః
జిగాయ పృథివీం హత్వా
తాలజంఘాన్సహైహయాన్.

తా. సగరచక్రవర్తి భార్గవ దత్తములయిన అగ్న్యస్త్రములను గైకొని తాలజంఘులను హైహయులను జంపి పృథివిని జయించెను.

రామాయణంలో ఉన్న అయోధ్యానగర వర్ణనయందు కోటగోడలపై యంత్రములు అమర్చబడినట్లు చెప్పబడింది.

"పెద్దపెద్ద శత్రు వినాశక యంత్రము లమర్చబడిన కోట గోపురములు సర్వాభరణ భూషితురాలగు స్త్రీవలె ప్రకాశించును" అని ఉన్నది.

శతఘ్నులవంటి యితర యంత్ర సాధనములు రామాయణములో చాలా సందర్భములలో వర్ణింపబడియున్నవి. శతఘ్ని యినుముతో చేయబడునని చెప్పబడింది. శతఘ్నుల పరిమాణము పడగొట్టబడిన పెద్దపెద్ద చెట్ల మొదళ్ళవలె "ప్రకాండములవలె" ఉండునని చెప్పబడింది. "వానిని కోటగోడలపై నిలువబెట్టుటయేగాక, యుద్ధరంగంలోనికి కూడా తీసికొని పోయెదరు" అని వర్ణింపబడెను. లంకలో రావణాసురునివద్ద తుపాకులు, ఫిరంగులు ఉన్నట్లు చెప్పబడింది. ఉరుము ఉరిమినట్లుగా ధ్వనిచేస్తూ రివ్వున ఆకాశవీధిని ఎగిరిపోయేగోళము (గుండు) గురించి మహాభారతంలో వర్ణింపబడింది.

ఈ ఫిరంగికి శతఘ్నియని పేరు. ఈ శత్రునాశక యంత్రములను దేవశిల్పియగు విశ్వకర్మ కనిపెట్టినట్లుగా పురాణాల వల్ల తెలుస్తోంది అని "హిందూ ధర్మశాస్త్రము"లో (Code of Gentoo Laws) హాల్ హెడ్ పండితుడు వ్రాసియున్నాడు."

సేవింగ్‌లో షేవింగ్

టక్...టక్...టక్...

అ: వచ్చేపోయేవా రందరికీ తలుపు తీయిచ్చేసగామోలు ఈ ఫ్రంటు పోర్షనిచ్చారు. వెధవ బాధా అని.

(లేచి తలుపు తీస్తుంది)

సన్యాసిరాజు ప్రవేశించి: ఏమండీ వాసు ఆఫీస్‌కి వెళ్ళిపోయాడనుకుంటా?

అ: వెళ్ళక యింట్లో గూర్చుంటే; దినాలు గడవాలిగా!

స: పొరపాటున...నే...నేను...వాడి కోటు.

అ: కోటుమాటకేం-అందులో పర్సిలా పారెయ్యకండి. గాజులపెట్టి కూడా ఉంది టగా!

స: ఆ...అవునండీ...నిన్న...

అ: సరే నా కంతా తెల్సు

స: ఇదిగో కోటు...మావాడితో.

అ: అల్లా పడేయండి.

స: నా కోటు మీ గదిలో...

అ: ఉండండి తెచ్చియిస్తా.

స: (తనలో చచ్చేనురా బాబూ-ఈవిడ వద్ద ఎట్లా ప్రవర్తించాలో నాకేం అర్థం గాకుండా ఉంది.

అ: (కోటుతెచ్చి) ఇదిగో మీ కోటు.

స: అంటే...ఈ పూట నాకు...మ...మరి....బస్సు...లేదండీ....మధ్యాహ్న మెయిలుకే (నీళ్లు నములుతాడు.)

అ: (ఈ వెధవాయింగారికి అత్తిసరు తగలెయ్యాలి కామోసు అని తనలో అనుకొని) అయితే భోజనం చేశారా? లేదా?

స: లేదండీ...పోనీ...హోటలు కెళ్ళిపోతా...

అ: సరే అయితే-(అని తలుపేసుకోబోతూంది.)

స: అక్కగారూ! చిన్న మనవి... చేతిలో డబ్బైపోయింది. వాడొచ్చాక చెప్పొచ్చు-ఓ పన్నెండణాలు యిప్పించండి-అందులో...

అ: పన్నెండణాలేమిటి ఖర్మం (అని పర్సుతీసి (యిందండి-)అంటూ రూపాయి పదిహేనణాల మూడు కాన్లిస్తుంది.

స: ఇంతెందుకండీ?

అ: ఉంచండి-ట్రయినుకూడా ఉండాలిగా మరి. దానితో ఒక నోటు పూర్తయినట్లు లెఖ్ఖ సాగేల్తుంది.

స: సెలవ్...(అని వెళిపోతాడు)

అ: (తనలో) భోజనాలుపెట్టి భోక్తలకు మల్లే సంభావనలుకూడా సమర్పించుకోవాల్సి వచ్చింది. వెధవపట్నం కాపురం

★ సేవింగ్‌లో షేవింగ్ ★

-ఛీ-అని దభాలున తలుపేసుకొని మళ్లీ పత్రిక తీసింది.

*　　*　　*　　*

అ : ఏమండీ ఈ చీరంతో చెప్పకోండి.

వా : నేనేం చెప్పగలను.

అ : చెబితేనే తెలివి!

వా : చెప్పకోలేకపోతే-పరీక్ష పోయినట్టే! ఇల్లాంటి పరీక్షలు ఏ యూనివర్సిటీ కండక్టు చేయదు. సరేగానీ సన్యాసిరాజుకు టెలిగ్రాం యిచ్చాను-అర్జంటుగా M. O. చేయమని.

అ : ఏడిసినట్లేఉంది-ఏంటా తొందర? ఏలినవారు సొమ్ము ఏట్లో పడిపోదంటారు. అదిగో మీ కోటూ-మీ పర్సూ.

వా : భలేతమాషాగా ఉందే! నాకేం అర్థం కావటంలేదు.

అ : అర్థానికేముంది? మీ కోటిచ్చి ఆయన దాయన పట్టుకెళ్ళాడు.

వా : పాపం! ఎంత నీతిపరుడో చూశావా మరి!

అ : ఓ! చాలా నీతి-మీ బిల్లును రౌండాఫ్ చేయాల్సొచ్చింది కూడా!

వా : అంటే?

అ : అరటిచెట్టు పూర్తయింది.

వా : నాకంతా అగమ్యగోచరంగా ఉంది.

అ : అతనికి భోజనానికి డబ్బు లేదంటాడు. పన్నెండణా లివ్వమన్నాడు. పన్నెండణాలేం ఖర్మం; 1-15-9 ఇస్తే పది పూర్తవుతాయి-పాపం రైలు ఖర్చు కూడా కలిసొస్తుందని అట్లా చేశా.

వా : ఏడిసినట్లే ఉంది నీ తెలివి-నేనో పది హేనణాలు టెలిగ్రాంకి తగలేశా.

*　　*　　*

అ : ఇంక ఈ సంసారంలో ఎంత కష్టం చేసినా-ప్రతీ శాంతా పనికిరాని ఖర్చులే పద్దులో కనబడుతూంటే గట్టెక్కేలా లేదు నా మటుకు.

వా : పోనిద్దూ; దానిమాటకేంగానీ-చీర ఖరీదెంత?

అ : రూ 17-0-0

వా : ఏడిశావ్-వలపట్ట పదిహేను రూపాయలంటావ్. ఆ ఖరీదుకు కోయంబత్తూరు చీరలొస్తున్నయ్. మహా అవుతే పది రూపాయలు.

అ : (బిల్లు తెచ్చి) ఎంతో చూడండీ!

వా : అనొచ్చు-బిల్లు పదిహేడే! మన యింటివారబ్బాయికి నాణ్యం తెలియదు. (చీరంతా చూసి. లేబిల్ చూస్తూ;) చూశావా? లేబిల్ మీద రూ 11-0-0 లే ఉంది.

అ : (చూసి విస్తుపోయి) అవునండీ. సరే కుర్రాడు సాయంత్రం రాగానే యిప్పించేసి ఇంకొకటి తెమ్మంటా.

*　　*　　*　　*

అ : అదేమిటండీ ఆ ప్యాకెట్

వా : ఆ అదే-నేను పదిరోజులనుండీ అనుకుంటున్నా-ఈ వెధవ చలిబాధ పడలేక-అందుకని అసలు "లూధియానా" స్వెటర్లు రెండు తెచ్చేశాను. నీ కొకటీ-నాకొకటీ-

అ : ఇంక మిమ్మల్ని విశాఖపట్నం పిచ్చాసుపత్రిలో చేర్పించటానికి మా వాళ్లను రమ్మని యిప్పుడే వైర్ చేయాలి.

వా : నీ ప్రవర్తన నాకేం బోధపడలేదు. ఎందుకా గాభరా! అసలు ఇంకా నయం-అందరికీ ఒక్కొక్కటి 18-0-0 కిచ్చి నాకు 16-0-0 చొ॥ రెండూ ఒక్కసారి కొన్నానుకదా అని యిచ్చాడు.

అ : తెలివిగానీ-దక్కటి శాలువా ఒకటి 18-0-0 లయినా యిచ్చికొంటే... పనికిరాదూ? నేను సేవింగ్ చేస్తూంటే-మీరు షేవింగు చేస్తున్నారు-నే నీ ఊళ్లో ఒక్క నిముషం ఉండను. పదండి మన ఊరే పోదాం. "మడిదున్నుకు బ్రతుకవచ్చు మహిలో సుమతీ" అన్నారు. పండించుకొని పదిమందికి పెట్టి మనం తినొచ్చు. పట్నవాసంలో చలామణీ కానివార్ని-పల్లెలకు పంపేయాలని నేనో తీర్మానం చేస్తును-ఎసెంబ్లీలో నాకే సీటుంటే— ★

"మా శాపురా, నన్ను గాడిద అన్నాడు వాడు?"

"అల్లాగేం? భస్తే ఋవ్వు కోక్కు"

"మరేమి చెయ్యమంటావ్?"

"చేతనైతే ఋజువు చెయ్యమను."

15 సంవత్సరములకు లోనైన పిల్లలను మలేరియా అతి తీవ్రముగా సోకును.


మలేరియా మన జాతిని నిరంతరము భయ జ్వాలలతో ముంచి తేల్చుచున్నదను విషయము పై కనిన భయంకర నిరూపణయందే ప్రతిబింబించుచున్నది.

భావి కాల ప్రజాసంపదకనుకగు బుద్ధి ఆరోగ్య వికాసములకు పునాదు లేర్పరు పాటాపత్ర్యపడు యీ వయసులో, మలేరియా యొదుగు పిల్లల, దేహ, బుద్ధిబల తత్వముల కృంగ దీయుచున్నది.

మలేరియా మారినుండి రక్షింప గల అవకాశముల పిల్లల కందివ్వకున్న వారి భవిష్యత్తును, కుటుంబ శోధనే గాక మన దేశ సౌభ్రాగ్యతను కూడ నిర్లక్షు పరచినట్లగును.

'పాలుడ్రిన్' తో మీ పిల్లలను రక్షించు కొమ్మని మా హెచ్చరిక. ఆ రక్షను మీరు కూడ పొందవలెనని మిమ్ము కూడ హెచ్చరించుచున్నారము. 'పాలుడ్రిన్'ను పసి పిల్లలు, నిండు గర్భిణులు సక్రమముగా నిరపాయముగ సేవించ వచ్చును. మోతాదుల వివరములు క్రింద తెలుప బడియున్నది.

మలేరియా రోగకారణమైన దోమ ఒక కాటుతో మలేరియా క్రిములను నీ రక్తములో ప్రవేశపెట్టును. యెప్పుడును యేటవాలుగా మూగు ఆ దోమను నీవు సులభముగా గుర్తింప గలవు. వీటి అభివృద్ధి కాధారమైన నీటి నిలువలు ఇండ్ల పరిసరాలలో వుంచ కుండిన మలేరియా బారి నుండి తప్పుకోగలరు. నిదురించు నపుడు దోమతెరను వాడుడు. దోమలను చంపుటకు 'గమెక్సేన్' క్రిమి కీటక సంహారిణిని మీ గృహములయందు చల్లియుంచుడు




యీ అపాయకర చిహ్నముల గమనింపుడు:

మొదట చలిచే వణికించును. జ్వరము తగిరి చెమటలు పోయును. దేహమంతట నొప్పులు. తీపులు పుట్టును. యీ సూచనలను అశ్రద్ధ చేయక తక్షణమే వైద్య సలహా తీసుకొనుము. అప్పుడు నీకు మలేరియా సోకయున్న 'పాలుడ్రిన్' సేవించిన కొద్ది రోజులలో నయమగు ననియు, యికముందు రాకుండుటకు, అది ఎట్లు తోడ్పడ గలదో కూడ వైద్యుడు నీకు తెలియ పరచును. స్వచ్ఛమైన 'పాలుడ్రిన్' పుల్లిపార కాగితములలో ఆరోగ్య విధానముగా సీలుచేయబడినవే దొరకును. మాత్ర ఒకటి ఒకనా మాత్రమే.

'పాలుడ్రిన్'

మలేరియాను తరిమివేయును





సేవించు విధానము

చికిత్సకొరకు: పెదివయసుగలవారు, 12 యేండ్లకు మించినవారు ఒక మాత్ర వాడవలెను.
6 నుండి 12 సంవత్సరములలోగల పిల్లలకు అర్థ మాత్ర.
6 సంవత్సరముల వయస్సు మించని పిల్లలకు పావుమాత్ర చొప్పున ప్రతి దినము జ్వరము తగ్గువరకు యివ్వవలెను.

రక్షణార్థం: మోతాదు పై కనుపరిచినట్లే కాని వారమున కొకమారి నిర్ణీతమైన దినముననే సేవించుచుండవలెను.

'పాలుడ్రిన్'ను భోజనానంతరం సేవించి జలమునైనను, పాలనైనను ధారాళముగా త్రాగవలెనునది జ్ఞాపకముంచుకొనవలెను.

ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్

ICP 77

విరిగిన మనస్సు

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

రామారావు తృళ్ళిపడ్డాడు. హఠాత్తుగా ఏ భూతాన్నో చూసినంతగా వెనక్కి తూలడంలో తన వెనకున్న మంచంమీద కూలబడ్డాడు. నడుం కలుక్కుమంది. కాని, గుండెలో ముందుగా సవరించుకున్నాడు. రొమ్ముమీద సవరిస్తున్న చేతికి తాపామర్పామోత వినబడింది. ఆశ్చర్యపడి తనను తనే ఎగాదిగా చూచుకున్నాడు.

తన దుస్తుల్లోగాని, తన క్కనిపించిన శరీరభాగాల్లోగాని తానింతగా ఝడుసుకోడానికి కారణం కనిపించలేదు. గుడ్డల యిస్త్రీ మడతలు-తను పైకి మడిచిన చేతులు తప్ప మరెక్కడా నలగలేదు. శరీరం నిగనిగలాడుతూంది-దబ్బపండులా. అవి తన చిన్నప్పట్నుంచీ వున్నట్టే యిప్పుడూ వున్నాయి గనుక తనను జూచి తనే తృళ్లిపడవలసిన కారణం ఏముందీ?

మంచంమీదినుంచి లేచి మళ్ళీ గోడదగ్గర కెళ్ళాడు. భార్య కాపురానికొచ్చిన నాటి దగ్గర్నుంచీ ఎక్కడుందో-ఆ మేకునే వ్రేలాడుతూంది అద్దం. అలవాటుప్రకారం కుడిచేయి అద్దం వెనుకనున్న దువ్వెనని తీసుకుంది. కాని; మామూలుగా అద్దంలోకి చూడగానే కనిపించవలసిన నవ్వుముఖం కనిపించలేదు-గొగ్గు గొగ్గుల రేగడి మట్టికింద కందగడ్డ కనిపించింది. రామారావు క్రింది పెదవిని పళ్ళమధ్య బిగించాడు. కళ్లు మసకలాడుతున్నాయ్. ఇంతకుముందు తను ఝడుసుకుంది యీ మొఖాన్ని చూచేనా?

కళ్ళలో నీళ్లు నిండాయ్. క్రింది పెదవిని వదిలేశాడు. కన్నీరు జుటజుటా కారిపోయింది. పంచె కొంగుతో ముఖం తుడుచుకుని, కుడిచేతి దువ్వెన్న తలమీదికి పోనిచ్చాడు. అద్దంలోకి చూస్తే-మధ్య పళ్ళూడిన తెల్లదువ్వెన, తన నొక్కు నొక్కుల జుత్తును తృప్తిగా దువ్వలేకపోతూంది. దువ్వెనని కళ్లదగ్గరకి తెచ్చుకు చూశాడు. మిగతా పళ్ళకు నూనె మడ్డికూడా పట్టింది. అందుకేనేమో, తను తృళ్ళిపడింది?!

కాదు కాదు!! ఇలాటి సాకుల్తో తన భయం తీరడంలేదు. అంతకుముందు తనకద్దంలో కనిపించి తృళ్లిపడ జేసింది కందగడ్డా గాదు, దువ్వెనా గాదు...తన ముఖమే...అప్పుడా ముఖంలో తనకి-రంపం పట్టుకున్న నరకలోక సిపాయీ కనిపించాడు; ప్రశ్నార్థకాల అంబుల పొదిచాటున మసగబారిన తన ముఖం కనిపించింది.

ఎందుకు? ఎందుకింత జరిగింది?

దువ్వెనని యథాస్థానంలో వుంచి, మెల్లగా మంచంమీదికి వెళ్ళి కూచ్చున్నాడు. ప్రశ్నార్థకాలు అంబుల పొదిలోంచి లేచి తన కళ్లముందు నృత్యం చేస్తున్నయ్. ఎందుకు? ఎందుకింత జరిగింది?

కాలేజీలో చదువుకునే రోజుల్లో తానెంత 'యిది' గా వుండేవాడు? ఆ రోజుల్లో తను స్త్రీలనుగురించి ఎలా అభిప్రాయ పడేవాడు? తోటి విద్యార్థులు స్త్రీలంటే 'సీతాకోక చిలుకలనీ;' 'పురుషుల ఆనందంకోసం సృష్టింపబడ్డవాగనీ;' 'వ్యామోహింపజేసి, లాలసత్వం పెంచెత్తి, పురుషుల్ని వశం చేసుకోవడమే వారి పనని వాదించేవారు. ఆ అభిప్రాయాలమీద నమ్మకంతోనే వాళ్ళు ప్రవర్తించేవారు.

కాని; తనో? స్త్రీకి ప్రత్యేక గౌరవస్థానం వుందనీ; స్త్రీ భార్యగాక మాతృస్వరూపిణి కూడాననీ; ఆమెలో పురుషుని కంటె ఉదాత్త భావాలుంటాయనీ వాగం

విరిగినమనస్సు

చేవాడు. పురుషుడు స్త్రీని తనవంటి మానవ వ్యక్తిగా గ్రహించి, సదవకాశాలన్నిటినీ కలిగించి, తనతో సమానమైన ప్రతిపత్తిని కలిగించినవాడు–సంసారాల్లో రకరకలకూ, కీచులాటలకూ, అసంతృప్తికీ తావుండదని ఘట్టిగా వాదించేవాడు.

వాదించడమేగాదు, తను చెప్పిన వాటిని నమ్మి చరించేవాడు. పెళ్లిజేసుకున్న మిత్రులకి తనెన్ని విషయాలో జెప్పి–గురుతుల్యుడుగా వుండేవాడు. ఏ భార్యాభర్తల మధ్య ఏ చిన్ని పొరపొరలొచ్చినా తనకు తెలిస్తే వూరుకునేవాడుగాదు. మెల్లగా వాళ్ళ అసంతృప్తికి కారణాలు తెలుసుకునేవాడు. వారి వారి ఆర్థికస్థితుల్నీ, మనస్తత్వాలనీ జమాఖర్చుచేసి–ఫలానా విషయంలో ఫలానా లోటువున్నదని గ్రహించేవాడు. అంతటితో ఆగక ఆ భార్యాభర్తలతో యథాలాపంగా మాట్లాడి వారిలోని అసంతృప్తి పోయేందుకు తగు సలహాలను ఎంతో చక్కగా, ఎవరూ నొచ్చుకోకుండా, అరటిపండొలిచి చేతిలోపెట్టినట్లు చెప్పేవాడు.

తన యీ సలహాలవల్ల తన మిత్రులనేకుల సంసారాలు, దాంపత్యశోభలు తృప్తితో వికసించాయ్. అనేకమంది తను ఆదర్శపురుషుడని మెచ్చుకునేవారు. ఇంత అనుభవ, ప్రస్తుతులు లభించినతర్వాతనే తను పెళ్ళిచేసుకున్నాడు. తలిదండ్రుల చిరకాలవాంఛితం ప్రకారం మేనత్తకూతురు 'కస్తూరి'నే పెళ్లిచేసుకున్నాడు. ఆమె తనంత చదువుకోలేదనీ, విజ్ఞానికాదనీ, సంస్కారభావాలు అంటలేదనీ తనకు తెలుసు. ప్రపంచంలోవున్న రకరకాల స్త్రీలలో ఎలాటి స్త్రీనైనాసరే–తానే భర్తయితే–సంస్కార భావాలను మప్పగలననీ; ఆమే తనూ మమైక్యతను సాధించుకుని; దాంపత్య జీవితాన్ని ఎంతో తృప్తితో, ఆదర్శవంతంగా నడుపుకునేట్లు చేయగలననీ రామారావు నమ్మక, సహేతుకమైన గర్వం.

దాంపత్యయాత్రలో విజ్ఞానయుతమైన తృప్తిని సాధించడంతో రామారావుకు తన తెలివి తేటలమీద, శక్తియుక్తులమీద సహస్రాధికమైన నమ్మకం పాదుకుపోయింది. ఈ అయిదారేళ్ళలోనూ తనయింట్లో ఏ పొరపొచ్చేలూ లేవు. క్రమబద్ధమైన సంగీ

విరిగిన మనస్సు

తంలావుంది తను సంసార జీవనం. కాని! కాని!-

మెల్లగా నడుంవాల్చి, దిండులో ముఖం దాచుకున్నాడు. రెండుచేతులా తలను పట్టుకుని క్రిందికి అదుముకున్నాడు. కళ్లు గట్టిగా మూసుకున్నాడు. కళ్ళల్లో కారు చీకటి కమ్ముకుంది. ఆ చీకటిలో నీటి బుడగల్లాంటి సున్నాలు బయలుదేరాయ్. అవి చిన్న చిన్నవిగా ప్రారంభమై పెద్దవిగా విశాలమౌతూ మాయమౌతున్నాయ్. ఒకదాని స్థానే పది - వంద - వెయ్యి - లక్షో పలకులుగా బయలుదేరి, గజిబిజిగా ఖండించుకునే వృత్తాల్లా తిరుగుతున్నాయ్. ఆ వృత్తాల, ఖండనాల వెనుకగా - అర్థ చంద్రాకారంగా వంగిన కళ్ళు లీనా లీనంగా కనిపించాయ్. ఆ కళ్ళచివరల జలపాతాలు - ఆ కళ్ళమధ్య అదురుతున్న ముక్కు. దానిక్రింద గాలికి చలిస్తున్న అకుల్లా, కదులుతున్న ఎర్రని పెదేలు.

రామారావు కిప్పుడా సున్నాలు కనిపించడంలేదు. ఆ విచలిత ముఖం సుస్పష్టమవుతూంది. ఆ ముఖంమీద ఉవ్వెత్తుగా లేగిన జుత్తు ప్రశ్నార్థకాలుగా తనమీది కురుకుతూంది. అది కస్తూరిముఖం - తన భార్య కస్తూరిది!! అంతకుముందెన్నడూ ఆ ముఖం అలా వుండడం అతను చూడలేదు సరిగదా - వూహించనైనా లేదు. మరి ఏం జరిగింది? ఎందుకు? ఈ కస్తూరి ముఖానికీ - తను తృళ్ళిపడ్డానికీ సంబంధం ఏమిటి?

శ్వాసబరువు హెరింది. బోర్లా పడుకున్నవాడల్లా వెల్లకిలా తిరిగాడు. గుండెలు సవరించుకుంటూ కళ్లు తెరిచాడు. పెదిమెలు నాలికతో తడుముకున్నాడు. దాహమయింది. లేచి వెళ్ళాలనిపించడంలేదు. వంటింటో వున్న కస్తూరిని పిలవాలనీ అనిపించలేదు. నాలికతో ఎంత తడిపినా పెదేలు తక్షణమే ఆరిపోతున్నాయ్. తనకు వూహా తెలిసినతర్వాత యిలాటి అనుభవం యెరగడు. ఇప్పుడంతా కుదించుకుపోయిన మలేరియా జ్వరం రోగిగావుంది. ఎందువల్ల? ఎందుకిలా జరగింది?

సంజెచీకట్లు గదిలో కొస్తున్నాయ్. రామారావు ప్రశ్నావళి కంతంలేదు. తనింత ఉక్కిరిబిక్కిరి కావడాని క్కారణం కోసం వెదుకుతున్నాడు. ఈ వాయు దిగ్బంధన ఎప్పుడు ప్రారంభమయిందా అని ఆలోచించాడు. ఆ మధ్యాహ్నం



భార్య ఆస్పత్రిలో ప్రసవ వేదన పడుతోంది. భర్త ఆందోళనతో వరండాలో అటూ ఇటూ తిరుగుతున్నాడు కబురు చెప్పటానికి నర్సు వచ్చింది. చాలా గాభరాగా భర్త అడిగాడు:

"ఏమైంది? అబ్బాయా అమ్మాయా?"

ఆయన కంగారు చూసి నర్సుకు కూడా కంగారులో నత్తి వచ్చింది:

"ము ముమ్మ ముమ్మ ముమ్మ..."

"ముగ్గురు పిల్లలా! బాబోయ్."

"కక్క క్కక్క కాదండి. అ అ అ అ..."

"ఆరుగురే? నిజంగా? చచ్చాను..."

టిఫిన్ తీసుకునేప్పుడు కూడా ఆఫీసులో తోటి గుమాస్తాల సందర్శి నవ్వుల్లో ముంచెత్తాడు. గంగరాజు తనవద్దకొచ్చి, గ్లాసులోని కాఫీచప్పరిస్తూ తాగుతూంటే, "ఏమోయ్! మళ్ళీ గృహయుద్ధం జరిగిందా ఏమిటి?" అని అడిగాడు. గంగరాజు "అనగా, యీనగా అని రోజూ పోరితే ఎంతకాలం భరించనోయ్?!



ఏదో విషయంమీద ఇద్దరు మిత్రులు తీవ్రంగా వాదించుకుంటున్నారు.

ఒకడు:- "వెధవ డబ్బు! డబ్బు సంపాయించాలంటే కొన్ని వేల మార్గాలున్నాయి."

రెండో వాడు :- "కాని వాటిలో గౌరవనీయమైన మార్గం ఒకటే ఉంది."

మొదటివాడు :-ఏమిటది?"

రెండోవాడు :- "ఆ; అడుగుతావనే అనుకున్నా. నువ్వామార్గం వదిలిపెట్టి ఎన్నాళ్లయిందో ?"

*

వంద తిట్టాడు. "మూర్ఖుడువీ; క్రూరుడువీ గాకపోతే భార్యనట్లా కొట్టుకుంటారా? ఆమె అమాయకత్వంవల్ల మూర్ఖతవల్ల తప్పు చేస్తే నువ్వు అలాటి తప్పుడుపోకడే పోవాలా?మన ఆర్థిక స్థితిగతులు వగైరా విడమర్చి చెప్పి, దోవలోకి తీసుకురావాలి గాని యిదేవటోయ్ నాగరికులు చెయ్యవలసిన పనీ? ఛీ" అని తుపుక్కున వుమ్మేశాడు. గంగరాజు సిగ్గుపడిపోయాడు.

ఇదంతా తనగ్గుర్తేవుంది. ఆ తర్వాత గంటసేపూ ఆఫీసు పని పూర్తిచెయ్యడంలో గడిపాడు. బాగానే వుంది. ఆఫీసు వదిలి యింటికి బయలుదేరేసరికి చేతులు కోటు జేబుల్ని వెదికాయ్. --లి దొరికింది. పాపకు పాలడబ్బా సంగతి గుర్తుకొచ్చింది. అదే మొదలు చేసింది...

ఈరోజు 28. మూడు రోజుల్లో జీతం వస్తుంది. రెండు రూపాయ లప్పు తీసుకుంటే సరిపోతాయ్. మిత్రుల్నందర్నీ అడిగాడు. ఒకడు "లోగడ నువ్వే నాలుగూ, అయిదూ అప్పిచ్చేవాడివి. యిప్పుడు నువ్వే అప్పడగడ మేమిటోయ్?" అన్నాడు ఆశ్చర్యంగా. తను "మిగిల్చిన డబ్బు కాస్తా పురిటి ఖర్చుల కైపోయిందోయ్" అని చెప్పాడు. అందరూ శూన్యహస్తాలే చూపించారు. "గుమాస్తాల జీవితాల్లో నెలాఖరున డబ్బు నిలవవుండడం ఈ జన్మలో చూడం" అన్నాడు గంగరాజు. రామారావు అంతేగావల్ను అనుకున్నాడు.

ఎప్పుడూ సరుకులు కొనే కొట్టు శెట్టి నడిగితే అప్పు లేదన్నాడు. ఇలాటి యిబ్బందులొస్తాయనే రెండు రూపాయలు దాచుంచితే కస్తూరి తగలేశింది. చంటి వాడి కేసబ్బయితే ఏమిటో—కుటికూరా కొంది. 'మనకు మించిన ఖర్చం'టే; 'వళ్లు నిగనిగ లాడుతుందని ముచ్చటపడి కొన్నా

★ విరిగిన మనస్సు ★

రెండురోజుల్నుంచీ వేళకు వంట కూడా చెయ్యడంలేదు. మళ్లా యివ్వాళ పొద్దున్నే సాధింపులు మొదలెట్టింది. నువ్వు చెప్పిన సలహాప్రకారం మౌనం వహించాను. చట్టి దీసి కుర్రాడి నెత్తిమీద బద్దలు గొట్టింది నిష్కారణంగా. వాడాడుకునే బెత్తంతీసి నాలు గంటించాను. క్షణంలో వంటజేసి టైముకు పెట్టిపంపింది" అన్నాడు విజయగర్వంతో.

రామారావు నాలుగు చివాట్లు వేశాడు, వండీ' అంది. ఇప్పు డెలాగు? పాలడబ్బా లేకపోతే పాప కెలాగు? ?

చేసేది లేక యింటి కొచ్చాడు. ఉయ్యాల్లో పాప గేరుగేరుమని ఏడుస్తూంది. తను కోటుతీసి వంకెకు తగిలించాడు. పాపను సముదాయిస్తున్న కస్తూరి "మీ నాన్నారు పాలడబ్బా తెచ్చారమ్మా" అంటూ వచ్చి కోటుజేబులు వెది

(25-వ పేజీ చూడండి)

పరారి

(నాటిక)

జాన్ గాల్స్‌వర్దీ

ఏడో ఘట్టం

[గంటసేపు గడిచింది. మైదానం చివర ఒకచోట. నూతి అంచున ఒట్టి నేలపైన డెనాంట్ ఒత్తిగిలి పడుకుని వుంటాడు. నిద్ర నటిస్తాడు. చీకటి పడగానే దారి తియ్యాలని అతని సంకల్పం. బలిష్ఠుడైన ఒక కార్మికుడు ప్రవేశిస్తాడు. చేతిలో పలుగుంటుంది. డెనాంట్‌ని సమీపించి పరిశీలనగా చూస్తాడు.]

డె: ఏం సంగతి? ఎందుకలా చూస్తావ్?

కార్మికుడు: ఏం లేదు! పరారయిన ఖయిదీకోసం చూస్తున్నాం.

డె: ఓహో! బాగానే వుంది. చూశావ్ గా! ఇంక వెళ్ళి తుమాపణ చెప్పుకుని.

కా: (అతను ఖైదీ కాడేమోనని అనుమానం తగుల్తుంది) నిత్తం, తమరు కారని తెలిస్తే...

డె: ఎవరిదగ్గిర పని చేస్తున్నావ్?

కా: ఈ బూవంతా మా దొరగారిదండి, బ్రౌనింగ్ దొరగారు; ఆరిదగ్గిరుండానండి.

డె: ఖరే! నేను బ్రౌనింగ్‌తో మాట్లాడతాను నీకథంతా ఏమిటో! చిత్రం! నన్ను చూసి ఖైదీ అనుకున్నావట!

కా: నిత్తం! ఆర్ని సూడండి. అద్దదే మేలండి. (అంటూ దొరని వొక పాలికేక పెట్టి పిలుస్తాడు) మాకు కవురొచ్చినాదండి, ఆడు కారోటి నూకేసి ఇటేపొచ్చాడని, ఉట్టికారు ఊరుసివ రొదిలేసినాడంటండి.

డె: నాకూ కారుకీ ఏం సంబంధమోయ్?

కా: నే నందు కంటల్లేదండి. ఆ చంగతేదో మా కామందులోరికే తెల్చునండి.

డె: అదేదో నేనే వెళ్ళి మాట్లాడతానుండు. (లేవడానికి ప్రయత్నిస్తాడు)

కా: (చేత్తో వారిస్తూ) అహహ. వొద్దండి. మీ రిక్కడే కూకోండి. ఆయనే వొస్తా రిక్కడికి.

డెనాంట్: ఇదిగో ఇల్లా చూడవోయ్! నువ్వు బుద్ధిమంతుడవ్ కానీ, నా మాటా తీరూ ఖైదీలాగున్నానా?

కా: ఎట్టాగండి సెప్పేది? నేసెప్పడూ సూణ్నేదండి. అల్లు బత్తీవోళ్ళే కాదండీ. కానామంది అంతే నంటండి.

డె: అరె! నేను ఖైదీన నెందు కనుకుంటున్నావోయ్? నావారిని పోయేవాణ్ని నేను. చివరికి నీకు మాటొస్తుంది చూసుకో.

కా: (బుర్ర గోక్కుంటూ) మీరు కాకుంటే, ఇలాటి సోటెందుకు దాక్కున్నారండి మరి?

డె: దాక్కున్నానా? ఇక్కడ చదునుగా వుందని ఒక్కసారి నడుం వాల్చానంతే. (అంటూ ఒక్క ఉదుటున లేచి నిలబడతాడు. కార్మికుడు పరుగెత్తుతాడు. ఇంతలోనే ఇంకో కార్మికుడూ, అసలు రైతూ వచ్చి అడ్డుపడతారు. (వాళ్ళకూడా పదమూడేళ్ళ ఒక చిన్నపిల్ల వస్తుంది.)

రైతు: ఆ! ఆ! అక్కడి కాగండి. తప్పుకోండిరా మీ రిద్దరూ. ఏమయ్యా! నా జాగాలో కెందుకొచ్చావ్? నీ పేరేటి? ఎందుకొచ్చావో చెప్పు. అచ్చంగా నీకు మల్లేనే టోపీ అదీ తగిలిచ్చుకుని ఖైదీ ఒకడు పారిపోయాడంట.

డె: మీరేనా బ్రౌనింగ్?

రైతు: అవునయ్యా, అయితే?

డె: నాపేరు కెప్టెన్ మాథ్యూ. నేను బస్తీలో హోటల్లో ఉంటున్నాను. ఇక్కడేదో పొరపాటు జరిగుంటుంది. వీడొచ్చి నన్ను పారిపోయిన ఖైదీ అంటున్నాడు. దీ నర్థమేమిటో చెప్తారా?

రైతు: (డెనాంట్ మాటతీరు చూసి తెల్లబోతాడు. పెద్దమనిషిని చూసి పొరపడుతున్నట్లు సంకోచం కలుగుతుంది.) అది కాదండీ. ఈ చుట్టుపక్కల పరారైన ఖైదీ ఉన్నాడంటే మేం కొంచెం నిగామీదున్నామంతే. (పిల్లవంక తిరిగి) అమ్మాయి నువ్వెల్లు. (అమ్మాయి కదల్దు. డెనాంట్ వంక అబ్బురపడి చూస్తూవుంటుంది. ఈమారు డెనాంట్‌తో అంటాడు) పోలీసాయన ఇప్పుడేవొచ్చి కవురు చెప్పాడు.

డె: పోలీసు ఇక్కడే వున్నాడా? ఉంటే అతని దగ్గిర కెడదాం పదండి.

రైతు: అక్కల్లేదు. ఆయన్నిక్కడికే రమ్మంటాను. ఒరేయ్ నువ్వెల్లి పిల్చుకరారా; ఆ కారుకాడుంటా డాయన.

[కార్మికు లిద్దరు వెళ్ళిపోతారు.]

డె: ఇది అక్రమంగా ఉందే! మీకేనా తెలియక్కర్లేదండీ?

రైతు: అహాఁ. మిమ్మల్ని ఏమీ అంటం లేదయ్యోవ్. ఆడు అచ్చం పెద్దమడిసిలాగే వుంటాడంట మరి. ఆడూ యుద్ధంలోకెళ్ళి ఆఫీసరైనవోడే. మీరుండే వోటేలు పేరు సెప్పండి.

డె: పేరేమిటి? హొటల్‌కి పేరుంటుందేమిటి?

రైతు: పోనీ ఆ వోటే లెవరిదో సెప్పండి సూత్తాను.

డె: (ఇంక లాభం లేదనుకుని) ఎందుకు చెప్పకపోడం ఇంక! నేనే పారిపోయిన ఖైదీని.

చిన్నపిల్ల: ఆ! నిజం?

రైతు: నాకు తెల్చులే ఒప్పుకుంటారని.

డె: (గొంతు తగ్గించి) వొదిలిపెట్టవా అనుకున్నాను. ఏమంటావ్?

అనువాదం: సూరంపూడి సీతారాం



ఒక ఈగ తన కూతురుతో ఒక బట్టతలమీద ప్రయాణం చేస్తోంది.

"చూశావా అమ్మాయ్. కాలం ఎల్లా మారిపోతోందో. నేను నీయీడున వున్నప్పుడు ఇది ఎంత ఇరుకు సందు అనుకున్నావ్? ఇప్పుడిక్కడ పెద్ద రాజబాట, పార్కు అన్నీ వేశారు."

పిల్ల మెల్లిగా అతన్ని సమీపిస్తుంది. కథల్లో రాజకుమారుడన్న భావంతో చూస్తుంది.)

చిన్నపిల్ల : (బుల్లిపుస్తకం ఒకటి తీసి చూపిస్తూ) పేరు రాసిస్తారూ?

డై : (చిరునవ్వు బలవంతాన వస్తూంది) సిరాతోనా, రక్తంతోనా?

చిన్నపిల్ల : బలే! బలేగా వుంటుంది.

డై : నీపేరా, నాపేరా?

చిన్నపిల్ల : మీ పేరే. నాదగ్గిర పెన్ కూడా వుంది. ఇదుగో. (పెన్ ఇస్తుంది. డెనాంట్ పేరు రాసిస్తాడు)

డై : ఏదీ? నీ బుల్లిచేతు లేవీ? చూడనీ వొకసారి. (చిన్నపిల్ల చేతులు చాపుతుంది. మెల్లిగా ఎత్తి ముద్దుపెట్టుకుంటాడు) పెద్దదానవైన తరువాత నన్ను మరిచిపోకు. హంతకుణ్ని చూసినట్టు జ్ఞాపకం ఉంచుకో. (రైతువంక తిరిగి) అయితే పోనివ్వరన్నమాటేగా.

రైతు : ఏంటి? ఖైదీకి సాయమా? ఈల్లేదు.

డై : ఓహో ఖైదీ అంటే పురుగుకంటె నీచంకాబోలు. (చుట్టూ ఓసారి చూస్తాడు) నేను దొరికిపోయాననుకోండి. మీ పొలంలో ఎలకల్ని కూడా తప్పించుకోకుండా చంపేస్తారా?

రైతు : ఓ! మా పొలంలో ఎలకనేది ఇప్పుడు కనపడదు.

డై : అవును. మీ కెలా తెలుస్తుంది? మీ రెన్నడూ ఖైదంటే ఎలా వుంటుందో చూడలేదు.

రైతు : సూళ్ళేదు. అక్కడ కెళ్లాల్సిన అవుసరం కూడా ఉండదులే.

డై : దురదృష్టం చుట్టుకోకుండా మాత్రం చూసుకోండి.

రైతు : దురదృష్టమా! ఒక మడిసిని సంపిన మడిసి ఉరెక్కకుండా బతకడం అదృష్టం కాదూ?

★ పరారీ ★

రైతు : అద్దదిమాత్రం కుదర్దు. అడిగి లాబంలేదు.

డై : సరే పోనీ. రెండు రోజులైనా స్వేచ్ఛగా తిరిగాను. అదే చాలు. సిగరెట్టుందా?

రైతు : నా కట్టాటివి లేవు. (దూరంగా ఉన్న నౌకర్నిపిల్చి) ఒరేయ్ సుట్టుందట్రా. ఓటియ్యి పెద్దమడిసికి.

[మొదటి కార్మికుడు వొచ్చి చుట్ట ఇస్తాడు. డెనాంట్ వెలిగించి నుయ్యి అంచుమీద కూచుంటాడు. కార్మికుడు వెళ్ళిపోతాడు. క్షణంసేపు నిశ్శబ్దం. చిన్న

డై : (బాధతో) పాపం వాణ్ని చంపాలని ఎప్పుడూ అనుకోలేదు నేను.

చిన్నపిల్ల : (ఆశ్చర్యంతో) నిజంగానే మీరు మనిషిని చంపారా?

డై : ఇంకా ఎవర్నీ చంపలేదు.

రైతు : నువ్వు కొట్టినందుకేగా ఆడు సచ్చింది? ఆడి డూటీ ఆడు సేస్తావుంటే నువ్వు సంపినావంట కూడా నే! (దెబ్బకి కాసుకుంటున్నట్టు నిలబడతాడు)

డై : హుఁ. నీకేం భయం లేదు. ఇక్కడ చిన్నపిల్ల కూడా వుంది. లేకపోతేనా...సరే పోనీగాని నన్ను పట్టుకున్నందుకు బహుమతి మీ కూలివాడికేనా ఇప్పిస్తారా?

రైతు : ఆడే తీసుకోవచ్చు. నా డూటీ సెయ్యటానికి నాకు బగుమతు లక్కర్లేదు.

డై : పోనీ నయమే. సరే, వెళ్ళొస్తా. (అంటూ నూతి అంచుమీదనించి అవతలి వైపు కొక్క దూకుదూకి పారిపోతాడు. చిన్నపిల్ల తప్పట్లు కొడుతుంది హుషారుగా.)

రైతు : (తెల్లబోయి) అరి నక్కా! (పొలికేక పెడుతూ) ఒరేయ్! పట్టుకోండ్రా పట్టుకోండి.

[కార్మికులు దడదడ పరుగుతీస్తారు. రైతుకూడా పరిగెత్తబోతుండగా చిన్నపిల్ల పిలుస్తుంది.]

చిన్నపిల్ల : నాన్నా!

రైతు: (వెనక్కొచ్చి) ఏంటమ్మా! ఏం?

చిన్నపిల్ల : (ఊపిరి తీసుకుని తాపీగా) అబ్బే! ఊరికేనే.

రైతు : ఛత్ (అంటూ మళ్ళీ పరిగెడతాడు.)

[పోలీసు పరుగుమీద వొస్తాడు, వొగర్చుకుంటూ.)

పోలీసు : అరె! దాటిపోయాడూ మళ్లీ! ఎట్టబోయినా డమ్మాయ్.

అమ్మాయి : (ఇష్టం లేనట్టు) నాకు తెలియదు.

పోలీసు : పోన్లే (అంటూ పరుగెడతాడు.)

అమ్మాయి : అమ్మయ్య! పారిపోయాళ్లే! ఇంక దొరకడు. బలే బలే!

[తెర]

ఎనిమిదో ఘట్టం

[కొద్ది నిమిషాల అనంతరం. ఒక చిన్న ఇంటి సావడిలో ఇద్దరు యువతులు కూర్చుని వుంటారు. గోడప్రక్క స్టవ్ మీద టీకి నీళ్లు కాగుతూవుంటాయి. మిస్ గ్రేస్ వయస్సు 47 సంవత్సరాలు. మిస్ డోరా వయస్సు 25 సంవత్సరాలు.]

డోరా : పారిపోయిన ఖైదీకోసం తెగ వెతుకుతున్నారుట.

గ్రేస్ : నువ్వు చూశావా అతన్ని?

డోరా : లేదు లేదు. నయం. పాపం పిచ్చికుక్కని వేటాడుతున్నట్టు తరుముతున్నారతన్ని.

గ్రేస్ : పిచ్చికుక్కలికి పాపం ఏమిటి? జాలి కూడానా! నక్కల్ని వేటాడుతుంటే నువ్వు హుషారుగా చూడవ్. అలాగే.

డోరా : అబ్బే! నక్కలంటే అవ్వి వేటకోసమే పుట్టాయి.

గ్రేస్ : నేరస్థులూ అంతే. వాళ్ళమీద జాలి అనవసరం.

డోరా : ఇతను మామూలు ఖైదీ కాడు. కెప్టెన్ డెనాంట్ కేసు చదవలా?

గ్రేస్ : చదవకేం? అప్పుడు మనిద్దరం దెబ్బలాడుకున్నాం కూడా. నువ్వు వాడేమిటో మంచివాడన్నావు. మంచి శాస్తి అయిందిలే.

డోరా : ఆడదాని హృదయం కూడా రాయే సుమా!

గ్రేస్ : సరేలే. టీ సంగతి మాద్దాం కాస్త. దేనికేనా అర్థముండాలి.

డోరా : (ఆలోచనలోపడి) కాబోలు. నువ్వు చెప్పింది నిజమేలే.

గ్రేస్ : (ఆశ్చర్యంతో) అదేమిటి?

డోరా : నక్కల్ని వేటాడ్డం క్రూరం. ఒక్కసారి తుపాకితో కాల్చి చంపేస్తే పోదూ.

గ్రేస్ : అలాగైతే ఈ భూమ్మీద నక్కలు రూపులేకుండా పోతాయి.

డోరా : ఛ! ఇంకెప్పుడూ వేట చూడను.

గ్రేస్ : తెలివితక్కువ. ఊరికే కూచుని కాలక్షేపం మానుకోడం ఎందుకు? ఇవాళ చర్చికొస్తావా?

డోరా : అబ్బబ్బ! నువ్వు కూడా ఈ చర్చి ఎప్పుడు మానేస్తావో కాని.

గ్రేస్ : నువ్వు మరీ మితిమీరిపోతున్నావు. నువ్వు నీ బుద్ధులెప్పుడు మార్చుకుంటావో. సరే టీ తీసుకో.

[టీ కలుపుకుంటారు. ఇద్దరూ కప్పులెత్తి తాగబోతున్న సమయంలో డెనాంట్ ఒగర్చుకుంటూ పరుగుమీద వస్తాడు. యువతులిద్దరూ నిశ్చేష్టులై ఉండిపోతారు. వారి పక్కనుంచి దూసుకువెళ్ళి బీరువాప్రక్క తెరచాటున దాక్కుంటాడు. వీధిలో రణగొణధ్వని వినబడుతుంది. రైతు పరిగెత్తుకుంటూవచ్చి నిలబడతాడు.]

రైతు : ఏదారమ్మట వెళ్లాడండి?

డోరా : ఎవరు?

రైతు : ఖైదీ. మీముందు గోడ దూకి లోనకొచ్చాడండి.

డోరా : అవునవును. చూశాను. మళ్ళీ వెనకదొడ్డిలోంచి వెనకగోడ దూకి పారిపోయాడు. తొరగా చూడండి, పరిగెత్తండి.

[గ్రేస్ తెల్లబోయి డోరా వంక చూస్తుంది.]

రైతు : అలాగా. ఉండండయితే. (బిగ్గరగా) యెనగ్గోడమీంచి దూకాడు, నడండి, పట్టుకోండి. (రైతు వెళ్ళిపోతాడు. సద్దు తగ్గుతుంది. యువతులిద్దరూ లేచి నిలబడతారు.)

డెనాంట్ : (తెర ఒత్తిగించి వస్తాడు. టోపీ తీసి పట్టుకుని గ్రేస్ వంక తిరిగి) రక్షించారు.

గ్రేస్ : నేను కాదు.

డె : (డోరావంక తిరిగి) నిజంగా మీ మేలు మరవలేను.

డోరా : గోడవార నుంచో, ఎవరేనా చూస్తారు.

(డెనాంట్ గోడవార నిలబడతాడు)

గ్రేస్ : మేలుట! అబద్ధం ఎలా వొచ్చిందో నోటికి, ఖైదీకోసం.

డె : (భయం తగ్గి) క్షమించాలి. ఖైదీకోసం కాబట్టే గొప్పవిషయం. మహారాజుకోసం అబద్ధమాడ్డానికి బంగారపు నాలుక అవసరం లేదు.

గ్రేస్ : మీ నీతి ఇక్కడ చెప్పకండి.

డోరా : (ఓ కప్పులో టీ పోసి డెనాంట్‌తో) టీ తీసుకోండి.

గ్రేస్ : (కోపంతో) డోరా!

డోరా : ఫరవాలేదు తీసుకోండి.

డె : (టోపీ ఓ ఖాళీ కుర్చీలో పడేసి ఒక్కబిగిలో టీ తాగేస్తాడు) అమ్మయ్య! కాని మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టాను. కాని ఏం చెయ్యను? ఇంకో దారి లేదు. లేకపోతే ఉరి తప్పదు.

గ్రేస్ : ఉరి పడితే మంచిదే. నా చెల్లెలి సంగతి పీసంతూడా ఆలోచించలేదు నువ్వు.

డోరా : (కోపంతో) అక్కా! నువ్వుండు.

డె : వాళ్ళు వెంటబడి తరుముతున్నప్పుడు ఇలాటివేం తోచవండి.

డోరా : పాపం! చాలా ఆయాసపడ్డట్టున్నారు.

డె : ఫరవాలేదండి. కాస్తంత ఊపిరి తీసుకున్నాను. మీ పాదాలు తాకాలనిపిస్తోంది.

డోరా : అక్కర్లేదులెండి. అయినా అలా తప్పించుకు పారిపోడం పిచ్చిపని కాదూ?

డె : కాదండి. ఇప్పుడిల్లా పారిపోయి వంచువల్లే మనుషులంటే ఎలా వుంటారో తెలుసుకోగలిగాను. నిజంగా మర్యాదపరులెవరో వంచకులెవరో తెలుసుకుంటున్నాను.

డోరా : ఏం? మిమ్మల్ని అవమానించారా?

డె : అహ. లేదు. నన్ను సరిగ్గానే చూశారు కాని నాకే నచ్చలేదు.

డో : ఆగండి. వినండి. (దూరంనించి

పరారి

కేకలూ పరుగులూ వినపడతాయి) ఎక్కడికి పోవాలను ?

డె : ఎక్కడికో తెలియదు. ఇదేం బాగుండలేదు. బతుకంతా యుద్ధంలా గుంది. మంచితనంవల్ల పీసం ప్రయోజనం లేదు.

డోరా : మీ కేసంతా చదివాను.

డె : అవును. పెద్దపెద్ద అక్షరాల్లో అచ్చువేశారు. ఇంక సెలవు తీసుకుంటా నండి.

డో : వొద్దు. ఆగండి. ఇప్పుడు ఓసారి లోపలికి వెళ్ళివస్తా. (పక్క గదిలోకి వెళుతుంది.)

గ్రేస్ : మంచి మర్యాదస్థుడివే.

డె : ఏమో ! నే నెవరితో ఉంటే వాళ్ళలాగే ఉంటా ననుకుంటాను.

గ్రేస్ : నాచెల్లెలు అమాయకురాలు. మెత్తని మనస్సుది.

డె : చాలా మంచిది.

గ్రేస్ : ఆమెని చిక్కుల్లో పెట్టకూడదని నీకుంటే...

డోరా : (గదిలోంచి వచ్చి) మీరు దాక్కోవచ్చిక్కడ.

గ్రేస్ : డోరా !

డె : వొద్దొద్దు. ఇది మంచిది కాదు. మిమ్మల్ని అనవసరంగా...

డో : నే నితన్ని దాచి తీర్తాను.

గ్రేస్ : ఇంట్లో వీల్లేదు.

డో : నీయిల్లే కాదిది, నాయిల్లుకూడా. నా యిష్ట మొచ్చినట్టు చేస్తాను.

గ్రేస్ : ఇప్పుడు చేసింది చాలదూ ? ఇంక జైలుకూడా పోవా లనుందా ? అదేం కుదరదు.

డో : మోటుపసువులు ఇలాటి పెద్దమనిషిని తరుముతోంటే నే చూస్తూ ఊరుకో లేను.

గ్రేస్ : (డెనాంట్ వంక చూస్తూ) డోరా! అలా వీల్లేదు. నీకు మతి పోయిందా ?

డో : నీ కెందుకు నువ్వు మేడమీద కెళ్ళు. ఎవరేనా అడిగితే నీకేం తెలీదని చెప్తాను నువ్వెళ్ళు.

గ్రేస్ : (బిగ్గరగా) అయితే నన్నబద్ధా లాడమంటావా ?

(ఇద్దరూ తగువులాడుకు నే అదను చూసుకుని డెనాంట్ దాటేస్తాడు.)

డోరా : ఏమైనా సరే నే నితన్ని దాస్తాను.

(డెనాంట్ లేడని ఇద్దరూ గమనించి తెల్లబోతారు.)

డో : వీధిలో కెళ్ళాడా, గదిలో కెళ్ళాడా ?

గ్రేస్ : నేను చూళ్ళేదు.

డో : చూళ్ళా ?

గ్రేస్ : లేదు. లేదని చెప్పడంలా.

(డోరా తెర వెనక, గదిలో చూసి వస్తుంది. వచ్చేసరికి పోలీసు వచ్చి ఉంటాడు. వెనక రైతు, ఒక కార్మికుడూ ఉంటారు.)

పోలీసు : వాడు తప్పించుకు పోయాడండి. కనపళ్ళేదు. బలే టక్కరి. వెనక్కి వచ్చి ఇంట్లో దూరినట్టున్నాడండి. పైనంతా తెగవెతికాం. కనపళ్ళేదు. ఇక్కడే ఎక్కడో దాక్కుని వుంటాడండి. ఓసారి లోపల చూడొచ్చాండి ?

డో : ఇంట్లో ఉండడండీ.

పో : అయినా ఓసారి చూస్తే మంచిదండి. వాడు బలే టక్కరండి.

[జవాబుకోసం చూడకుండా నే లోపల వెతకడానికి అందరూ వడతారు.]

డో : (మెల్లిగా) అతన్ని పట్టుకో నివ్వను (అంటూ తలుపుదగ్గిర కెళ్ళబోతుంది.)

గ్రే : డోరా! ఆగు (పట్టుకోబోతుంది) నామాట విను.

డో : నన్నొదులు ముందు.

గ్రే : వొదిలిపెట్టను. నీకు మతిపోయింది. నీకెందుకు మ్మ్య ?

డో : వొదుల్తావా, కొట్టనా ?

గ్రే : కొట్టు కాని వొదల్ను.

[ఇద్దరూ గుంజుకుంటున్న సమయంలో పోలీసువాళ్ళొ వస్తారు. అక్క చెల్లెల్ని వొదిలి పెడుతుంది.]

రైతు : హుం. ఇక్కడా లేడు.

పో : వెనకగోడ దూకి పోయినట్టు నిజంగా చూశారా మీరు ?

డో : చూశాను.

రైతు : (గ్రేస్ తో) మీరు ?

[డోరా అక్కవంక తేరి పారచూస్తుంది.]

గ్రే : (మొహం ముడుచుకుని) లేదు.

రైతు : (కుర్చీలో టోపీచూసి) ఇదేమిటి ? ఈ టోపీ ఎక్కడిది ?

డోరా : ఓ! అదా! అది మా అన్నయ్యది లెండి. అప్పుడప్పుడు తీసి వాడుతూ ఉంటాను.

రై : వాడి టోపీ అచ్చంగా ఇలాగే వుండే!

డో : అల్లాగా? అందులో ఆశ్చర్యం ఏముంది? (టోపీ అంది పుచ్చుకుని) ఆ తోటలో చూశారా?

రై : లేదండోయ్. కాని అప్పుడే చీకటి పడుతావుంది. రండి రండి సూద్దాం. బలే టోకరా ఇచ్చాడే.

డో : పక్కిల్లు కూడా వెతికి చూడండి.

పో : అదీ చూస్తాం లెండి.

(అందరూ వెళ్లిపోతారు)

డోరా : చక్కగా చెప్పావ్ లే అబద్ధం.

గ్రేస్ : (కోపంతో) నేను అబద్ధం చెప్పినందుకు సంతోషంగా వుందా?


డో : ఏం చెయ్యడం మరి ? నేను మాత్రం......

గ్రేస్ : నువ్వైతే ఇట్టె ట్టే అబద్ధాలాడేస్తావ్. అందరికీ చేతకాదు.

డో : తప్పు లేదులే. పాపం.

[తెర]

[ఇంకా వుంది]



★ విరిగిన మనస్సు ★

(20-వ పేజీ తరువాయి)

కింది. తెల్లబోయి తన ముఖంలోకి అదో మాదిరిగా చూచింది. ఆ చూపులో "ఇతం అసమర్థుడ వేమిటి" అన్న ధ్వని తనకు కని పించింది. తన కెంతో సిగ్గేసింది. కాని; యిరుకునపడ్డ లేడిలా తన గుండెలు తన్ను కున్నాయ్.

కస్తూరి "నాలుగు రోజుల్నుంచీ చెబుతున్నా పాలడబ్బా తేలేదేమండీ ?" అంది కోపంగా. తనేమన్నా పాపమీద కోపం వుండి పాలడబ్బా తేకుండా వుంటున్నాడా - కస్తూరిలా అనడానికి? నిజంగా, చెడ్డకోపం వచ్చిందా ప్రశ్నకి. అందుకనే—హ్హుం! యిష్టం లేక!" అని సమాధాన మిచ్చాడు. కస్తూరి కనుబొమలు చిట్లించి "అవున్లెండి! ఎందుకిష్టం వుంటుందీ? వేలెడు ముండకి కూటికూరా సబ్బెందుకని మొన్నకు మొన్నా అన్నారు. అదంటే నే మీకు పురుగులాగుంది" అంది.

తన నింతింత మాటలతో, సంకుచిత బుద్ధిగల క్రూరుడులా చిత్రించడాన్ని ఎలా సహించగలడు? అందుకే చరచరా వెళ్లి ఆ చెంపా యీ చెంపా వాచేట్లు కొట్టాడు.

తను...రామారావు...తనే...

కస్తూరి మొదట్లో ఆశ్చర్యపడింది. "కొడ్తున్నారా ?!" అంది. తర్వాత ఆమె ముఖంలో నల్లదనం ప్రవహించింది. చివరి కామె కళ్ళు కుంచించుకుపోయి, కనురెప్పలు సుడిగాలిలోని గడ్డిపోచల్లా అల్లల్లాడినయ్. కస్తూరి గోడకు జేరగిలబడిపోయింది. కుంచించుకుపోయిన శరీరాన్ని చేతులమధ్య దాచుకునేందుకు ప్రయత్నించింది.

అప్పుడే; తను చరచరా యీ గదిలోకి వచ్చేడు. చెమటబట్టినట్టున్న తలను దువ్వుకుందామని అద్దం దగ్గరకు వెళ్ళి చూచుకున్నాడు. తనే - రామారావు...తనే... తన ప్రతిబింబమే...

అప్పుడు తను తృళ్లిపడిందానికి కారణం యిప్పుడు తెలిసింది. లేచి కూర్చున్నాడు. గది చీకట్లతో నిండిపోయింది. బైటి హాలులోకీ, వంటింట్లోకీ చూచాడు. ఒక్కచోటా దీపం కనిపించలేదు. పాప గేరుగేరున ఏడుస్తూనే వుండడం తానింతవరకూ గమనించలేదు. మరి, కస్తూరి ఏమైనట్లు ?

లేచి వెళ్ళాడు. హాల్లో కాలెడుతూనే "దీపం వెలిగించలేదేం" అని ప్రశ్నించాడు - కస్తూరి నుద్దేశించి. జవాబు రాలేదు. తనే మెల్లగా వెళ్ళి గూట్లో వున్న లాంతరు వెలిగించాడు. లాంతరు చేత్తో బుచ్చుకుని "ఎక్కడున్నావోయ్." అన్నాడు బిగ్గరగా. అదే క్షణంలో ఆమె కనిపించింది. అక్కడే...తను కొట్టిన తర్వాత గోడకు జేరగిలబడినచోటనే... అట్లాగే కుంచించుకుపోయివుంది.

రామారావు వంగి, కస్తూరిచెయ్యి అందుకుంటూ "లేవవేమోయ్, యింకా" అన్నాడు. బెదిరినకళ్ళు సంబాళించుకుంటూ, చేతి నందనీయకుండా లాక్కుని "లేస్తున్నానండీ" అంది కస్తూరి. ఆమాటలోనైన నూతులోంచి వచ్చిన ఆక్రందనలా వుంది. ఆమె లేచి బెదరిబెదరి చూస్తూ, అతనికి తన గాలైనా తాకకుండా ఒదిగి ఒదిగి, గోడవెంటనే నడుస్తూ వంటింట్లోకి వెళ్లింది.

రామారావు నిర్ఘాంతపోయాడు. తనంటేనేనా కస్తూరి పులినోటి లేడిలా భయపడుతూంది?! తనను చూచా??

అవును...అందుకనే తన ముఖం చూచి తనే తృళ్లిపడ్డాడు......అప్పుడతని కా అద్దంలో తనముఖం కనిపించిన తీరు అలాంటిదే...అందులో—రంపం పట్టుకున్న నరకలోకసిపాయీ, ప్రశ్నార్థకాల అంబులపొదీ గాటంగా కనిపించాయ్. అలాటి రూపు చూచిన ఏ స్త్రీ యీ కస్తూరిలా భయపడదు ?

ఇలా ఆలోచించిన రామారావు నిలవలేకపోయాడు. పరుగెత్తి వెళ్ళి పొయ్యి రాజేస్తున్న కస్తూరిని కౌగిలించుకున్నాడు. గోలున ఏడుస్తూ "ఆ క్షణంలో నేను యమకింకరుణ్ణయ్యాను కస్తూరీ! నన్ను క్షమించు! ...నేను కొట్టింది నిన్ను గాదు—నన్ను నేనే కొట్టుకున్నాను......పాపకు పాలడబ్బా తేలేని నామీద, నేనే కసికత్తులు విసిరాను" అన్నాడు. ★



విజ్ఞానవీధులు

"డాక్టర్"



49. ఉపవాసము వల్ల కీడు కలుగునా?

"నేను ప్రతి ఆదివారం ఉదయంనుంచి 24 గంటలు మంచినీళ్ళనే వాడుతూ ఉపవాస ముంటున్నాను. మీరు 27-8-52 ఆంధ్ర వారపత్రికలో వ్రాసినట్లు, ఉపవాసమువల్ల కంటిగ్రుడ్డు చుట్టూవున్న టిష్యూలలోని నీరు తరిగిపోయి కంటికేమైనా కీడు కలుగునా?" అని పామిడి నుంచి వై. యన్. ఈశ్వరయ్యగారు అడుగుతున్నారు.

'కంటికి కీడు' అనగా దృష్టికి కీడని కదా అర్థము? దృష్టికి ముఖ్యాధారము కంటిపాపకి వెనుకనున్న చిన్న కటకమూ, (*Lens*) కంటిగ్రుడ్డుకి వెనుక ప్రదేశంలో ఉన్న రెటీనా అనే తెరా, ఈ రెటీనా నుండి మెదడుకి, చూసిన బొమ్మని రిపోర్టు చేసే నరములూను. వీటికి ఉపవాస ఫలితమైన ఉదకనష్టమువల్ల కీడు కలుగదు. శరీరములో నూటికి 90 పాళ్ళదాకా నీరే ఆయెను. శరీరం మొత్తమ్మీదగాని ఒక ప్రత్యేకావయవములోగాని 'నీటి పాలు సరిగ్గా ఇంతే వుండాలి' అన్నది నియమము కాగలదా? శరీరములోకి నీరు వస్తూ వుంటుందీ పోతూవుంటుంది. ఒకప్పుడు నీరు ఎక్కువా అవుతుందీ, ఇంకొకప్పుడు తగ్గుతూనూ వుంటుంది. కనక కొంచెపు కొంచెపు నీటి రాకపోకలు కీడు చెయ్యనే చెయ్యవు.

పూర్వాచార పరాయణులు మన తాతలు ప్రతి ఏకాదశికీ, పండగలకీ పబ్బాలకీ ఉపవాసములు చేస్తూవుండేవారు. వారి చదువు పగటిపూటలోనే. వారి దృష్టి తొంభై ఏళ్ళవరకూ చెదరకుండా వుండేదికదా! కంటిదృష్టి యంత్రానికి అతి శ్రమకలగక పోతే కంటికి కీడులేదు. కంటిచుట్టూవున్న నీరుకీ దృష్టి యంత్రానికీ పెద్ద సంబంధం ఏదీ లేదు. కనక కంటికి ఉపవాసమువల్ల వచ్చే కీడు ఏమీ లేదు.

ఉపవాసమువల్ల శరీరానికి చక్కని లాభాలున్నాయి. కడుపుకీ, జీర్ణావయవాలకీ మంచి విశ్రాంతి కలుగుతుంది ఉపవాసముచేస్తే. ఈనాటి నాగరికతలో రోజుకి ఐదుసార్లు ఏదో ఒకటి కడుపులో పడేసుకోడము మామూలైపోయింది. ఎంత పనీ జీర్ణావయవాలికి! ఉపవాసమువల్ల వీటికి విశ్రాంతీ తద్వారా అదనపుశక్తీ సమకూడుతాయి.

మన శరీరములో కొవ్వుంటుంది. లావుగా పెరిగినవాళ్ళలో కొవ్వు ఎక్కువగా వుంటుంది, సన్నటివారిలో తక్కువగా వుంటుంది. శరీరంలో అనవసరపు కొవ్వంటే అక్కరలేని బరువూ దానివల్ల ఆయాసమూనూ మనకి. ఉపవాసము చేస్తున్నప్పుడు శరీరంలోని అనవసరపు కొవ్వు కరిగి ఆహారముగా ఉపయోగపడుతుంది. కనక వారము వారానికిగాని పక్షము పక్షానికిగాని ఒకనాడు ఉపవాసము చెయ్యడము చాలా మంచిది. ఉపవాసాలవల్ల లోశరీరాన్నీ, స్నానాలవల్ల పైశరీరాన్నీ శుభ్రపరుచుకుంటూ ఉండడమువల్లనే పూర్వీకులు చిరకాలజీవు లయ్యారేమో!

50. జ్వర తీవ్రతలో పరాకు మాటలు

జ్వరతీవ్రతవల్ల పరాకు మాటలు రావడానికి కారణ మేమిటని సాలూరునుంచి జెత్సె వెంకటరాజు అడుగుతున్నారు.

మన దేహంలో ఎక్కడైనా స్పర్శ తగిలితే తెల్పడానికి బోధకనాడులూ, కండరాలచేత పని చేయించడానికి ప్రవర్తక నాడులూ, అని రెండు రకాల నాడులున్నాయి. బోధకనాడుల మొదళ్లు చర్మములోనూ, కొసలు వెన్నెముకలోని వెన్నుపాములోనూ వుంటాయి. ఎక్కడ స్పర్శ తగిలినా ఆ వార్తని ఈ స్పర్శనాడులు వెన్నుపాముకి అందిస్తాయి. వెన్నెముకలో మొదలుపెట్టి కండరాలదాకా వుండేవి ప్రవర్తకనాడులు. స్పర్శవార్త అందగానే "దానికి ప్రతీకారం చెయ్యమ"ని వెన్నుపామునుంచి ప్రవర్తకనాడులద్వారా కండరాలకి వార్త అందుతుంది. ఆ కండరాలు కదిలి, గోకడమో, కొట్టడమో, శరీరాన్ని కుంచించడమో చేస్తాయి. అయితే ఈ స్పర్శ వార్తా, కండరాల ప్రతీకారమూ సామాన్యంగా మనకి స్ఫురణ లేకుండానే జరిగిపోవచ్చును. నిద్రలో గోకుకోడమూ, అటునుంచి ఇటు తిరగడమూ వంటి పనులన్నీ అసంకల్పిత కార్యాలు. ఈ పనులన్నిటికీ వెన్నుపామే కార్యాలయము.

ఇక మాట్లాడటమూ, గుర్తించడమూ వంటి సంకల్పిత కార్యాలకి మెదడు కార్యాలయము. పోసుకునే నీళ్లు మితిమీరి వేడిగా వున్నాయనుకుందాము. అవి వంటిమీద పడగానే వార్త వెన్నెముకకి అందిపోతుంది. వెన్నెముకనించి మెదడుదాకా ఉండే స్పర్శనాడులు ఈ వార్తని మెదడుకి అందిస్తాయి. ఈ స్పర్శనాడుల కొసలు మెదడులో అంతమయేచోట నన్ను జీవకణాలు అక్కడే వుండే ప్రవర్తకనాడులకి "ఈ పని చేయమ"ని ఆదేశిస్తాయి. ఆ వార్త దిగివచ్చి వెన్నుపాముకీ, మళ్ళీ అక్కడినుంచి ప్రవర్తక నాడుల ద్వారా కండరాలకీ అందుతుంది. ఆ కండరాలు గభీమని వేడినీళ్ళు పోసే చెంబుని పక్కకి తీసేస్తాయి. అంటే సంకల్పితకార్యాలు మెదడుయొక్క ప్రమేయము లేకుండా జరగవు. మాట్లాడడమూ, కర్మేంద్రియాల చేత పని చేయించడమూ సంకల్పిత కార్యాలే.

మాటలకు కళ్లెము పెట్టి నడిపే కేంద్రము మెదడులోని సున్నితపు భాగాలలో మేఘాలమీద వున్నట్టుంటుంది. అనవసరపు మాటలూ, అసందర్భపు మాటలూ రాకుండా ఈ కేంద్రము నిషేధిస్తుంది. జ్వరం తీవ్రంగా వున్నప్పుడు విషద్రవాలు నెత్తురుతోపాటు శరీరమందంతటా ప్రవహించి జీవకణాన్ని

హింసిస్తాయి జీవకణాలకీ విషానికీ జరిగే సంగ్రామ సంచలనంలో జీవకణాలు మామూలుగా నిర్వహించే పనులూ కట్టుబాట్లూ తగ్గిపోతాయి జీవకణాలు చురుకెక్కడంతో అవి నడిపే నరాలూ చురుకై అవసరం లేకపోయినా కదలికలూ, మాటలూ, బయల్దేరతాయి రోగులు అతిగా మాట్లాడడమూ, ఇటూ అటూ ఎక్కువగా దొర్లుతూండడమూ మామూలు కాదూ! ఇది ప్రవర్తకనాడుల సంక్షోభమన్నమాట. అయితే కొంచమే జ్వరము కాచినప్పుడు ఈ సంచలనము కొద్దిగానే వుంటుంది.

ఆ స్థితిలో ప్రవర్తకనాడుల వ్యాపారము ఎక్కువైనా, మాటల సందర్భశుద్ధిని పాలించే జీవకణాలదాకా 'జ్వరతీవ్రత' (అంటే విషద్రవాల బాధ) వెళ్ళకపోవడము నుంచి, ఈ ప్రథమ పేలాపనలో సందర్భము నశించిపోదు. జ్వరం ఎక్కువై మెదడులోని 'ఆ మూల'నున్న జీవకణాలు కూడా హింసపడి పట్టువిడిచినప్పుడు, అంతవరకూ జోరుగా సాగిపోతూన్న మాటలలోని సందర్భశుద్ధి తగ్గిపోతుంది. అంటే పలుమాటలు బయల్దేరతాయన్న మాట.

అయితే కొందరు రోగులు జ్వరము రాగానే ముసుగుపెట్టేసుకుని పడుక్కుంటారు. మాట్లాడరు అంటే వీరిలో మాటలను నడిపే కేంద్రము శక్తివంతము. జ్వరంగా వున్నప్పుడు మాట్లాడకూడదనే విచక్షణ కలిగించే జీవకణాలు బలమైనవన్నమాట. ఇలాంటి వారుకూడా పలుమాటలాడేరంటే వారి మెదడులో 'ఆమూల' నున్న జీవకణాలుకూడా హింసపడి పట్టుదప్పి, మాట్లాడించే ప్రవర్తకనాడుల్ని కట్టులో వుంచలేక పోయాయన్నమాట.

—పాణి.

చిట్టి ప్రశ్నల జవాబులు

—కోడి రాళ్లు తినదు. తవుడూ, గింజలూ, తింటుంది. నీళ్లు తాగుతుంది. పురుగుల్ని తింటుంది. ఇక ద్రవమువంటి రెట్ట వేస్తుందంటే చిత్రమేమిటి?

—కారణం తెలియని వ్యాధులకి 'చేతబడి'యే కారణమని ఒకప్పుడు నమ్మేవారు. కాలక్రమాన్ని కారణాలు తెలుస్తూవుంటే 'చేతబడుల'లలో నమ్మకము పోతుంది

—మంత్రమంటే మాటలపోగు. మాటలవల్ల ఏమి చేయవచ్చునో మంత్రాలవల్ల కూడా ఆ పనే చేయవచ్చును. అయితే నమ్మకమువల్ల శరీరములోని వ్యాధి నిరోధక శక్తులు ఉద్ధృతము కావచ్చును మంత్రాలు కొన్ని పరిస్థితులలో ఈ విధముగా పని చెయ్యవచ్చును

—మళయాళ మంత్రమయేది, మైసూరు మంత్రమయేది, పూర్తిగా విష మెక్కించిన పాముకాటుకి తిరుగే లేదని వైజ్ఞానికుల మతము నూటికీ అరవయి కేసులు పాము కరచినదన్న భయమువల్ల హడలిపోయేవారివే వీరిపట్ల మంత్రమే పనిచేసినదన వీలు లేదు కదా?

—మనుష్యుల గుణాలు ఆ మనిషి యొక్క ముక్కు, చెవి, కనురెప్పలూ, వెంట్రుకలలో "ఈ రీతిగా ప్రతిబింబిస్తాయి" అని లక్షలాది మనుష్యులలో గుర్తించి, సూత్రీకరించి నిరూపించగలిగితేనా ఒక్కడి నమ్మకముతో విలువ అవసరమే వుండదు.

—సృష్ట్యారంభంలో మొదట పుట్టినవి జీవకణాలు. మానవులు వానరజాతుల పూర్వులనుండి పెక్కురు పరిణామరీత్యా ఉద్భవించినారు కాని ఒకరొకరే సృష్టికర్త ఫ్యాక్టరీలో తయారు కాలేదని వైజ్ఞానికుల నమ్మిక.

—పాశ్చాత్యులు తాము పరిశోధనచేసి కనుక్కున్న విషయాల్ని "అదిగో పులి" అంటే 'మన పెద్దలు' "ఇదుగో పురాణాల్లో దాని తోక" అంటున్నారు. "పాశ్చాత్య విజ్ఞాన" సహాయ్యము లేకయే మన పెద్దలు కొత్త విజ్ఞానవిషయాల్ని వేదాల్లోనూ పురాణాల్లోనూ ఎందుకు కనిపెట్టలేరంటారూ?

—దెయ్యం అంటే శరీరములేనిజీవుడు శరీరములేని జీవుణ్ణి విడిగా కనిపెట్టడానికి అమోఘ సాధనాలు ఇంకా లభించలేదు కనక దెయ్యం ఉన్నదని చెప్పడానికి ధైర్యం ఎలాగు ఉంటుంది?

—రాత్రిపూట పొలాల్లోనుంచి వస్తున్నప్పుడు కీచురాళ్ల శబ్దమూ గాలికి కదిలే పైరు శబ్దమూ వినబడతాయి. పగలు ఇతర శబ్దాలు చాలా వుంటాయి కనక ఇవి ప్రత్యేకంగా వినబడవు.


—మాడిపోయే పిందెలు లోపల పురుగు దొలవడమువల్ల గానీ, అవి ఒక పువ్వు పరాగము ఆ పువ్వు కీలాగ్రమునకు అందడమువల్ల జరిగే స్వపరాగ సంపర్కమువల్ల పుట్టియుండడమువల్ల గానీ, వాటికి రసము సరఫరా చేసే కొమ్మ నలిగీ, విరిగీ, పోవడమువల్ల గానీ, మాడిపోతాయి. ★



భామా కలాపం

"ముదితల్ నేర్వగరాని విద్యకలదే ముద్దార నేర్పించినన్"

సత్యభామ నరకాసురునితో యుద్ధం చేసిన కాలం అది. రమారమి అయిదు వేలయేండ్లకంటె పురాతన కాలమైన మహాభారత యుద్ధకాలంనాటిమాట అది-



శ్రీకృష్ణునితో సహా సత్యభామ కూడా యుద్ధరంగానికి వెళ్ళింది. ఆనాటికంటె యీనాడు ఎక్కువ హోదా రాణివాస స్త్రీల విషయంలోనైనా ఉన్నదా ? అని ప్రశ్నిస్తే మనము తెల్లమొగము వేయవలసి వస్తుంది. రష్యాలో, గడచిన సంగ్రామ కాలమందు, స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం లెనిన్‌గ్రాడ్ యుద్ధం జరిగినప్పుడు రష్యను స్త్రీలు కూడా అడలపాటు లేక తుపాకులు చేతబట్టి జర్మను సేనలను దూదిపింజలవలె తుక్కుతుక్కు చేశారు. ఇంగ్లాండులో కూడా ఆంగ్ల స్త్రీలు దేశమధ్యంలో పౌర రక్షణదళాలలో చేరి శత్రువిమానదాడుల భయ పడకుండా చాలా దేశసేవ చేశారు. కాని సత్యభామ చూపించిన సాహసపరాక్రమం అంతకంటె అనేక రెట్లు ఎక్కువైనది. కృష్ణునితోపాటు సరి సమానంగా ఫీల్డుమార్షలుగా "షంషేరు జంగ్" అన్నట్లుగా నిలువబడింది. ఒక్క విషయం గమనించాలి. ఆనాటి యుద్ధంలో ఆయుధసాధన విశేషాలు ఎక్కువగా లేవని మన ఊహ. కాని, భాగవతం చదివిచూస్తే నరకాసుర యుద్ధంలో "శతఘ్నులు" ఉపయోగింపబడినట్లుగా వ్రాయబడి ఉంది.

"వ. అని పలికి హరి నరకాసుర యోధులమీద శతఘ్నియను దివ్యాస్త్రంబు ప్రయోగించిన నొక్క వరుసను వారలందరు మహావ్యథం జెందిరి మఱియును" అని ఉన్నది.

ఈ యుద్ధం ఎక్కడ జరిగినదంటే, ప్రాగ్జ్యోతిషపురంవద్ద జరిగింది. ఈనాడు అస్సాంరాష్ట్రములో గౌహాతీ అని చెప్పబడే ఒక ముఖ్య నగరమే పూర్వకాలపు ప్రాగ్జ్యోతిషపురం అని చరిత్రకారులు అంటారు. శ్రీకృష్ణుని స్థిరనివాసం ఎక్కడ ? ద్వారకానగరం- ఈనాడు అరేబియాసముద్రతీరమందున్న కథియవాడ్ ప్రాంతంలో ద్వారకానగరం ఉండేది. నేటి భారతదేశపు పడమటి








కొనను ఉన్న ద్వారకనుంచి తూర్పు కొననున్న అస్సాం రాష్ట్రమునకు సరాసరిగా గరుడవిమానంమీద దండెత్తి వెళ్లారు. ఆ కాలంలో విమానాల మీద తిరుగుతూ ఉండేవారని అనేక సందర్భాలలో కన్పిస్తోంది. గయుడు విమానంమీద వెళ్ళుతూ కృష్ణుడు అర్ఘ్యం యిచ్చే సమయంలో పైనుంచి ఉమ్మివేశాడు. బహుశః పొరపాటున అయిఉంటుంది. దీనిమూలంగా ఉభయులకూ కలహకోలాహలం చాలాజరిగింది. ఇదంతా గయోపాఖ్యాన నాటకం. కంసుని శ్రీకృష్ణుడు సంహరించిన తర్వాత వితంతువులైన కంసుని భార్యలు తమ తండ్రియైన జరాసంధుని వద్దకువెళ్లి తమ దుర్గతినిగూర్చి చెప్పుకొన్నారు. అప్పుడు జరాసంధుడు మధురానగరిమీదకు దండెత్తివచ్చాడు. మగధరాజైన జరాసంధుని ఏవిధంగా ఓడించగలమా అని శ్రీకృష్ణుడున్ను బలరాముడున్ను ఆలోచిస్తూ ఉన్న సమయంలో:

"వ॥ అని యిట్లు తలపోయుచున్న సమయంబున నభోభాగంబునుండి మహాప్రభాసమేతంబులును సపరిచ్ఛదనూతంబులును, ననేక బాణ బాణాసన చక్రాది వివిధాయుధోపేతంబులు నయిన రథంబులు రెండు మనోరథంబులు పల్లవింప దైవయోగంబున జేరవచ్చినం జూచి శౌరి సంకర్షణున కిట్లనియె."

"కంటే రామ రథంబు లాయుధములున్
గాఢప్రకాశంబులై
మింటన్ వచ్చెను వీని గైకొని సురల్
మెచ్చన్ నృపశ్రేణులన్
బంటింపం బనిలేదు చంపుము ధరా-
భారంబు వారింపుమీ
వెంటన్; నీ యవతారమున్ సఫలమౌ
జేవేగ రె మ్మాజికిన్."

బలరామునితో శ్రీకృష్ణుడు పైరీతిగా అన్నాడు. ఆకాశమార్గంగా రెండు రథాల మీద ఆయుధసామగ్రులు వచ్చాయి. కాబట్టి ఇక ఆలస్యంచేయక త్వరగా యుద్ధానికి రమ్ము ఓ బలరాముడా! అని తెలియజేశాడు. ఆకాశమార్గంగా రెండు రథాలమీద ఆయుధాలు వారికి సప్లయి అయినాయి. కృష్ణుడున్ను సత్యభామయున్ను గరుడవిమానంమీద బొంబాయి రాష్ట్రంనుంచి అస్సాం రాష్ట్రానికి యుద్ధానికి వెళ్ళియుండిరి. బహుశః ఆ విమానం గరుత్మంతుని ఆకారంగా నిర్మింపబడినదై యుండవచ్చు. ప్రాగ్జ్యోతిషపురం ప్రధాన నగరంగా కలిగినటువంటి ఆ నరకాసురుని రాజ్యం నేటి అస్సాం రాష్ట్రం మాత్రమే

(54-వ పేజీ చూడండి)



దీపావళి

రచన-బి-ఆర్-గోడవర్తి

వచ్చింది వచ్చింది దీపావళి
రండోయి రండోయి ఆడుకుందాము

అమ్మ దీపాలు పెట్టేటివోట
అక్కా, [illegible] మనల
చూచేటి చోట
గుంపులో దీపాలు వెలిగేటిచోట
రండోయి పాపలూ కాకర్లతోటి
రంగులా కాకర్లు కాల్చుకుందాము.

మా అక్క తెచ్చింది కాకర్లు [illegible]
మా నాన్న కొన్నాడు
మతాబు [illegible]
మా తాత యిచ్చాడు
రంగగ్గి పెట్టె
రండోయి పాపలూ
కాల్చుకుందాము
రంగులా కాకర్లు కాల్చుకుందాము.

మన యింట్లో లక్ష్మికి
హారతులు యిచ్చి
[illegible] లడ్డు తియ్యంగ తినగ
దిబ్బు దిబ్బు మంటు దివిటి కొట్టేసి
రండోయి పాపలూ కాకర్లతోటి
అంబరం తాకేయిగా
కాల్చుకుందాము.

నరకాసురుని కథను
తెలుసుకున్నాము
బలి చక్రవర్తి కథను
తెలుసుకున్నాము
ఈ కథే దీపావళికి
మూలమని యెంచి
రండోయి పాపలూ ఆడుకుందాము
రంగులా కాకర్లు కాల్చుకుందాము.

అరుగుపై దీపాలు వెలిగేటి దాక
ఊరిలో సందడి అణిగేటి దాక
మన చేతి కాకర్లు అయ్యేటిదాక
రండోయి పాపలూ
కాల్చుకుందాము
రంగులా కాకర్లు కాల్చుకుందాము.
వచ్చింది వచ్చింది దీపావళి
రండోయి రండోయి ఆడుకుందాము.

టంగుటూరి మిరియాలు

శ్రీ జి. వి. జి. కృష్ణ

చివరికి గుంటూరుకు రామాన్నే పంపటానికి నిశ్చయించారు అమ్మానాన్నా. దీపావళీ పండక్కి అక్కను పిలుచుకొని రావటానికి తననే పంపబోతున్నారన్న విషయం తెలియగానే, నిలుచున్న పళంగా రామం మూడు పల్టీలు కొట్టాడు. పెద్దవాళ్లు ఎవరూ ప్రక్కను లేకుండా ఒంటరిగా రైలు ప్రయాణం చేయటం రామానికిదే మొదటిసారి. సమయానికి ఇక్కడ రామం తండ్రికీ, అక్కడ (గుంటూరులో) బావకీ ఆఫీసుల్లో సెలవులు దొరకనందున అమ్మాయిని పండగకు పుట్టినింటికి తెచ్చే అవకాశం కలిసి వచ్చింది రామానికి.

రామాన్ని అందరూ ప్రయాణానికి సిద్ధం చేస్తున్నారు.

"డబ్బు భద్రం రోయ్!... టికెట్టు కొన్నాక దాన్ని కూడా యీ మనీపర్సులోనే భద్రంగా దాచు. తెలిసిందా? ఎక్కడ్రా పర్సు? వెధవా! నిక్కర్ జేబులో వుంచుకోమని చెప్పి లేదూ" గర్జించాడు రామం తండ్రి.

"అల్పుడికి ఐశ్వర్యం వస్తే అర్ధరాత్రి గొడుగుపట్టమన్నాడుట. ఆలాగ చేతిలో డబ్బులున్నాయ్ కదా అని, దారిలో అడ్డమైన చిరుతిండ్లన్నీ కొనుక్కు తినకు. రెండు పూరీలు కట్టిస్తాను...అవైనా ఆకలైతేనే తిను...ఏం?" అంటూంది, రామానికి తలదువ్వుతూ, అతని తల్లి. "బండిలో తెలిసిన వాళ్లెవరైనా వుంటే వాళ్లకు నిన్ను అప్పగించుతాను. అలా ఎవరూ కనుపించకపోయినా-ప్లాట్‌ఫారం మీద "గుంటూరు" అని బోర్డు వ్రాసి వుంటుంది. దాన్ని చూసుకొని దిగలేవ్రా?"... అనీ, ఇంకా ఏమేమిటో చెప్పుకొని పోతున్నాడు రామం తండ్రి. ఎవరికి తోచినవి వాళ్లు నోరు చించుకొని చెప్పుతున్నారన్న మాటే కానీ వాటిలో ఒక్కమాట అయినా గ్రహించే స్థితిలో లేడు రామం. అతని మెదడంతా ఒంటరి ప్రయాణాన్ని గూర్చిన తీయని ఆలోచనలతో నిండి వున్నది.

ఇంతలోకి పక్కింటి కోతల సుబ్బరాముడు (రామం క్లాసుమేటు) "ఇదేమిటి? ప్రయాణ మౌతున్నట్లున్నావే?" అని రామాన్ని ప్రశ్నిస్తూ ప్రవేశించాడు.

"వచ్చావా నాయనా! రా బంగారుకొండా!" అని రామం తల్లి సుబ్బరాముడ్ని ఆహ్వానించింది.

"గుంటూరుకే నట్రా?" అని సుబ్బరాముడు అడిగాడు. వాడికి జవాబు యివ్వటానికి రామానికి టైంలేదు.

"అన్నట్లు...గుంటూరు కెళ్లే దారిలో 'కావలి' అనే ఊరు వస్తుందిరోయ్. అక్కడ ప్లాట్‌ఫారంమీద హోటల్ వద్దకు కానీ, అంగడీ దగ్గరికి కానీ వెళ్లి, 'నాకిది కావాలి, అది కావాలి' అని నీకేది కావాలని అడిగినా వెంటనే ఇచ్చేస్తారు బ్రోయ్! అందుకే ఆ ఊరికి "కావలి" అని పేరు పెట్టారుట!" అంటూ తన మామూలు ధోరణిలో సుబ్బరాముడు కోస్తూ వుంటే—

"ఊఁ... మొదలెట్టావా నాయనా! 'కొయ్యరా కొయ్యరా పోలిగా అంటే—టంగుటూరి మిరియాలు తాటి కాయలంతేసి' అన్నాడట" సుబ్బరాముడి బుగ్గ గిల్లుతూ అన్నది రామం తల్లి.

ఇట్లాంటి సంగతులు రామం బుల్లి బుర్రలో దూరాయా అంటే చాలు, 'ఇహ' అవి రామాన్ని అల్లరి పెట్టేస్తాయ్. "నిజంగానా అమ్మా - టంగుటూరి మిరియాలు తాటి కాయలంతేసి ఉంటాయా?" అని మొహం చాటంత చేసుకొని అడిగాడు.

"ఎద్దు ఈనిందంటే కొట్టంలో కట్టేయమన్నాడట ఎవరో నీలాంటి వాడు" అని రామం ప్రశ్నకు జవాబిచ్చింది అతగాడి తల్లి.

"బండికి టైం అయిపోతూంటే ఇంకా కబుర్లు పెట్టుకు కూర్చొన్నారా? ఊఁ... కానిండి; కానిండి.

★ టంగుటూరి మిరియాలు ★

సంచి పట్టుకు బయలుదేర వేంరా?" రామం తండ్రి గర్జనలు మొదలు పెట్టారు సంచీచేత్తో పట్టుకొని "అబ్బ! ఇంత బరువా?" అని తెల్లబోయాడు రామం.

"కుండలో పెరుగు కదలకుండా వుండాలి: కొడుకులు చెట్టు అంత పెరగాలి' అన్నట్లుందిరా నీ సంగతి. సంచిలో తింటానికి తిండీ వుండాలీ, సంచి బరువుగానూ వుండ కూడదూ ... ఇంతకీ గుంటూరు వరకూ నువ్వేమైనా మోసుకొని పోతావుట్రా ఈ సంచిని? ఇక్కడ బండిలో ఎక్కిస్తే అక్కడ దింపు కోవటమేగా—బండే మోస్తుంది!" అన్నది రామం తల్లి బుగ్గలు నొక్కు కొంటూ,

"ఊఁ.... కదల్రా" రామం తండ్రి తొందర చేశాడు "వెళ్తానే" అన్నాడు రామం.

"పెళ్లి సందిట్లో బొట్టూకట్టూ మరిచాడట ఎవడో నీలాటివాడు. బూడ్సులు తొడుక్కొని ' పోరా దుట్రా"

రామం ,బూడ్సులు తొడు క్కొని తండ్రి ననుసరించి బయలు దేరాడు.

"ఊఁ...భద్రం రోయ్ !... నేను చెప్పిన విషయాలు మరువకూ... ఏమంటోయ్ ! మిమ్మల్నే" అని కేకేసింది ఆవిడ.

ఆగి వెనుతిరిగి చూశాడు రామం తండ్రి. "చూడండీ!... వాణ్ణి ఆఖరి పెట్టెలో కూర్చో పెట్టండి. వెనుక పెట్టెలయితే ప్రమాదంవుండదు. ఒరేయ్ రామం? భద్రం ... సంచిలో ఇంకో పెద్ద పొట్లాంవుంది. దాన్ని మీ బావకు ఇవ్వమని చెప్పు." వీధిలో వచ్చే పోయే జనానికంతా వినపడేలా ఆవిడ అరవటం మొదలెట్టింది.

ఎట్ట కేలకు వాళ్లిద్దరూ స్టేషన్ కొచ్చి పడ్డారు. బండి వచ్చేసింది. పెట్టెలో ఎక్కటంతోటే రామం కిటికీ దగ్గర కూర్చున్నాడు. "వెధవా! కిటికీ దగ్గిర కూర్చో వొద్దని చెప్పలేదూ—కంటిలో బొగ్గు పడుతుంది" రామం తండ్రి కోప్పడ్డాడు.

"మరి, కిటికీ దగ్గర కూర్చోక పోతే "గుంటూరు" అనే బోర్డు ఎలా కనపడుతుంది నాన్నా?" అన్నాడు రామం, బిక్కు బిక్కు మంటూ.

"ఊఁ... కూర్చోంటే కూర్చు న్నావ్ గానీ, కిటికీ దాటి నీతల మాత్రం బైటికి పెట్టకు: పైనించి తలుపు పడగలదు"

రామం కాస్త జరిగి కూర్చు న్నాడు. "ఉండు...బండిలో తెలిసిన వాళ్లెవరైనో ఉన్నారేమో చూసి వస్తా" అని వెళ్లి, కాస్సేపటికి తిరిగివచ్చి "ఎవ్వరూ లేరురా... నువ్వేం భయపడకూ! బోర్డు చూసు కొని దిగునాయనా"అన్నారు రాము తండ్రి, మొఖం అదోలాపెట్టి.

"సరేలే నాన్నా - నాకంతా తెలుసుగా" అన్నాడు రామం.

గార్డు విజిల్ వూదాడు. "చూడు నాయనా!... ఒకవేళ నీకు తెలియక పోతే గార్డు నడుగు. ప్రక్క కంపార్ట్ మెంట్‌లోనే వున్నాడు "గుంటూరు ఎక్కడా?" అని అడిగితేచెప్తాడు" అన్నాడు తండ్రి. రామం తల ఊపాడు. బండికూత కూసి బయలు దేరింది. "డబ్బు భద్రంరోయ్" అనీ ఇంకా ఏదేదో భద్రం అంటూ రామం తండ్రి వెనక నించీ బిగ్గరగా అరుస్తునే వున్నాడు. బండి అప్పుడే స్టేషన్ వదలి జెర్రిలా పాకిపోతోంది.

రామం మనస్సంతా టంగు టూరి మిరియాలమీదనే వుంది. నిజంగా మిరియాలు తాటికాయులం తవుంటే, చూడకుండా విడవకూడ దనుకున్నాడు. ఆపెట్టెలో వున్న ఒకాయనను అడిగాడు "మీరెంత దాకా వెళ్తున్నార"ని? ఆ బుర్ర మీసాలాయన "టంగుటూరు" అని జవాబిచ్చాడు. రామం మొహం వెడల్పు అయింది. టంగుటూరి మిరియాల సంగతిగురించి ఆయన్ను అడుగుదామనుకున్నాడు కాని— ఆతని బుర్ర మీసాలూ, ఎర్ర బారిన కళ్లు, ఆతని వాలకమూ చూసి సాహసించలేక పోయాడు. 'దారిలోనే వస్తుందిగా టంగు టూరు, అప్పుడు చూడవచ్చు ఒహర్ని అడిగే దేమిటిలే!' అని మన స్సును కుదుట పరచుకున్నాడు రామం.

రైలుప్రక్క స్టేషన్‌లో ఆగింది. ప్లాట్ ఫారం పైన తిరుగుతున్న గార్డును చూసేసరికి, రామానికి నాన్న చెప్పిన సంగతి జ్ఞాపకానికి

వచ్చింది: "సార్!" అని పిలిచాడు. గార్డు ఆగి వెనక్కి తిరిగి, రామం కిటికీకి కొద్దిగా దగ్గరికి వచ్చి నిలిచాడు, ఏమిటన్నట్లు చూస్తూ.

"టంగుటూరు ఎక్కడ సార్?" అని ప్రశ్నించాడు.

"ఇంకా నాలుగైదు స్టేషన్లున్నాయ్" అనేసి వెళ్ళిపోయాడు గార్డు.

వెధవ బండి ప్రతి స్టేషన్‌లోనూ ఆగుతూ పోతూందేం-ఇంకా టంగుటూరు ఎప్పుడు వస్తుందో అని విసుక్కున్నాడు రామం.

ప్రతి స్టేషన్‌లోనూ, గార్డును చూసినప్పుడల్లా టంగుటూరు గురించి అడిగేవాడు రామం. "ఇంకా వుందబ్బాయ్ ... రెండుమూడు స్టేషనున్నాయ్ ... టంగుటూరు వచ్చాక నేనే చెప్తాగా" అంటూ వెళ్ళిపోయేవాడు గార్డు.

బండి ప్రతి స్టేషన్‌లోనూ ఆగుతునే వుంది. గార్డు తనంత తానే రామం కిటికీ వద్దకువచ్చి "ప్రక్క స్టేషనే-టంగుటూరు" అనేసి వెళ్ళిపోయాడు, స్టేషన్ మాస్టర్ గదిలోకి. రామం సంతోషానికీ ఆతురతకూ అంతుఅన్నది లేకుండా పోయింది. ఎప్పుడెప్పుడు టంగుటూరు వస్తుందా - ఎప్పుడెప్పుడు తాటికాయలంత వుండే ఆపూరి మిరియాలను చూస్తామా, అని సదమదమై పోతున్నాడు.

బండి బయలుదేరింది. టంగుటూరు వచ్చేవరకూ కిటికీ గుండా ఈవైపూ, ఆవైపూకి చూస్తున్నాడు రామం. కంటిలో బొగ్గుపడి, మండిపోతూంది వాడి కన్ను. అయినా సరే-ఆకన్ను చేత్తో మూసి పట్టుకొని ఎడమ కంటితోనే తదేకదీక్షగా చూస్తున్నాడు.

టంగుటూరు రానే వచ్చింది. స్టేషనే వైపు అంతా కలియ చూశాడు. ఎక్కడా మిరియాల చెట్లు కనపళ్లేదు. వెనుకవైపు కూడా చూశాడు. దూరాన ఎక్కడో ఒక చెరువు. దాని చుట్టూ కొన్ని తాటిచెట్లు కనపడ్డాయ్. తానెన్నడూ మిరియాల చెట్లు చూసి వుండనందువల్ల అవే మిరియాల చెట్లయి వుంటాయనుకొన్నాడు. అప్పటికి కాని అతని మనసు కుదట పడలేదు. ఇంకా ఆ చెట్ల వంకే చూస్తూన్నాడు రాముం. బండి కదిలిందన్న సంగతి కూడా అతనికి తెలియనే తెలియలేదు.

కొద్ది కొద్దిగా వేగం హెచ్చి

★ టంగుటూరి మిరియాలు ★

స్తూన్న బండి అల్లా, వున్నట్లుండి తక్కున ఆగిపోయింది. ఆ కుదుపుతో రామం ఈలోకంలోకి వచ్చి పడ్డాడు. బండి ఎందుకు ఆగిందోనని అందరూ కిటికీ గుండా స్టేషన్ వైపుకు చూస్తున్నారు. తనూ తల బయటికి పెట్టిచూశాడు.

గార్డు సరాసరి రామం కిటికీ దగ్గరకు వచ్చి... "బాబూ! నువ్వు దిగలేదూ ... నేననుకొన్నా...ఇదే టంగుటూరు...ఊఁ... త్వరగా దిగేయ్?"



రామం తెల్లబోతూ "ఎందుకూ" అని అడిగాడు.

"నువ్వు ఇక్కడ్నేగా దిగాలి?"

"లేదండీ..గుంటూరులో"

"మరి దారి పొడుగునా టంగుటూరెక్కడా అని అడుగుతూ వచ్చావే?"

"లేదండీ...టంగుటూరి మిరియాలు తాటికాయలంతేసి వుంటాయని మా అమ్మ చెప్పింది. అవి ఎలా వుంటాయో చూద్దామని.."

గార్డుకు ఏడవ్వాలో నవ్వాలో తెలియలేదు. "చంపావ్ నాయనా! నీ మిరియాలు పాడుగానూ...నువ్వు టంగుటూరులో దిగాలేమో ననుకున్నాను నేను... నీ మూలంగా బండి లేట్ అయింది. నీ ధర్మాన నాకు తంటా కూడా తెచ్చిపెట్టావ్ మంచి అబ్బాయివి" అనేసి విజిల్ నోట్లో పెట్టుకుని పొట్ట నిండా గాలిపీల్చి ఊదాడు గార్డు. బండి బయలుదేరింది. పెట్టెలోని వారంతా రామం వంక చూసి పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వారు. రామానికి తల తీసేసినంత అవమానం తోచింది.

గుంటూరు కొచ్చాక "ప్రయాణం ఎలా వుందిరా" అని అక్క అడిగితే "బలే తమాషాగా వుండింది లేవే అక్కా" అని నవ్వుతూ సమాధానం చెప్పాడు, రామం. వాడి నవ్వుకు కారణ మేమిటో ఆమేకేం తెలుసూ! మీకు తెలుసును అనుకోండి. అయినా రామం కనిపించి నప్పుడు పొరపాటున అయినా టంగుటూరి మిరియాల విషయం ఎత్తకండేం. వాడు నామీద వుడుకొంటాడు! ★

'దిలాసా'

కోటాయ్ గంపల కొద్దీ తాటి గిలకలు తెచ్చి గొడ్ల సావిడిలో పోగులు పెట్టుతున్నాడు. వాడు అవి ఎందుకు తెస్తున్నాడో, ఖామందుగారి అబ్బాయి సుందరానికి ఎంతకీ అర్థంకాలేదు. ఒక రోజు సాయంకాలం కోటాయ్ గొడ్లను మేపుకువచ్చి సావిట్లో కట్టేస్తూ వుండగా సుందరం అడిగాడు.



"తాటి గిలకలు ఎందుకురా తెచ్చి పోగులు పెట్టుతున్నావ్ !"

"ఏం లేదులే చిన్నదొరా! వూరికే తెస్తున్నానులే."

"వూరికే తెస్తున్నావా! వూరికే కావాలంటే ఎవరైనా ఒకటి రెండు గిలకలు తెస్తారు కానీ, వెర్రి వెధవలా యిన్ని తెచ్చుకొంటూ రటరా?"

"లేదులే సిన్నదొరా! వాటితో సిన్నపని వుండదిలే!"

"ఏం పనిరా అది?"

"సెప్తాగా"

"ఊఁ:- చెప్పు"

"అబ్బే ఇప్పుడుకాదు. గ్యాపకం పెట్టుకోండి; యియ్యాల్టికి సరిగ్గా తొమ్మిదో రోజున రేత్రి తొమ్మిది గంటలప్పుడు నన్నడగండి. సెప్తాను."

"వీల్లేదు. ఇప్పుడే చెప్పు"

"అంత తొందరపడితే ఎట్లా సిన్నదొరా?"

"అయితే చెప్పవన్న మాట."

"సెప్తాగా"

"ఊఁ-చెప్తావ్ ! మా నాన్నతో చెప్పి నాలుగు తన్నిస్తేగాని నువ్వు చెప్పవు." సుందరం వుడుక్కొంటూ చరచరా యింట్లోకి వెళ్ళిపోయాడు. చిన్నదొర పోయినవైపుకే చూస్తూ కోటాయ్ తనలో తనే నవ్వుకొన్నాడు.

నాన్నగారిచేత కోటాయ్‌ని అడిగిద్దామా అనుకొంటే ఆయనేమో, తను స్కూలు నుంచీ యింటికి వచ్చేలోగానే ఏలూరుకు వెళ్లారట, అక్కయ్యను, బావను సూరిగాణ్ణి, అమ్ములుని పండక్కి తీసుకు రావటానికి. సూరిగాడు చుప్పనాతి. కానీ వాడి చెల్లెలు అమ్ములు వున్నదే-అది బలేపిల్ల. దానికి తను అంటే బలేయిష్టం. తనకూ అంతే.

ఇలా ఏవేవో ఆలోచించుకొంటూ వుండగా, కోటాయ్ గిలకల విషయం తనకు చెప్పకపోవటం తడవ తడవకు జ్ఞాపకం వస్తున్నది. అవి జ్ఞాపకం వస్తున్నకొద్దీ వాడిమీద పంతం పెరుగుతున్నది. గొడ్లు కాచుకొనే ఆ వెధవతో సావాసం రేపటి నుంచీ తగ్గించెయ్యాలి. అప్పుడుగాని వాడితిక్క వదలదు!

* * * *

ఏలూరు నుంచి అక్కయ్యా, పిల్లలూ నాన్నగారి వెంట వచ్చారు. బావగారికి తీరికలేక ఆయన రాలేదు. పండగనాడు వస్తాడని అమ్ములు చెప్పింది సుందరంతో, ఏదో మాటల సందర్భంలో. ఇల్లంతా బలే సందడిగా వుంది.

అటు సుందరం, యిటు కోటాయ్ కూడా ఎవరి ఆటల్లో వారు, ఎవరి పనుల్లో వారు పడిపోయి తాటి గిలకల వూసే ఎత్తటానికి వీల్లేక పోయింది.

చివరికి ఎలాగైతేనేం వెంకయ్యా కాపుగారు ప్రత్యేకం బస్తీకి వెళ్లి పది రూపాయలు పెట్టి రెండు

దీపావళి

ఊరూరా దీపావళి!
వీధి వీధి దీపావళి!
ఇంటింటా, ఎటు చూచినా
దీపావళి! దీపావళి

దీపశిఖా తోరణాలు
తేజః కిరణాలమాల!
అమావాస్య రాత్రివేళ
జగమే ఒక కాంతిడోల!

రండి రండి పిల్లలార!
ఆకాశపు తారకలను
అందుకొనే చిచ్చుబుడ్డీ
అదుగదుగో చూడరా!

కాంతులనే కత్తులతో
చీకటి నరకాసురుల్ని
చెండాడే విష్ణుచక్ర
మదుగదుగో చూడరా!


తోక చుక్కలల్లె మెరయు
తోటలవి చూడరా!
రంగు రంగు పూలు పూయు
పువ్వొత్తులు చూడరా!

అగ్గిపుల్ల గీస్తారా!
టపాసులు కాలుస్తారా!
చిచ్చుబుడ్లు, మతాబులు
ఎన్నో వెలిగిస్తారా!

నిదురించే నిశాకాంత
వెలుగు కలలు కన్నట్టుగా,
కాంతిగోళ మేదో పగిలి
వెలుగు తునక లెగసినట్టుగా,

జగమంతా దీపావళి
ప్రతిచోటా దీపావళి!
హాయహాయి ఈనాడే
దీపావళి! దీపావళి!

నండూరి రామమోహనరావు



★ 'దీలావాస' ★

తాతాకు బుట్టల నిండా టపాకాయలు పట్టుకొచ్చారు. ఆయన బుట్టలు యింట్లోకి తెచ్చి తేవటంతోటే పిల్లలు ముగ్గురూ వాటి మీదికి ఎగబడ్డారు. అందరినీ నడవలోకి తీసుకెళ్లి, మూడు చేటలు తెప్పించి, మూడింటిలోనూ రకానికి ఒకటి చొప్పున టపాకాయలన్నీ పంచిపెట్టి ఎవళ్ల సరుకు వాళ్లకు అప్పగించారు.

పిల్లలు ముగ్గురూ తమ తమ దీపావళి సరుకును చూసి మురిసిపోతున్నారు.

"ఒరేయ్ సుందరం! నాకు మతాబాలు పది వచ్చాయిరోయ్" అన్నది అమ్మలు.

"నాకూ పది వచ్చాయిలే" అన్నాడు సూరి.

"నాకూ అంతే. కానీ-నా చిచ్చుబుడ్డి చూశావా ఎంచక్కా వుందో!" సుందరం చిచ్చుబుడ్డిని చేత్తో తడివి చూస్తూ, మనసులో, దానిని వెలిగించి నప్పుడు వచ్చే వెల్తురు, రాలే పూలు అవన్నీ వూహించుకొంటున్నాడు.

"సుందరం దీని పేరేమిట్రా ?" అని అడిగింది అమ్మలు.

"ఏటం బాంబు?"

"అంటే"

"అంటే - బాంబు అన్న మాట. పెద్ద బాంబు. ఇది గనక పేల్చామంటే 'ఢాం' అని - పే - ద్ద - చప్పుడు అవుతుంది. ఆ చప్పుడికి మన తువ్వాయ్ కట్టుతాడు తెంచుకు పారిపోతుంది. కోటాయ్ చెవి గూబ పేలి పోతుంది."... ఇంకా ఏమేమి జరుగబోతాయో అన్నీ ఏకరువు పెట్టుతున్నాడు సుందరం.

అమ్మగారి చేతి కందకుండా, అయ్యగారి కంట పడకుండా కోటాయ్ ఎప్పుడు వచ్చాడో ఏమో, వాడూ యీ పిల్లలతో పాటు టపాకాయలను చూసి మురిసిపోతున్నాడు. వాళ్లు *ఒక్కొక్క టపాకాయీ పైకి తీసి పట్టుకు చూస్తుంటే, వాళ్లకంటే ఎక్కువగా వీడి ముఖమే విప్పారిపోతోంది.

"అయితే నిజంగా అంతలావు చబ్దం అవుద్దంటావా సిన్నదొరా!" అని అడిగాడు కోటాయ్


ఇప్పటికి కానీ ఆపిల్లలకు వీడు అక్కడే వున్న విషయం గమనానికి రాలేదు. ఆ చిన్న దొరగారికి, ఆనాడనగా కోటాయ్ మీద వచ్చిన కోపం, యింకా చల్లారలేదు. సుందరం ముఖం చిట్లించేసుకొన్నాడు.

"ఒరేయ్ కోటాయ్ ! ఎక్కడ తగలబడ్డావురా. వులవలు రుబ్బకుండా పచార్లు చేస్తున్నావా" అంటూ పెద్ద దొరసానిగారు యింట్లోనుంచే పొలికేక పెట్టారు.

"వస్తుందానమ్మగారూ" అంటూ కోటాయ్ అక్కడి నుంచీ వెళ్లిపోయాడు.

* * * *

దీపావళి పండగ ఎల్లుండే. నిద్దర లేస్తూనే సుందరం తన టపాకాయలు దాచి పెట్టుకొన్న పెట్టి దగ్గిరకు వెళ్ళి, దాని మూత తెరిచి చూశాడు. తనవంతకు వచ్చిన చిచ్చు బుడ్లల్లో ఒకటి, సీమ టపాకాయల గుత్తి ఒకటి, కప్పగంతులు పెట్టె ఒకటి తరిగి పోయాయి. అతని గుండె ఆగినంత పని అయింది. అమ్మతో చెప్దామని దొడ్లోకి వెళ్లుతున్నాడు.



నడవలో అక్కయ్య కాఫీ కాస్తున్నది. ఆవిడ దగ్గిరగా అమ్మలు కూర్చొని కాఫీ ఫిల్టరుకేసి ఆశగా చూస్తున్నది. సూరిగాడు మాత్రం గొప్ప పోజు పెట్టేసి వాళ్ళఅమ్మతో చెప్తున్నాడు.

"అమ్మా; రాత్రే- నాకే- కలలోనే-హనుమంతుడు కనిపించాడే కనిపించీ- మరేమోనే-' టపాకాయలు కొన్నావా' అని అడిగాడే. అడిగితేనూ- 'మా తాతయ్య తెచ్చి పెట్టారు'- అన్నానే. అంటేనూ- 'ఏవీ చూపించు' మన్నాడే. మరిటూ- అప్పుడటా- నేనటా- ఆయనను గది

లోకి తీసుకెళ్లీ-పందిరిపట్టె మంచం కింద చేటలోవున్న నా టపాకాయలు చూపెట్టానటే. ఆయన- అవన్నీ చూసీ- ‘యింతేనా’ అని అడిగారే. అడిగితేను - ‘అంతే’ నన్నానే. అంటేనూ- ‘పాపం నీకు కాసినే టపాకాయలు వున్నట్లున్నాయే’ అన్నారే, అంజనేయుల వారు! అనీ - ‘వుష్’ అంటూ - ఒక్కయీల వేసేశారే. ఈలవేసి- చెయ్యి యిట్టా చాపే సరికల్లా- అందులో యిన్ని టపాకాయలు వచ్చి పడ్డాయే. ‘ఇవిగో సూరీ, యివి కూడా నువ్వే కాల్చుకో. నీ చెల్లిలికి కానీ, ఆ సుందరానికి కానీ ఒక్కటికూడా యివ్వకు సుమా’ అన్నారే. అనీ- నాచేతికిచ్చి మాయమై పోయారే. నేను అప్పుడు ఏం చేశానంటే-కళ్లు తెరిచి చూశానే. ఆంజనేయులైతే లేరుకానీ, నా చేతిలో టపాకాయలు మాత్రం వున్నాయే.” అంటూ పెద్ద గర్వంగా చెప్పుతున్నాడు.

సుందరానికి అప్పుడే అర్థమైంది- ఈ చుప్పనాతి సూరిగాడు తన టపాకాయలు కొట్టేసి ఆంజనేయులు తన కిచ్చాడని వాళ్ల అమ్మదగ్గిర గొప్ప చెప్పుకొంటున్నాడని. తను మూతి మూరెడు పొడుగు చేసుకొని అమ్మదగ్గిరకు పోయి ఆ సంగతి అంతా చెప్పాడు. ఆవిడ అసలే పని చిరాకులో వున్నదేమో-“తీసుకొంటే తీసుకొన్నాడు లేరా. వాడు మాత్రం పరాయివాడా! నా పనికి అడ్డురాక పో” అని విసిరి కొట్టింది.

నాన్నతో చెప్పుదామనుకొంటే ఆయన అంతకు ముందే పొలానికి వెళ్లి పోయారు. ఆరోజు రోజుఅంతా సుందరం దిగులుగానే వున్నాడు. అమ్మలువచ్చి ఎంత ఆడించాలని చూసినా యితగాడు ఎందుకో ఆ ఆటల్లో చేరలేక పోయాడు. నాన్న వస్తాడేమో అని రాత్రి తొమ్మిదింటి దాకా కనిపెట్టకు కూర్చొన్నాడు. కానీ ఆయనరాలేదు. చివరికి తనకే విసుగేసి నిద్రపోయాడు.

మరునాడు తెల్లవారుఝామునే అమ్మా, అక్కయ్యా కలిసి పిల్లలకీ పెద్దలకీ తలంట్లు పోశారు. బావకూడా రాత్రి బండికి వచ్చినట్లున్నాడు. తనకంటె ఎక్కువ నిద్ర మత్తు వచ్చి పీటల మీద కూర్చున్నాడు. తలంట్లు పోసుకొనే సమయంలో వెంకయ్య కాపుగారే స్వయంగా తాను దగ్గిర వుండి పిల్లలందరి చేతా పేరుకి మూడే మూడు సీమ టపాకాయలు కాల్పించారు. అక్కడే తారట్లాడుతున్న కోటాయ్ చేతికి కూడా ఒక తాటాకు టపాకాయ యిచ్చారు.

ఆరోజు రోజంతా పిండి వంటల ఘుమ ఘుమలతో యిల్లు పండగ వాసన వేసింది. సాయంకాలానికి అందరూ ఢిళ ఢిళ లాడుతున్న కొత్త బట్టలు కట్టుకు ముస్తాబైనారు. సాయంకాలం నాలుగంట లైనప్పటి నుంచీ పిల్లలు ముగ్గురూ టపాకాయలు పేర్చివున్న ఆ చేటల చుట్టూ కాలుగాలిన పిల్లులలా తిరగటం ప్రారంభించారు. వీధి అరుగు మీద వెంకయ్యగారు వుండకపోతే సూరి కానీ, సుందరం కానీ టపాకాయలు వెలిగించేవారే. కానీ - ఎలాగు? ఆయన అక్కడనుంచి కదలందే.

ఎట్టకేలకు పొద్దు కూకింది. అమ్మా, అక్కయ్య అమ్మలూ కలిసి వీధి వాకిట్లోనూ ప్రహరీ గోడలమీద నూనె దీపాలు పెట్టుతున్నారు. ఇల్లుఅంతా కళకళ లాడి పోతోంది.

ప్రక్క యిళ్ల వాళ్లు అప్పటి కప్పుడే టపాకాయలు ‘ఢాం’ ‘ఢీం’ అనిపిస్తున్నారు. ఆ మోతలు వింటున్న కొద్దీ సుందరానికీ, సూరికీ చేతుల్లో తీట ఎక్కువ అయింది. ఇంతలో వెంకయ్యగారు వీధిలో నుంచే కేకేశారు “మీరు కూడా కాల్చండిరా” అని.

సూరికంటె ముందు సుందరం, సుందరం కంటె ముందు సూరీ పరుగెత్తు కొంటూ వెళ్లి టపాకాయలు పెట్టిన చేటలు పట్టు కొచ్చారు. సూరి అందరికంటె ముందు తనే కాల్చాలన్న పంతం కొద్దీ సీమ టపాకాయ పట్టుకెళ్లి ప్రమిద వత్తికి వెలిగించాడు. అది అతని మొఖం మీదనే ‘ఢాం’ అంది. ఆ పొగ అంతా కళ్లల్లోకి పోయింది. వాళ్ళమ్మ వెనకనుంచీ కేకలు పెట్టింది - “చేతకాని వెధవవు; ముందు ఎగబడతావు ప్రతిదానికీ. ఈపాటికి మొఖం కాలిపోయేదే. ఇంకా నయం! నువ్వు యిలా వచ్చి అరుగుమీద కూర్చో. అమ్మలు-

సుందరం టపాకాయలు కాలుస్తుంటారు. చూస్తూవుండు."

సూరిగాడికి బలేఏడుపు వచ్చింది. పైగా సుందరం, పకపకా నవ్వుతున్నాడు. ఇక ఛస్తే యీ టపాకాయలు కాల్చకూడదని ఒట్టేసుకొని అరుగుమీద ఒక మూలగా పోయి కూర్చున్నాడు.

సుందరం, అమ్మలు యిద్దరూ కలిసి ఒక ప్రమిదను తెచ్చి వరండాలో పెట్టుకొని ముందుగా అగ్గిపుల్లలు వెలిగించారు. ఎరుపు, ఆకుపచ్చరంగుల వెలుతురులో అమ్మలు బలే చక్కగా వుంది. నవ్వుతున్నప్పుడు దాని పళ్లు తళతళా మెరిసిపోయాయి.

ఆ తరువాత పాముమందు కాల్చారు. తెల్లటి బిళ్ళలోనుంచి పాములు పుట్టుకువస్తుంటే మొదట్లో సరదాగానే వుంది కానీ, తరువాత చప్పబడిపోయింది. కడ్డీలు తీసి



కాల్చారు. నిప్పురవ్వలు పడుతుంటే సుందరం గొప్పగా తన అరచేతిమీద వాటిని పడేసుకొని అమ్మలుకు చూపెట్టాడు. అమ్మలు తను కూడా ఆ పనిచేసి కిలకిలా నవ్వింది. ఇక కాకరపువ్వొత్తులు, మతాబాలు వున్నాయి. అమ్మలు వాళ్ళ అమ్మను అడిగి రెండు అట్లకాడలు పట్టుకొచ్చింది. మతాబాల వెనుకవైపు అట్లకాడలు గుచ్చి యిద్దరూ కాల్చారు. ఆ మతాబాలు నాసిరకం వాటి మాదిరిగా ఉన్నాయి - ఎంతసేపటికీ గప్పున వెలుతురు రావటమే లేదు. పచ్చికట్టెలు పొయ్యిలో పెట్టినట్టుగా ఒకటే పొగ వ్యాదరపెట్టేసింది. ఇద్దరూ ఆ పొగతో వుక్కిరిబిక్కిరి అయిపోయారు.

సీమటపాకాయలు తీశారు. ముందుగా సుందరమే ఒకటి వెలిగించి అక్కడ పారేసి తాను యివతలకు పరుగెత్తుకు వచ్చాడు. అది ఎంతకీ పేలనే లేదు. అరుగుమీద కూర్చున్న సూరి పక్కున నవ్వాడు. సుందరానికి పౌరుషం వచ్చేసింది. మరొక సీమటపాకాయ పట్టుకొవెళ్లి దీపానికి పెట్టి వెలిగించి చేత్తో పట్టుకొని అక్కడే నిలబడ్డాడు. ఈసారి అది బ్రహ్మాండమైన శబ్దం చేసి పేలిపోయింది. ఆ శబ్దం ఆగిపోయిన నాలుగైదు నిమిషాలదాకా సుందరం, కళ్ళు అయినా తెరవకుండా, ఎలా వున్నవాడు అలాగే వుండిపోయాడు. మిగిలిన టపాకాయలన్నీ ఎలా కాల్చాలో తెలియక తికమక పడుతుంటే కోటాయ్ దొడ్లోకిపోయి ఖాళీ సున్నపుడబ్బా పట్టుకొచ్చి, అందులో సీమటపాకాయల గుత్తి, గుత్తిపళంగా వెలిగించి పడేశాడు. ఇక ఒకటే మోత. పిల్లలందరూ దూరంగా నిల్చొనే చప్పట్లు కొట్టి గంతులు వేశారు. ఆ ఆసరా చూసుకొని కోటాయే, మిగిలిన టపాకాయలన్నిటినీ తనే పేల్చేశాడు. వాడు పేలుస్తుంటే అది చూసి నవ్వటంతోటే తృప్తిపడ్డారు ఈ ధీరులు!

ఇంతా చేసి 'దీపావళి పండుగ వస్తోంది, టపాకాయలు కాల్చుకొంటాం,' అని గంతులు వేసినంతసేపు పట్టలేదు-వీళ్లు టపాకాయలు కాల్చే తతంగం. అంతా కలిసి అరగంటలో, వెంకయ్య కాపుగారు పట్నం నుంచీ అల్లా తెచ్చిన పది రూపాయల సరుకూ అయిపోయింది. ప్రక్కయిళ్లల్లో నుంచి మాత్రం యింకా 'ఢాం' 'ఢుం'లు వినిపిస్తూనే వున్నాయి.

కోటాయ్ ఆటంబాంబుతో సహా అన్ని టపాకాయలు కాల్చేసి, గొడ్లసావిడిలో తాను పడుకొనే మూలకు వెళ్ళి, పొట్లం, ఏదో పట్టుకొచ్చి దానిని ఒక తాటిమట్టకు తాడుతో గట్టిగా కట్టాడు. ప్రమిద దగ్గిరకు తెచ్చి వెలిగిస్తూ వుండగా సుందరమే ముందుగా

(52-వ పేజీ చూడండి)



బొమ్మరిల్లు సీరియల్

డాన్ క్విక్సొట్

పూర్వకథ

లామంచా అనే గ్రామానికి చెందిన డాన్ క్విక్సెట్ అనే వెర్రివెంగళప్ప తానొక వీరుడుగా చెలామణీ కావాలనుకొని, శాంకో పాంజా అనే చదువురానివాణ్ణి తన బంటుగా చేసుకొని వీరవిహారాలకు బయలుదేరాడు. ఎవరో ఒక ఆడామెనుచూచి ఆమెకు డల్‌సీనియా రాకుమారిఅనే బిరుదాన్ని తనమనస్సులోనే యిచ్చేసి, ఆవిడను మెప్పించటంకోసమే తానీ ధర్మరక్షణామనే కఠోరదీక్షను స్వీకరించానని నమ్మాడు. లోగడ డాన్ క్విక్‌సెట్ గారు తాను జయించబోయే దీవుల్లో ఒకదానికి శాంకో పాంజాను గవర్నరుగా చేస్తానన్నాడు. వాడా మాట నమ్మి ఆరోజుకోసం ఎదురు చూస్తున్నాడు. ఇలా వుండగా ఒకరోజు వీళ్ళకు ఒక డ్యూక్ దంపతులు తారసిల్లారు. వారికి వీళ్ళిద్దరినీ వేళాకోళం చేయాలనే బుద్ధి పుట్టింది. ఆ స్వామినీ, బంటునీ తమ దేవిడీకి తీసుకుపోయి, తిండి అదీ పెట్టి బాగా ఆదరించారు. డాన్ క్విక్‌సెట్‌గా రిచ్చిన మాటప్రకారం తానే శాంకోపాంజాను బార్‌టారియా అనే పట్టణానికి గవర్నరుగా నియమించాడు ఆడ్యూక్. అక్కడికి గవర్నరు హోదాలో వెళ్లిన శాంకోపాంజాగారు ఒకటిరెండు కేసుల్లో చాలా తెలివైన తీర్పుయిచ్చారు. న్యాయస్థానంనుంచి సరాసరి గవర్నరుగారు విడిదికి వేంచేశారు.

18

ఘనత వహించిన గవర్నరు శాంకో పాంజాగారిని స్థానికోద్యోగులు న్యాయస్థానం నుంచి రాజభవనానికి తీసుకు వెళ్లారు. ఆ ప్రాసాదంలో అప్పటి కప్పుడే గవర్నరుగారి విడిదికి కావలసిన అన్ని హంగులూ పూర్తి అయినాయి. ఈయన భవనంలో ప్రవేశించినది మొదలు ఎక్కడినుంచో శ్రావ్యమైన సంగీతం వినిపింపుతోంది. శాంకో పాంజాగారు దోవపొడుగునా గల అలంకరాలను తనిఖీచేస్తూ, ముసిముసి నవ్వులు నవ్వుతూ ముందుకు పోతున్నారు.

అంతఃపురోద్యోగులు ఆయనను భోజనశాలకు నడిపించుకు వెళ్లారు. అక్కడ అప్పటికప్పుడే భోజనాలకు పెద్ద ఏర్పాట్లు జరిగివున్నాయి. నలుగురు నౌకర్లు తలా ఒక పాత్రతో నీళ్లూ, తుండుగుడ్డ పుచ్చుకొని నిలుచొని వున్నారు. గవర్నరుగారు ఆ నీళ్లతో చేతులు కడుక్కొని, ఆ తుండు గుడ్డలతో తుడుచుకొని భోజనానికి కూర్చొన్నారు. అక్కడవున్న బల్లా ఆబల్లమీద పెట్టివున్న పళ్లేలు, గిన్నెలు గ్లాసులు చూస్తుంటే తనపంక్తి కింకా ఎందరు వస్తారోనని శాంకో పాంజాగారు మొదట్లో అనుకొన్నారు; కానీ నిజానికి అంత భారీ ఏర్పాట్లన్నీ తను ఒక్కడికోసమేనని తరువాత తెలుసుకొన్నారు. అసలే తిండియావ



మూలం : సెరివాన్‌టెజ్ ★ అనువాదం : శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

ఎక్కువగా వుండే తత్వం కలిగిన మనిషి; దానికితోడు డ్యూక్ భవనం నుంచి బయలుదేరినది మొదలుగా యింతవరకు కడుపు నిండా తిండిగానీ, కంటి నిండా నిద్రకానీ ఎరుగకవున్న కారణంచేత, గవర్నరు శాంకో పాంజాగారు ఆకలిగొన్న సింహంలా వున్నారు.

వంటకాలమీద కప్పివున్న ఆ తెల్లటి దుప్పటి తొలగించి తినబోతూ వుండగా ఎవరో ఒక వుద్యోగి చేతితో ఒక చిన్నదండం పుచ్చుకు దబదబా ముందుకు వచ్చాడు. అతని మొఖం చూస్తే తుమ్మల్లో పొద్దు కూకినట్లు ధుమధుమ లాడుతున్నది. భోజనశాలకు వచ్చి రావటమే తడవుగా ఆ వుద్యోగి గవర్నరుగారు కూర్చొన్న కుర్చీ వెనుకకువచ్చి నిలబడ్డాడు. ఇంతలో ఒక నౌకరు పెద్ద పళ్లెం నిండా నానావిధ ఫలాలను పట్టుకొచ్చి శాంకో పాంజాగారి ఎదుట పెట్టాడు. నిగ నిగలాడే ఆపళ్లు, ఘుమఘుమలాడే ఆ వంటకాలు చూస్తుంటే శాంకో పాంజాగారి నోరు తెగ వూరింది. పళ్లల్లో ఒక దానిని ఆయనపైకి తీయబోతుండగా కుర్చీ వెనుకను నిల్చొన్న ఆమనిషి తన చిన్ని చేతి కర్రతో ఆ పళ్లేన్ని తాకాడు---వెంటనే అక్కడి నౌకరు గబగబా ముందుకు చొచ్చుకువచ్చి పళ్లు పేర్చివున్న ఆపళ్లేన్ని ఎత్తుకు చక్కాపోయాడు. పళ్లు లేకపోతే మానే, ఆ కుర్మానైనా రుచి చూద్దామని శాంకో పాంజాగారు ఆపళ్లేన్ని ముందుకు లాక్కోబోయారు. ఆ పళ్లేన్ని కూడా కుర్చీవెనుక నిల్చొన్న మనిషి తన కర్రతో తాకాడు. మరొక నౌకరువచ్చి ఆ పళ్లాన్ని పట్టుకుపోయాడు. కడుపులో కాలుతున్న శాంకో పాంజాగారికి, దానితో వళ్లు మండుకు వచ్చింది. తనకుర్చీకి వెనగ్గా నిలబడివున్న ఆమనిషి వైపుకు తిరిగి 'నీ చర్యకు సంజాయిషీ చెప్పుకో' మన్నట్లు ఒక్కచూపు చూశారు.

ఆవ్యక్తి కుర్చీ చాటునుంచి యివతలకు వచ్చి శాంకో పాంజాగారికి వంగి దణ్ణంపెట్టి "నేను తమ ఆస్థాన వైద్యుణ్ణి, ప్రభూ! తమ ఆరోగ్యాన్ని గురించిన జాగ్రత్తలు తీసుకోవటం నావిధి. అందుకే నాకు జీతం యిచ్చి పోషిస్తున్నారు ప్రభువులవారు. గవర్నరుగారు భోజనం చేసే సమయంలో వారి సమక్షంలో వుంటూ, ఘనత వహించినవారి ఆరోగ్యానికి భంగం కల్పించే పదార్థాన్ని దేన్నీ వారు తినకుండా చూడటమనేది నా విధులలో ప్రధానమైనది. కనుకనే నెమ్మా, శీతలము చేసే ఆపళ్లు తమరు ఆరగించకుండా అడ్డుపడ్డాను. అల్లాగే ఆ కూర్మాకూడా! అదిగనక తమరు తిన్నారా అంటే—తమరు విపరీతమైన వుష్ణం వచ్చేస్తుంది" అన్నాడు.

"అఘోరించినట్లే వుంది ... పోనీ — ఏ చెడూ చెయ్యని ఆ పావురాయి పులావ్ తినమంటావా:" అని అడుగుతూనే శాంకో పాంజాగారు ఆపళ్లెం మీదికి చెయ్యి పోనిస్తున్నారు.

"వద్దు: వద్దు" అంటూ ఆస్థాన వైద్యుడు అడ్డుపడి, "నా గొంతులో ప్రాణం వున్నంతవరకు మీ నోట్లోకి ఆ పులావ్ పోనీయను. కడుపు ఖాళీ లేకుండా తినటమే తప్పు. అందులోనూ పులావ్‌తోనే కడుపు నింపటం అంటూ సంభవిస్తే, అది దేహానికి ఎంత చెరుపు చేస్తుందో వైద్య శాస్త్రంతో పరిచయమున్న ప్రతి ఒక్కరికీ తెలుసు." అంటూ అందుకు సంబంధించిన వైద్య సూత్రమేదో వల్లించబోయాడు.

"అది సరే. నేను తిన దలుచుకున్న ప్రతిదాని విషయంలోనూ నువ్వు దోషం వెదుకటం కంటె, యిప్పుడు యీ బల్లమీద వున్న యిన్ని తినుబండారాలలోనూ నేను తినదగినది అంటూ ఏదైనా ఒకటి వున్నట్లు నీ మనస్సుకు తోస్తే, అది చప్పున చెప్పేయి. లేకపోతే యిక కొద్ది క్షణాలలో నేను ఆకలి చావు చావవలసి వస్తుంది." అని శాంకో పాంజాగారు కోపంగా అడిగారు.

"మీరు అలా కరాఖండిగా అడిగేట్లయితే- యిక్కడవున్న యిన్ని తినుబండారాలలోనూ తమరు తినదగినది అంటూ ఒక్కటీ లేదని చెప్పవలసి వస్తుంది. ఏమంటారా ?— మాట వరసకు చూడండి: అది కుందేటి మాంసం. దానిని రుచి చూడటం కంటే తెలివి తక్కువ పని మరొకటి లేదు. అవతల పళ్లెంలోది చూడండి: అది ఆవుదూడ మాంసం. దానిని మితిమీరి వేయించారు. అందుచేత దానిని తింటే మీ కాలేయం దెబ్బతిని పోతుంది. ఇలా కాకుండా— అంటే ఆదూడ మాంసాన్ని వేయించ కుండానూ, పూర వేయకుండాను వున్నట్లయితే—అది వేరే విషయం.

★ డాన్ క్విక్ సెట్ ★

అప్పుడు చెప్పేవాణ్ణి తినవచ్చునో, తినకూడదో. ఇంతకీ తమరి ఆరోగ్యం దెబ్బ తినకుండా చూడవలసిన బరువు బాధ్యతలు నామీద వున్నాయి కనుక చెప్పుతున్నాను: తమరు యిప్పటికి మాత్రం ఆ వంద వుప్పు బిస్కట్లు, ఆ ముల్లంగి దుంపలు తినండి." అన్నాడు ఆవైద్య శిఖామణి, అక్కడికి తాను గవర్నరుగారి కోసం ప్రత్యేకం వైద్యశాస్త్ర నిషేధాలను తొలగించినట్లు. దాంతో ఘనత వహించిన గవర్నరుగారి వళ్లు మండి పోయింది. తనను గనక దేనినీ తిననీయకపోతే యీ వైద్యుణ్ణి కాళ్లూ చేతులు కట్టేయించి కోట గోడల మీది నుంచి కిందికి విసిరి పారేయిస్తానని శాంకో పాంజాగారు హెచ్చరిక చేశారు—ఆయన ఆకోపంలో అంతపనీ అప్పుడే చేసేస్తారేమోనని భయపడిపోయి ఆ వైద్యుడు అప్పటి కప్పుడు ఆయన ఎదుట వుండ కుండా బయటికి జారుకోవాలని చూస్తున్నాడు. అంత పనీ చేసేవాడే.

కానీ యింతలో బయట కాపలా వాడెవడో కొమ్ము వూదాడు. అందరి దృష్టి ఆధ్వని వస్తున్న వైపుకు మరలింది. ప్రతి ఒక్కళ్లూ ఆత్రంగా చూస్తూ వుండగా 'డ్యూక్' సేవకుడొకడు గబగబా శాంకో పాంజాగారి భోజనాల గదిలోకి చొచ్చుకు వచ్చాడు. వచ్చీ రావటం తోనే గవర్నరుగారికి వందనమొకటి విసిరేసి, వుత్తరం ఒకటి తీసి ఆయన చేతికి యిచ్చాడు.

ఘనత వహించిన గవర్నరు శాంకో పాంజా గారికి చదువు రాదు. అందుచేత ఆయన ఆవుత్తరాన్ని ప్రక్కన నిలబడివున్న నౌకరుకు యిచ్చారు,—చదివి పెట్టమని. వాడు దానిని పట్టుకెళ్లి తన పైవుద్యోగికి యిచ్చాడు. ఆతడు తన పైవుద్యోగికి యిచ్చాడు. ఆయన కూడా తనకంటె పైవుద్యోగికి యిచ్చాడు. మొత్తానికి యీ వుత్తరం నిచ్చెన ఎక్కినట్లుగా క్రింది వుద్యోగుల చేతుల్లో నుంచి పై వుద్యోగుల చేతుల్లోకి పోయి పోయి చివరకు గవర్నగారి ఆంతరంగిక కార్య దర్శి చేతుల్లోపడి అంతటితో ఆగిపోయింది. ఆ కార్య దర్శి వుత్తరాన్ని చేత బట్టుకొని గవర్నరుగారి సము ఖంలోకివచ్చి నిలబడి, దానిని తెరిచి చదివి వినిపించే ముందు అందులో రహస్యమైన విషయం ఏదో వుందని చెప్పాడు. అందుమీదట శాంకో పాంజాగారు అక్కడవున్న అందర్నీ తొలగి పొమ్మన్నారు. తానూ, ఆ కార్యదర్శి, మరొక వున్నతోద్యోగి తప్ప మిగిలిన వాళ్లంతా బయటకు నడిచారు.

అందరూ వెళ్లి పోయారని నిర్ధారణ అయ్యాక కార్యదర్శి వుత్తరం విప్పి చదివాడు. డ్యూక్ గారు వ్రాసిన ఆ వుత్తరంలో యిలా వుంది.

"ప్రియమైన డాన్ శాంకో పాంజా గారికి—

మన శత్రువులలో కొందరు మీ దీవిపై ఎప్పుడో ఒకనాడు అర్ధరాత్రి వేళ దండెత్తి రాబోతున్నట్లు మాకు వార్తలు వచ్చినవి. అందుకై వారు మహోధృతమై సన్నాహములు కూడా చేస్తూ యున్నట్లు మాకు అతి విశ్వసనీయంగా తెలుస్తూ వున్నది. మాకు తెలిసిన యీ వార్తను మీకు యిందు మూలముగా అందచేస్తూ మీ మీ జాగ్రత్తలో వుండగలరనీ, దీవి రక్షణకు తగిన కట్టు దిట్ట ములు తక్షణమే చేయగలరని ఆశించటమైనది.

"మరియొక విశేషము. శత్రు సమూహమునకు చెందిన నలు గురు గూఢచారులు మీ పట్టణమందు ప్రవేశించి సంచరించు చున్నట్లునూ మాకు స్పష్టముగా తెలియవచ్చె. ఈ నలుగురునూ మిమ్ము హత్యజేయ పొంచియున్నట్లు తేట తెల్లమగు చున్నందున, మీతో సంభాషించ వచ్చెడి అపరిచిత వ్యక్తుల విషయమై తగినంత శ్రద్ధతీసుకొన వలసినదిగా కోరటమైనది. అంతియే కాదు,—పరాయి వారెవరైనా తమకు కానుకలుగా తెచ్చియిచ్చు ఫలపుష్పాదులు, శాక పాకములను స్వీకరించు సందర్భమునను తగినంత జాగ్రతతో నుండగలందులకు హెచ్చరిక చేయుట మైనది.

"మీ దీవిరక్షణకై తమకు అదనపు సైన్య సహాయమేమైన కావలసినచో, మాకు కబురు పంపినయెడల, అందుకు తగు ఏర్పాట్లు చేయగలము. ఎట్టి సందర్భములోనూ శత్రువులను పారద్రోలి దీవిని సురక్షితముగా నుంచగలరని ఆశించు చున్నాము.

కోట
ఆగష్టు 16— }

మీ మిత్రుడు,
డ్యూక్.

ఈవార్త వినగానే అక్కడవున్న వారందరి మనస్సులోనూ భయ విహ్వాలత్వం అలుము కొన్నది. ఒక్కరు కూడా పెదిమ కదిలించి చప్పుడు మాట్లాడ లేక పోయారు. ఐదారు నిమిషాలసేపు అందరూ నిశ్శబ్దంగా వుండి పోయారు.

చివరికి శాంకో పాంజాగారే అందరిలోకీ ముందుగా తేరుకొని "నన్ను చంపాలని చూస్తున్న వాళ్లు ఎవరైనా వుంటే, అది యీ ఆస్థాన వైద్యుడే.

(62-వ పేజీ చూడండి)



జంతుకోటిలో మానవలక్షణాలు

ఏమాదిరిగా ఆశ పెట్టితే ఏ జంతువు తన తెలివి తేటలన్నిటినీ వుపయోగించి పని చేస్తుందో తెలుసుకోవటమే కష్టమనుకొంటే, ఆవస్తువు ఏదో తెలిశాక పరీక్ష ఎలా చేయాలో తెలుసుకోవటం అంతకంటే కష్టం.

పైగా పరీక్షసాధన మేదైనా కనిపెట్టినా, అది అన్నితరహాల జంతువులకీ న్యాయం చేసేదిగా వుండాలి కానీ, చేతులు వుపయోగించటం తెలిసిన కోతులకు తేలిగ్గావుండి, నాలుగుకాళ్లూ కాళ్లుగానే కాని, ముందు కాళ్లను చేతుల్లా వుపయోగించడం అంటే ఏమిటో తెలియని కుక్కలు, ఆవులు, మొదలైన వాటికి కష్టంగా వుండకూడదు. కుక్కలకీ ఆవులకీ కాళ్లు నాలుగు అయితే, కోళ్లకు పక్షులకు రెండే కాళ్లు. పాములకు అసలు కాళ్లే లేవు. ఈ విధమైన వ్యత్యాసాలు వున్నందువల్ల జంతువు లన్నిటినీ పోల్చే పరీక్షలలో వేటికీ అన్యాయం జరుగకుండా చూడటం పరీక్షించే పెద్ద మనుష్యుల కనీసధర్మం.

ఈవిషయాన్ని గురించి యిటీవల అనేకమంది మనస్తత్వ శాస్త్రవేత్తలు తలలు బద్దలు కొట్టుకొని ఆలోచించారు. ఏ జంతువు నైనా చిక్కుదారుల్లో వదిలిపెట్టి అది ఎంత చవ్వున ఆదారులన్నీ తప్పించుకు బయట పడుతుందో పరీక్షించట మనేది చాలా కాలం పాటు పరిపాటిగా వుంటూ వచ్చింది.

చిక్కుదారు లంటే ఏమిటో కొద్దిగా వివరించి చెప్పవలసి వుంది.

మామూలుగా పిల్లల పత్రికలలో మీరు చూస్తూ వుంటారు. ఏవేవో గళ్లు గళ్లుగా బొమ్మలు వేసి, ఆగళ్ల నడుమను గూడు వున్నట్లు ఆగూటికి చేరటానికి ఒకటే ఒక సరైన మార్గం వున్నట్లు, ఆమార్గం ఏదో యీ చిక్కిరి బిక్కిరి గళ్లల్లో చిక్కుకు పోయినట్లు చిత్రిస్తూ వుంటారు. గూటికి చేరలేక బిత్తరి చూపులు చూస్తున్న పిట్టకు సరిఅయిన దారి ఏదో మిమ్మల్ని వెదికి చూపెట్టమని పత్రికల వాళ్లు కోరు తుంటారు. సరిగ్గా అలాటివే చిక్కుదారులు. కొన్ని యినపతీగల తోనూ, కటకటాలతోనూ కట్టి ఆదారుల్లో పరీక్షించబోయే జంతువును వదిలిపెట్టి, అది ఎంత త్వరగా దానంతట అది చిక్కుదారులన్నీ తప్పించుకు బయట పడగలదో కనిపెట్టుతుంటారు మానసిక శాస్త్రవేత్తలు.

తక్కువ చిక్కులువుండే దారులైతే బొద్దింకలు, కప్ప పిల్లలు, తాబేళ్లతోనహా డజన్లకొద్దీ జంతు

(68-వ పేజీ చూడండి)

గమనిక

24-9-52 ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలోని బొమ్మరిల్లు భాగంలో ప్రచురింపబడిన "గుమ్మడికాయలదొంగ" అనే కథ, రచయిత అయిన శ్రీ ఆర్. వి. ఎస్. శ్రీరామమూర్తిగారు (హొంగపేట) స్వతంత్రంగా రచించింది కాదనీ, 1948 డిశెంబరు 'ఆశాజ్యోతి' పత్రికలో శ్రీ వై. రామారావుగారు "వింత అనుభవం" అన్న శీర్షికతో వ్రాసిన కథనే, యీయన కాపీకొట్టి పంపారనీ మా కార్యాలయానికి తెలియవచ్చింది. రచయితలుగా పైకి రద్దామనుకునేవారు యీవిధమైన చౌర్యాలకు యికపై ఒడిగట్టవద్దని హెచ్చరిక.



"కోడలొచ్చిన వేళావిశేషం-కొడుకు పరీక్షప్యాసయ్యా"డన్న మావగారి మాటవిన్న సుశీలకి కులుకు ఆగటంలేదు. రాజా ప్రొడక్షన్సువారి 'పుట్టిల్లు'లో జమున.


సినిమాలో ఇతరకళల స్థానం

సినిమాకళ ఒక ప్రత్యేక కళ అయినప్పటికీ ఇతర లలిత కళలను కూడా అది ఉపయోగించుకొంటుందని అందరూ ఎరిగిన విషయమే. పాటల రూపంలో కావ్యం, సంగీతం, సెట్టింగుల రూపంలో శిల్పం, భవన నిర్మాణం, నృత్యాల రూపంలో నృత్యకళ సినిమాలు ఉపయోగించుకుంటాయి. సినిమా కూడా ఒక రకమైన నాటకమే కనుక సంభాషణల్లోను, స్క్రీన్‌ప్లేలోను, అభినయంలోనూ నాటక కళను కూడా ఉపయోగించుకుంటుంది. ఇవన్నీ శతాబ్దాలనుంచీ అమలులో ఉన్న కళలే. ఒక్క సినిమాకళ మాత్రం సినిమటోగ్రఫీ అనే టెక్నికల్ సాధనం కనిపెట్టబడిన తరవాతనే ఉద్భవించింది. సినిమటోగ్రఫీ లేనిదే సినిమాయే లేదు. మరింత శక్తిని, అందాన్ని, ఆకర్షణను చేకూర్చుకునేందుకు మాత్రమే సినిమాలు మిగతా కళలను ఉపయోగించుకుంటాయి. అంతేగాని వాటికి సినిమాలలో స్వతంత్రస్థానం లేదు. కవి కావ్యం రాసేటప్పుడు తన నియమాలు తానే ఏర్పచుకొంటాడు. కావ్యకళ అనేది కవికి మాత్రమే చెందిన కళ. ఆ కళమీద మరొక కళాకారుడికి ఎలాంటి అధికారమూ లేదు. అలాగే సినిమటోగ్రఫీ అనే టెక్నికల్ సాధనంవల్ల ఉద్భవించిన సినిమా కళ దర్శకుడికీ, సినిమటోగ్రాఫరుకుమాత్రమే చెందిన కళ. ఈ కొత్త కళలో వారిద్దరూ అనుభవించగలిగినంత స్వేచ్ఛ మిగతా వారెవరూ అనుభవించలేరు. సినిమాకళ యొక్క తత్వమే అంత. మాకు సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వాలని దర్శకుడితో మిగతావారు దెబ్బలాడి లాభం లేదు. సరియైన కవిత్వం రాయాలనుకున్నవాడు వేరే కాగితాలమీద రాసుకుని అచ్చు వేయించుకోవలసిందేగాని సినిమాద్వారా కావ్యసృష్టి చెయ్యాలనుకుని లాభం లేదు. అలాగే మిగత కళలు కూడాను. ఇవన్నీ సినిమా కళకు ఉపాంగాలుగా మాత్రమే తోడ్పడతాయి.

సాధారణంగా సినిమా కవులను కవుల కింద లెక్క కట్టక పోవటం మనం చూస్తున్నాం. సినిమా పాటల పుస్తకం తీసుకుని చదవటం మొదలు పెడితే అవన్నీ పాటలని చాలాసేపటిదాకా అనుమానం కలగదు. "వచనం కాని వచనం"లాగ కని



జెమినివారి "చిన్నమ్మకథ"లో కృష్ణకుమారి.



రోహిణీవారి "తెగనీ" చిత్రంలో బాలనటుడు మధు.

సినిమాలో ఇతరకళల స్థానం

చిస్తాయి. వాటిలో కొన్నిటిని గానసహితంగా విన్నప్పుడు "ఫరవాలేదు, కొంచెం కవితాధోరణిలోనే ఉన్నాయి," అనిపిస్తుంది. కాని కొన్నిపాటలు ఎంత మంచి సంగీతంతో కూడినవైనా కావ్యత్వాన్ని అనుమానప్రాయంగానైనా ధ్వనించవు. అలాగే సినిమా సంగీతం కూడాను. స్వచ్ఛ సంగీత అభిమానులు సినిమా సంగీతాన్ని, స్వచ్ఛ నృత్యశాస్త్రజ్ఞులు సినిమా నృత్యాలను ఈసడించటానికి కారణం ఇదే. మామూలు సంగీతంకంటె, మామూలు నృత్యం కంటె సినిమా సంగీతం, సినిమా నృత్యం తక్కువ స్థాయిలో ఉంటాయి. అలా ఉండటానికి ముఖ్య కారణం సినిమా కళతత్వంలోనే ఉంది గాని ఆయా కవుల, సంగీతకారుల లోపం కాదు.

ఈరోజుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీరంగం శ్రీనివాసరావు మొదలైన ప్రసిద్ధ కవులు సినిమా రంగంలో ప్రవేశించి సినిమా కవిత్వం రాస్తున్నారు. అయితే వీరి స్వతంత్ర కవిత్వం చదివి ఆస్థాయి కవిత్వాన్నే వారి సినిమాలనుంచి కూడా ఆశించటం తెలివితక్కువ. సినిమా పాటలు సంగీతాశ్రయాలు. సంగీతానికి అనువుగా ఉండేట్లు పాటలు రాయాలిసిందే గాని స్వతంత్రంగా రాయటానికి వీలులేదు. సినిమా కవిస్వేచ్ఛను అరికట్టేది ఇదొక్కటే కాదు. సినిమా అనేది విద్యావంతులను, విద్యాహీనులనుకూడా ఆకర్షించే కళ. అందుచేత సినిమాపాటలు ఎంత తేలిక భావాలలో, ఎంత తేలిక భాషలో ఉంటే అంత సర్వజన గ్రాహ్యంగా ఉంటాయి. ఒకవేళ నూటికి నూరుపాళ్లు విద్యావంతుల కోసమే సినిమా తీసినప్పటికీ సినిమాపాటలు తేలికగానే ఉండటం అవసరం. ఎందుకంటే పుస్తకంలో కవిత్వం చదువుకునేటప్పుడు మొదటిసారి భావం గ్రహించలేక పోతే ఎన్నిసార్లయినా చదవటానికి, అర్థం చేసుకోటానికి అవకాశం ఉంటుంది. సినిమా చూసేటప్పుడు అలా కాదు. పాటగాని, మాటలుగాని వింటుండగానే భావం బోధపడాలి. ఒకమూల సినిమా చూస్తూ ఆలోచించుకునేందుకు వ్యవధి ఉండదు. అందుచేతనే పాటలు సాధ్యమైనంత తేలిక భాషలో, తేలిక భావాల్లో ఉండాలని నిర్మాత కోరుతాడు. తేలిక కవిత్వం ఎవరు పడితే వాళ్ళే రాయగలరనే అభిప్రాయంతో నిర్మాత ఎవరిని పడితే వారిని కవిగా స్వీకరిస్తాడు. సినిమా కవిత్వం అనగానే చాలా ప్రతిబంధకాలుంటాయి గనక కవితాపరులైనవారు మరేదో ఆకర్షణకు లోబడి సినిమారంగంలోకి వస్తారు తప్ప గొప్పకవిత్వం రాయాలనే ఉద్దేశ్యంతో ఎప్పుడూ రారు.

ఇదే కారణంవల్ల సినిమా సంగీతంకూడా ఒక ప్రత్యేకమైన పరిణతి పొందింది. శాస్త్రీయసంగీతం వింటున్నకొద్దీ అందాలు వ్యక్తంచేస్తుంది. సినిమా సంగీతానికి ఉండే వ్యవధి చాలా కొద్ది. సావకాశంగా పాడటానికి, రాగాన్ని నెమ్మదినెమ్మదిగా వివిధగతుల్లో విస్తరించటానికి వీలులేదు. అందుచేత సినిమా సంగీతం ఆ పాట మధురంగా ఉండాలి; అంటే మాధుర్యమే దాని ప్రధానలక్ష్యం. అందుకే సినిమా రంగంలోకి సంగీత శాస్త్రజ్ఞులకంటే తియ్యగా పాడగలిగినవాళ్ళు, తియ్యటి

రాగాలు కట్టగలవాళ్లు ఎక్కువగా ప్రవేశిస్తారు.

ఇదేవిధంగా అభినయ కళకు కూడా సినిమాలో స్వతంత్రస్థానం లేదు. అభినయం సంపూర్ణంగా నాటకరంగానికి చెందినకళ. ఏ నటుడైనా తన నటనా సామర్థ్యాన్ని ఇష్టం వచ్చిన పరిమితులకు విస్తరించుకోగోరినప్పుడు నాటకరంగాన్ని వరిస్తాడు గాని స్టూడియోలోని సెట్టును వరించడు. స్టూడియో సెట్టుమీద కెమేరా ఎదుట ఎంత గొప్ప నటుడు నటిస్తున్నప్పటికీ దర్శకుడు ఆ నటనలో తనకు కావలసిన భాగాలను, కావలసిన విధంగా సెల్యులాయిడ్ మీదికి ఎక్కించుకుంటాడే గాని యావత్తు నటననూ ఫొటోగ్రాఫ్ చెయ్యనూ చెయ్యడు; నటునికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వనూ ఇవ్వడు. దీనికి దర్శకుణ్ణి నిందించి లాభం లేదు. సినిమాయొక్క తత్వమే అంత.

పైన వివరించబడిన దాన్నిబట్టి సినిమాలో ఇతరకళలకు సంపూర్ణస్వాతంత్ర్యం లేదనీ, అవి సినిమటోగ్రఫీ అవసరాలకు ఒదిగి ఉండాల్సిందేననీ స్పష్టమవుతుంది. అంతమాత్రాన మిగతా కళల ప్రతిభ ప్రదర్శించటానికి అవకాశం లేదని అర్థంకాదు. సినిమాలలో అద్భుతమైన నటన చూశాం. అద్భుతమైన సంగీతం విన్నాం. అంతేకాక సంగీతము, నృత్యమూ మొదలైన కళలు సినిమాల్లో యథోచిత ప్రాధాన్యంకంటె ఎక్కువ ప్రాధాన్యం పొంది సినిమాకళను ధ్వంసం చెయ్యటంకూడా చూస్తున్నాం. సినిమాల్లో ఇతర కళలకు ఏ స్థానం ఉండాలీ అనేది వివరించటమే ఈ వ్యాసోద్దేశం. ఏ కారణంవల్లనో గాని మన తెలుగు సినిమాలకు సంబంధించినంతవరకూ చక్కని సినిమా కవిత్వం మటుకు రాలేదు. ఈ లోపం కవులదో, ఇతరులదో గాని చాలా చిరాకు కలిగించేదిగా ఉంది. సినిమాలలో ఇంతకంటె మంచి కవిత్వం సాధ్యం కాదనలేము. ముందు ముందు ఎవరైనా కవి సినిమా కవిత్వపు ప్రస్తుత పరిమితులను పెంచగలవాడు రావచ్చును; వచ్చి దానికి కూడా కావ్యగౌరవం ఆపాదింపగలగవచ్చును.

* * *



"మోడరన్ స్క్రీన్" అనే ఇంగ్లీషుపత్రిక చేతపట్టుకుని ఏదో ఆలోచనలో పడిన నటుడు నాగేశ్వరరావు.

సినిమా పరిశ్రమ మనదేశంలోని ప్రధాన పరిశ్రమల్లో ఒకటి. సుమారు 30 కోట్ల రూ.ల పెట్టుబడి ధనంతో ఈ పరిశ్రమ ఏటేటా అభివృద్ధి అవుతూనే వుంది. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అపార ధనం పన్నులమూలంగా లభిస్తోంది. ఇంత ముఖ్యమైనపరిశ్రమమీద జాతీయప్రభుత్వం ఏమి శ్రద్ధ తీసుకుంటోందీ అని చూస్తే ఏమీ కనబడదు. టెక్నలాజికల్ కళాశాలలు దేశమంతటా స్థాపించి ఉక్కు, ఇనుము పరిశ్రమలకు, గ్లాసు, సిమెంటు, రసాయన పరికరాల పరిశ్రమలకు ఇంకా ఎన్నో వాటికి నిపుణులను తరిఫీదు చేస్తూ, విదేశాల్లో తరిఫీదుకు కూడా పంపిస్తూ, ఎంతో సహాయం చేస్తున్న మన ప్రభుత్వం సినిమటోగ్రఫీకి ఎటువంటి సహాయం చేయుటంలేదు. సినిమటోగ్రఫీని బోధించే పాఠశాలలు దేశంలో ఒకటి రెండుకంటె ఎక్కువ ఉన్నట్టు లేదు.

మద్రాసు, త్యాగరాయనగర్‌లో కొన్ని నెలలనుండి "మద్రాసు ఫిలిం ఇన్స్టిట్యూట్" అనేది ఒకటి నడుస్తున్నది. సినిమటోగ్రఫీలో అనుభవం సంపాదించిన శ్రీ అజిత్ కుమార్ ఈ పాఠశాలను స్థాపించారు. ఇప్పుడు కొంతమంది విద్యార్థులు వీరికింద తరిఫీదు పొందుతున్నారు. ఈ పాఠశాలలో స్టిల్ ఫొటోగ్రఫీ, సినిమటోగ్రఫీ, స్క్రీన్ రైటింగ్ అనే మూడు సబ్జక్టులను నేర్పుతున్నారు. ఒక్కొక్కటి ఆరేసి నెలల కోర్సు. పోస్టు ద్వారా నేర్చుకోగోరితే 9 నెలల కోర్సు.

అప్పుడప్పుడు సినిమాపరిశ్రమలోని అనుభవజ్ఞులనుకూడా ఆహ్వానించి ఈపాఠశాలలో ఉపన్యాసాలిప్పిస్తూ ఉంటారు. ఈ నెల 6 వ తేదీన రాజా ప్రొడక్షన్స్ అధినేత డా॥ రాజారావుగారు "నటన"మీద ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం శ్రీ అజిత్ కుమార్ తమ విద్యార్థులు ఈమధ్య తయారు చేసిన రెండు చిన్న ఫిలిములను ప్రదర్శించి చూపారు. 16 మిల్లిమీటర్ల కోడక్రోమ్ రంగు ఫిలింమీద ఈ పాఠశాల విద్యార్థులు కొన్ని చక్కని పువ్వుల దృశ్యాలను, ఆడుకుంటున్న పిల్లల దృశ్యాలను షూట్ చేశారు. ★

ప్రశ్నలు..సమాధానాలు

టి. పద్మనాభదాసు—వెంకటగిరి.

ఒక చిత్రంయొక్క కథను ముందుగా తెలుసుకొని ఆ చిత్రం చూస్తే కథలో బింపో కనుపించదంటాను. మీరే మంటారు?

—మీరన్నది నిజమైతే ప్రసిద్ధ నవలలు చారిత్రక ఇతివృత్తాలు సినిమా తీయటానికి పనికిరావన్న మాట. కాని అటువంటివి తీస్తూనూ ఉన్నారు, వాటికి విజయం కలుగుతూనూ వుంది.

* * *

శ్రీ పోలాని లీలాధరరావు—చీరాల.

ప్రస్తుతం తక్కువ చదువుతో ఎక్కువ ఆదాయముగల ఉద్యోగం ఏది?

—సినిమా తారగా తయారుకావడం.

ఆకాశమున రత్నాలపక్షి రాత్రివేళ మిణుకు మిణుకుమని ప్రకాశిస్తుందని అందరూ అంటారు. అది నిజమేనా! మీ రెప్పుడైనా చూచితిరా తెల్పండి.

—రత్నాలపక్షి అనేది విని ఎరింగిన పక్షియేగాని కని ఎరింగిన పక్షి కాదు. పక్షిగాని పురుగుగాని చేపగాని చీకట్లో ప్రకాశించినయెడల, దాని శరీర పైభాగమందు "భాస్వరము" అనే స్వయం ప్రకాశమానపదార్థం ఉంటుంది. అదే ఆ మిణుకు మిణుకుమనే కాంతికి కారణభూత మవుతుంది.

* * *

దూర్వాసుల సుబ్బరాయశాస్త్రి—జేగురుపాడు.

చిత్రం బాగుండాలంటే కథ ముఖ్యమా? పాటలు ముఖ్యమా? లేక తారలు ముఖ్యమా?

—కథ, పాటలు, కెమేరా పనితనం, రికార్డింగ్ పనితనం, మంచి దర్శకత్వం, ఎడిటింగ్, నటనాకౌశలం మొదలైనవన్నీ ముఖ్యమే గాని తారలనబడే జాతివాళ్లు మాత్రం (చిత్రం బాగుండటానికి) ముఖ్యులు కాదు.

* * *

శ్రీ వై. యల్. నారాయణ—విజయవాడ.

మనవారు ప్రతివిషయంలోనూ "థాంక్సు" అనిగాని, "థాంక్యూ" అని గాని కృతజ్ఞతను తెలియజేస్తారు. అంత సులభంగా ఉండే తెలుగుమాటను తెలియజేస్తారా?

—మనం ఒకరివల్ల సహాయం పొందినా, మనం ఇంకొకరికి సహాయం చేసినా, "కృష్ణార్పణం" అని చెప్పవలెను. ఏవస్తువు మనం యిచ్చినప్పటికీ, తీసికొనినప్పటికీ, ఏపని చేసినప్పటికి సర్వం భగవంతుని సేవగానే భావించి "కృష్ణార్పణం" అనాలి. "థాంక్యూ" కంటె ఇది శ్రేష్ఠమైన మాట.

* * *

డి. ఎస్. హనుమంతరావు—మద్రాసు.

ప్రతి చలనచిత్రంలోను స్వప్నదృశ్యం ప్రవేశపెట్టటం పరిపాటైంది. దీని వుద్దేశ్యమేమిటండీ?

—అదొక రకమైన వేలంవెర్రి. చాలా చిత్రాల్లో స్వప్నదృశ్యాలకు అర్థం పర్థం ఉండదు.

* * *

శ్రీ ఓ. యస్. ఆర్. ఆంజనేయులు—గుంటూరు.

అరవలు అడ్డపంచ కట్టుటకు కారణమేమి?

—వారి వస్త్రధారణాపద్ధతి అతి పురాతన కాలమునాటి ఆదిమనివాసుల పద్ధతిగా కన్పిస్తోంది. బర్మావాళ్ళ పద్ధతికూడా యిదే విధంగా ఉంది. గుర్రములెక్కి స్వారిచేసే జాతులవారికి యీ వస్త్రధారణ అనుకూలించదు. గోచీపెట్టి బట్ట కట్టడంగాని, మార్వాడీలవలె బట్ట కట్టడంగాని అశ్వికుల కనుకూలమైన వస్త్రపద్ధతి.

* * *

వి. ఎస్. నారాయణ—బందరు.


8ర మిల్లిమీటర్ల కెమేరాతో తీసిన ఫిల్ము కంటె 16 మిల్లిమీటర్ల కెమేరాతో తీసిన ఫిల్ములో అదనంగా ఉండే విశిష్టత యేమిటి?

16 మిల్లిమీటర్ల ఫిలిము చవకగా, తేలికగా తయారవుతుంది. కాని దీన్ని థియేటర్లలో ప్రదర్శనకు ఉపయోగించరు. స్కూళ్ళలోగాని, ఇళ్ళలోగాని చిన్న సైజు తెరలమీద ఆ ఫిలిమును ప్రదర్శించుకోవచ్చు. 85 మిల్లిమీటర్ల ఫిలిము మాత్రమే థియేటర్లలో ప్రదర్శనకు యోగ్యమైనది.

* * *

శ్రీ కీల్కానా వెంకట్రావు—విశాఖపట్నం.

సంపూర్ణ మానవస్వాతంత్ర్యంగల భారతదేశంలో పురుషునితో సరిసమానంగా అన్ని హక్కులూ, అన్నింట్లో తమకి కూడా వర్తింపజేయవలెనని అలజడిచేస్తున్న యీ కాలంలో స్త్రీలముందు ఒక కొంటె పద్యార్థి—"విద్య నిగూఢగుప్తమగు విత్తము రూపము పూరుషాళికిన్" అని బిగ్గరగా పదిసార్లు చదివితే వారి మనోభావాలు భర్త్రృహరిని దూషిస్తాయా లేక భూషిస్తాయా?



—కాళిదాసు రచించిన రఘువంశం మొదటి శ్లోకంలో "జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ" అన్నారు. జగత్తుకు తండ్రులైన పార్వతీ పరమేశ్వరులకు నమస్కరిస్తున్నాను అని వ్రాసినాడు. "తండ్రులైన" అంటే "తలిదండ్రులైన" అని అర్థం. అదేవిధంగా పూరుషాః స్త్రీన్ అంటే "స్త్రీలకు పురుషులకు" అని అర్థం. కనుక భర్తృహరిని ఎవ్వరూ దూషించరు.

* * *

శ్రీ పి. సత్యనారాయణ—ఏలూరు.

మన రాష్ట్రంలో మొట్టమొదటగా వెలువడిన దినపత్రిక ఏది!

—ఇంగ్లీషు దినపత్రిక 1836 సం॥లో ప్రకటింపబడిన "స్పెక్టేటరు" పత్రిక. అది "మద్రాసు టైమ్స్" పత్రికగా తర్వాత మారింది. అటుపిమ్మట అది నేటి "మద్రాసు మెయిలు" పత్రిక అయింది. తెనుగుదినపత్రికలలో మొట్టమొదటిది "ఆంధ్రపత్రిక."

నేటి సినిమా నటీనటులపై గల మోజుకు పత్రికా రచయితలే కారణం అన్న మాట ఎంతవరకు నిజం?

—అది కొంతవరకే నిజం—ముఖ్య కారణం ప్రజలే.

* * *

వి. వి. నరసింహం—మద్రాసు.

శ్రీశ్రీ, దేవులపల్లి మొదలైన మేటి కవులంతా అసలు కవిత్వాన్ని వదిలేసి, సినిమా వాళ్ళమీద ఆధారపడి, సినిమా సాహిత్యానికి తోడ్పడడానికి కారణా లేవండీ?

—ధనార్జనదృష్ట్యానూ, కళాదృష్ట్యానూ కూడా సినిమాకళ మిగతా కళలకంటె ఎక్కువ ఆకర్షణ కలది. ఈ ఆకర్షణకు మన దేశంలోనే కాదు అన్ని దేశాల్లోనూ కవులు, నవలా రచయితలు, ఇతర కళాకారులు కూడా లోబడ్డారు. రష్యాలో ప్రఖ్యాత సంగీతకారుడు ప్రొకోఫియఫ్, అమెరికా, బ్రిటన్లలో గ్రాహం గ్రీన్, జాన్ స్టీన్‌బెక్, ఆల్డస్ హక్స్లీ మొదలైన వారందరో సినిమాల్లోకి దిగారు. అలా దిగటం తప్పేమీ కాదు.

* * *

శ్రీ పి. రాజు—కపిలేశ్వరపురం, తూ. గోదావరి.

మన పూర్వపు హిందూరాజులు ప్రజల క్షేమ సమాచారములు తెలుసుకొనుటకు గూఢచారి వేషములో రాజ్యం అంతా తిరిగెడివారు. కాని మన ప్రధాని నెహ్రూగారు క్షామప్రాంతాలు పర్యటించుటకు ముందు ప్రోగ్రాములు యిచ్చి స్పెషలు విమానంలో బయలుదేరుతున్నారు. అప్పటి రాజులకంటె వీరు ప్రజల పరిస్థితి బాగుగా చక్కదిద్దగలరా?

—గూఢచారి వేషములో పూర్వపు రాజులు సంచారము చేసినట్లుగా నేటి ప్రధానమంత్రియైన నెహ్రూగారు గూఢచారి వేషంలో పర్యటన చేయవలసిన అగత్యము లేదు. ఏమైనా కష్టనిష్ఠురములు ఉంటే ప్రజలు గాని ప్రజాప్రతినిధులు గాని సరాసరి నెహ్రూగారికి నివేదించవచ్చు. ఢిల్లీలో ప్రజాప్రతినిధిసభలో కూడా వెల్లడి చేయవచ్చు. ఇది ప్రజాస్వాతంత్ర్యయుగం. నిజపరిస్థితులను ప్రజలే ప్రభుత్వానికి నివేదించుకొనుటకు అవకాశాలు పూర్తిగా ఉన్నాయి. కనుక నెహ్రూగారు గూఢచారివేషంలో పర్యటించవలసిన అగత్యం లేదు.

* * *

జి. వెంకటేశ్వరరావు—కాకినాడ.

మన తెలుగు నటీనటులవలె, హిందీవారెవరైనా చిత్రాలను ప్రొడ్యూస్ చేసి డైరెక్టు చేసేరా? అవి ఎంతవరకు రాణించాయి? అవి యేవి?

—ప్రఖ్యాత నిర్మాత, దర్శకుడు, నటుడు శాంతారాం ఉన్నాడు కదా. ఆడవారల్లో బహుశా ఎవరూ లేరేమో.

* * *

శ్రీ ఎం. ఆశారావు—నందికొట్కూరు.

ఆంధ్రదేశంలో చిత్రకళ నేర్పు విద్యాలయాలు ఎన్ని వున్నాయి? వాటి అడ్రసులు తెలుపుతారాండి?

—ఆంధ్రదేశంలో చిత్రకారులు ఎందరు వున్నారో చిత్రకళాశాలలూ అన్ని వున్నాయి. ఎవరికి వారు ఒకడో, అరో శిష్యుణ్ణి దగ్గరకు తీసుకొని వాళ్లకు చిత్రకళ నేర్పుతామంటున్నారు. అంతే కానీ కళాశాలకు కావలసిన అన్ని హంగులతో నడిచే సంస్థ ఆంధ్రదేశంలో ఒకటి కూడా లేదని చెప్పటానికి విచారించవలసివస్తోంది. కాకపోతే రాజమండ్రిలో రామారావు ఆర్ట్ సొసైటీవారు, విజయనగరంలో పైడిరాజు గారు పదిమంది బాలబాలికలకు చిత్రకళాభ్యాసం చేస్తున్నారు.

* * *

ఎస్. పి. రాఘవయ్య—మద్రాసు.

మహాశయా! వాహినీవారు తమ "పెద్ద మనుష్యులు" చిత్రాన్ని వాహినీ స్టూడియోలో తీయకుండ, ఇతర స్టూడియోలలో తీయుటకు కారణమును తెలిపెదరా?

—వాహినీలో కూడా కొంత భాగం తీస్తారట. చిత్రం త్వరగా పూర్తయేందుకని రెండుమూడు స్టూడియోల్లో తీయదలచినట్లు తెలుస్తున్నది.

* * *

శ్రీ సి హెచ్. వి. రాజు—సూరవేరాజుపేట.

మిత్రభేదం బొమ్మల సీరియల్ నెం. 24 లో 10-9-52 సంచికలో తీతువు దంపతులు సముద్రటొడ్డున గల ఒక చెట్టుమీద గ్రుడ్లు పెట్టుకొని పిల్లలను కనునట్లు కవిగారు నిరూపించినారు. అది శుద్ధ పొరపాటు. తీతువు పక్షులు ఎప్పుడూ చెట్లపై నివసించుట జరుగదు. అవి సముద్రపు పక్షులపై గ్రుడ్లుపెట్టి పిల్లలను చేయును. ఆ విధముగా కవిగారు వ్రాయుటలో వారి అభిప్రాయము తెలియజేస్తారా?

—'పంచతంత్రం' వ్రాసిన కవి ఎవరో తెలియదు. అథవా తెలిసినా ఆయనగారి వుద్దేశం ఏమిటో కనుక్కోవటం అసాధ్యం. తీతువు పక్షులు సముద్రపుటొడ్డున కాక చెట్టుపై గ్రుడ్లు పెట్టటం ఎలా అసహజమని మీకు తోచిందో, అలాగే మిత్రభేదం బొమ్మలు చూస్తూవుండగా జంతువులు, పక్షులు మాట్లాడుకోవటం కూడా అసహజమనే తోచవలసింది కాదా!

* * *

పి. రంగస్వామి—గుడివాడ.

'చంద్రలేఖ' సినిమాను చూచి ఒక ఉత్తరదేశ నిర్మాత "హైక్లాస్ స్టంటు" అన్నాడుకదా! మరి అయితే 'ఆన్' ఇంటర్నేషనల్ స్టంటు కాదా? లేక సినిమా నిఘంటువులో ఏదైనా కొత్త పేరుందా?

—మొదటిసారిగా భారీఎత్తున టెక్నికలర్ చిత్రాన్ని తీసిన భారతీయ నిర్మాత అనే పేరు మహబూబ్‌కు నిలిచిపోతుంది. "ఆన్"ను గూర్చి మా అభిప్రాయం కావాలంటే 13-8-52 సంచికలో సమీక్ష చూడండి.

గమనిక

17-9-52 సంచికలో మిత్రభేదం బొమ్మల సీరియల్‌లో (ఆఖరు పేజీ) "దాని అంచునే కూర్చొని ఝషమూ, బెకబెకమంటూ అరిచింది," అని ఉన్నది. బొంబాయినుండి శ్రీ పాకాల నరసింహంగారు ఒక ఉత్తరంలో "ఝషము అనగా చేపకి వర్తించును కాని కప్పకు వర్తించదు" అని వ్రాశారు. ఈ పొరపాటును తెలియజేసినందుకు వారికి మా కృతజ్ఞత.



రోహిణీవారి "లెగసీ"లో సూర్యకాంతం.

సినిమా వార్తలు

గత నాలగవ తేదీన స్టార్ కంబైన్స్ స్టూడియోలో ప్రారంభించబడిన రాణి ఫిలిమ్స్ వారి "సమ్మక" తెలుగు, తమిళ చిత్రానికి దర్శకుడు మిస్టర్ సిన్హా. కెమేరామన్ ప్రభాకర్. సంగీత దర్శకుడు జ్ఞానమణి. తెలుగు చిత్రానికి పాటలు, మాటలు మహేశ్వర్. తమిళ చిత్రంలో పాలాచి కమల, సుధాకర్ మొదలైనవారు నటిస్తారని తెలుస్తోంది. తెలుగు చిత్రంలో ఎవరు నటిస్తారో ఇంకా నిర్ణయం కాలేదు. ఏదో బెంగాలీ నవలకు అనుసరణగా కథ వ్రాయబడిందట. పూర్తిగా హాస్యభరితమై ఉంటుందట.

ఈ చిత్రానికి ప్రారంభోత్సవం మంత్రి మాణిక్య వేల్ నాయకర్ గారు చేశారు. ఆనాటి సభకు అధ్యక్షత వహించిన శ్రీ ఎ. రామయ్యగారు తమ ఉపన్యాసంలో ముఖ్యమంత్రి రాజాజీ ఈమధ్య సినిమాలపై చేస్తున్న విమర్శను విమర్శించారు. ఈ విషయంలో రాజాజీ అభిప్రాయాన్ని విశదీకరిస్తూ మాణిక్య వేల్ నాయకర్ గారు "రాజాజీకి సినిమాలంటే ద్వేషమని ఎవరూ భావించరాదు. సినిమాలలో చెడ్డవీ మంచివీ కూడా ఉన్నాయని రాజాజీకి తెలుసు. చెడ్డవాటిని మాత్రమే ఆయన గర్హిస్తున్నారనీ, మంచివాటిని గర్హించరనీ అనుకుంటాను," అన్నారు.

* * *

జంపన ఎండ్ నంది ప్రొడక్షన్సువారు తెలుగు, తమిళ భాషల్లో తీస్తున్న "మేనరికం" చాలకాలంగా నిలిచిపోయింది. ఈ చిత్రం నాలుగింట మూడువంతులు పూర్తయిందని ప్రొడక్షన్ కార్యాలయంవారు తెలుపుతున్నారు. కొద్దిరోజుల్లో శ్యామలా స్టూడియోలో "మేనరికం" పాటలన్నిటినీ రికార్డు చెయ్యటం పూర్తి చేస్తారట. దారిద్ర్యబాధకు లోనై అగచాట్లు పడే ఒక ఎన్. జి. ఓ. ను, అతని కుటుంబాన్ని చూపించే ఈ చిత్రంలో జి. వరలక్ష్మి, సిహెచ్. నారాయణరావు, సావిత్రి, రామశర్మ, హేమలత, రేలంగి, సీత, శివరావు, కె. పద్మావతీదేవి, చంద్రశేఖర్, మిక్కిలినేని, పేకేటి మున్నగువారు నటిస్తున్నారు. దర్శకుడు జంపన; సంగీత దర్శకుడు పెండ్యాల.

* * *

భరణీవారి భరణీ స్టూడియో దసరా రోజున తెరువబడినది. పరికరాలు మొదలైనవి అమర్చటం పూర్తయి పనికి సిద్ధమయేసరికి మరికొన్ని నెలలు పడుతుందని తెలుస్తోంది.

* * *

వినోదావారి "దేవదాసు" షూటింగ్ శీఘ్రగతిని జరుగుతోంది. మొత్తం 16 రీళ్ళలో 12 రీళ్లు పూర్తయినవట. మొత్తం 14 పాటలుంటాయట. వీటిలో రెండింటికి తప్ప మిగతా వాటికి కీ॥ శే॥ సి. ఆర్. సుబ్బరామన్ గారు సంగీతం సమకూర్చారు. మిగిలిన రెండు పాటలూ నృత్యగీతాలు. ఆ చిత్రానికి దర్శకులూ, నృత్యదర్శకులూ అయిన వేదాంతం రాఘవయ్యగారే ఆ నృత్యగీతాలకు సంగీతం సమకూర్చుకొంటారని తెలిసింది. శరత్ బాబు ప్రసిద్ధ నవలల్లో ఒకటై, న్యూథియేటర్సువారిచే తెరకెక్కించబడిన ఈ విషాదాంత కథను యథాతథంగా వినోదావారు చిత్రీకరిస్తున్నారు. జనవరి 14 అంటే సంక్రాంతిపర్వం నాటికి ఈ చిత్రాన్ని విడుదలచేయాలని సంకల్పించినట్లు శ్రీ డి. ఎల్. గారు చెబుతున్నారు.

"అమర్ భూపాలి"

శాంతారాం గత సంవత్సరం నిర్మించిన "అమర్ భూపాలి" మరాఠీ చిత్రం ఈనెల 3వ తేదీనుండి మద్రాసు ప్రభాత్ టాకీస్ లో ప్రదర్శింపబడుతోంది. ఒక మహారాష్ట్ర కవి జీవితగాథ ఈ చిత్రానికి కథా

వస్తువు. చిత్రం పూర్తిగా సంగీతమయం. తుణతుణానికి ఆకుల కదలికతో, గాలి కెరటాలతో సంగీత ధ్వనులు వీచి సమ్మోహపరుస్తాయి. ఒక్క సంగీతంకోసం ఈ చిత్రాన్ని ఎన్నిసార్లైనా చూడవచ్చు. ముఖ్యంగా "ఘనశ్యామసుందర" అనే గీతం అద్భుతంగా వుంది. (ఈ ప్రాచీన గీతం ఈనాటికీ మహారాష్ట్రదేశంలో ప్రతి చోటా, ప్రతి నోటా వినిపిస్తూ ఉంటుందని చిత్రం ఆఖరున చూపించబడింది.) మిగతా పాటలన్నీ ఆ పాటఅంత బాగా లేకపోయినా చాలవరకు మహారాష్ట్ర బాణీని అనుసరించి ఒక వింత మాధుర్యాన్ని సేకరించుకున్నాయి. మన దేశంలోనూ, యూరప్‌లోనూ జరిగిన ప్రపంచ చలనచిత్రోత్సవాలలో ఒక స్థానం సంపాదించిన ఈ చిత్రం శాంతారాం దర్శకత్వపు ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నది.

"సిన్‌బాద్ ది సైలర్"

దీపక్ పిక్చర్సువారికి నానాభాయ్‌భట్ డైరెక్టు చేసిపెట్టిన ఈ చిత్రం మద్రాసు చిత్రా టాకీస్‌లో ఈ నెల 9 నుండీ ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రంలోని

పదాతి దళాల విన్యాసాలను తనిఖీ చేస్తున్న సేనాధిపతి ఒక సైనికుడి వద్ద ఆగి ప్రశ్నించాడు:

"మీరు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో శత్రువులు పైన పడతారనుకోండి. ఏం చేస్తావు?"

"తుపాకులు తీసుకుని పోరాడటానికి ప్రయత్నిస్తానండి."

"అలా పోట్లాడుతున్నప్పుడు మీ మీదికి యుద్ధనౌక వస్తే?"

"పిచ్చాసుపత్రికి పోయి పరీక్ష చేయించుకుంటానండి."



రాజరాజేశ్వరీవారి "పేదరైతు"లో తులసి.

"కొన్ని డాన్సులు, కొన్ని వేషధారణ పద్ధతులు హారూన్ అల్‌రషీద్ కాలం నాటివి కా"వని నిర్మాతలు ఆరంభంలోనే క్షమాపణ చెప్పుకున్నారు. డాన్సులు, వేషధారణమే కాక ఏదీ ఆ కాలానికి చెందినట్లు తోచదు. సిన్దబాద్ కథ ప్రఖ్యాతమైనది. సముద్రయానాల్లో అతడు చేసిన సాహసకృత్యాలు ఆ కథలో ప్రధానాంశం. అవి లేనిదే ఆ కథే లేదు. ఈ చిత్రంలో సిన్దబాద్ నావికుడుగా కాక ప్రేమికుడుగా కనిపిస్తాడు. ("సిన్‌బాద్ ది లవర్" అంటే సరిపోయేది.) తమిళ నటుడు రంజన్ సిన్దబాద్‌గాన్నూ, బొంబాయి తార నసీం అతని ప్రేయసిగానూ నటించారు. రంజన్ తమిళ ముఖంలో ఎక్కడా అరబ్బీ ఛాయ గోచరించదు. ఎరోల్ ఫ్లిన్ మోస్తరుగా పోజులు పెట్టడం, ఎగరటం, దూకటం తప్పిస్తే అతనికి వేరే నటన చేతనైనట్లు లేదు. కథ కొన్ని చోట్ల ప్రేక్షకులకు ఉత్కంఠను పెంచేదిగా ఉన్నప్పటికీ విరివిగా పాటలు, డాన్సులు పెట్టడంతో చివరివరకూ చూసే ఓపిక సన్నగిలిపోతుంది. ప్రస్తుతం హిందీ చిత్రాలు ఎన్ని ఎక్కువ పాటలు, డాన్సులు ఉంటే అంత ఎక్కువ డబ్బు దోచుకోవచ్చనే ఫార్ములా ప్రకారం తీయబడుతున్నాయి. ఈ చిత్రం ఆ ఫార్ములాకు భిన్నంగా లేదు. ★

'దీలామాస'

(39-వ పేజీ తరువాయి)

వాణ్ణి పలకరించాడు. "అదేం టపాకాయరా" అని.

"ఇదే నండీ. మీ కాయేల సెప్తానన్నానే. అదే యిది. దీని కోసమే తెచ్చాను అన్ని తాటిగిలకలు"

"దానిపేరు ఏమిటిరా?"

"పూలపొట్లాం."

"అంటే - అది పేలుతుం దేమిరా?"

"ఎబ్బే! లేదండీ. దాన్ని ఎలిగించి గిరగిరా గిరగిరా తిప్పతా వుంటే, పూలు జలజలా జలజలా రాలుతాయండి. సూత్తారుగా- ఇప్పుడు ఎలిగించానంటే యీ ఒక్క పొట్లం రేత్రి



పదిగంటల దాకా కాలుద్ది. అయ్యగారు తెచ్చిన చామాను చూడండి, ఎంత దిబ్బున అయిపో యిందో! ఇది అట్టాగ్గాదు." అంటూనే వెలిగించిన పూల పొట్లం గాలిలో గిరగిరా తిప్పకొంటూ

"దిబ్బీ దిబ్బీ దీలామాసా

మళ్లావచ్చే నాగుల్ చవితీ"

అంటూ పదం పాడుకొంటూ వీధిలోకి పరిగెత్తాడు. వాడు పోయిన పొడుగునా, వాడినెత్తి మీదుగా ఆపూల పొట్లం గిరగిరా తిరుగుతూ ఎక్కడి కక్కడ ఎర్రని రంగుతో సున్నాలు చుట్టుతోంది. ఆ సున్నాలలో నుంచి పువ్వుల లాంటి రవ్వలు రాలుతున్నాయి.

—వి. ఎన్.

డాన్ క్విక్ సెట్

(42-వ పేజీ తరువాయి)

నా ఆరోగ్యం విషయంలో జాగ్రత్త తీసుకొంటున్నట్లుగా నటించి, నన్ను ఏ వంటకమూ తిననీయకుండా ఆకలి మంటలకు ఆహుతి చెయ్యాలని చూస్తున్నాడు. కాబట్టి మిగిలిన విషయాలమాట ఎల్లావున్నా, యీ వైద్యుణ్ణి వెంటనే చీకటి కొట్టులో కుడవెయ్యాలి." అన్నారు.

అక్కడేవున్న ఆ వున్నతోద్యోగి మాటల ధోరణి అందుకొని "మీ యెదుటవున్న వాటిలో దేనినీ తమరు ముట్టుకోక పోవటమే మేలు. ఏమంటారా?—వీటి నన్నిటినీ మఠాధిపతులు వండి పంపించారే కానీ, యిక్కడ తయారుచేసినవి కావు." అన్నాడు.

"అలాగైతే యీ పళ్లేలన్నీ తక్షణమే యిక్కడ్నించి తీయించేసి, యింత రొట్టె, కాసిని ఎండుద్రాక్ష పళ్లు మాత్రం తెప్పించండి. నేనిక ఆకలికి ఆగలేని స్థితిలో వున్నాను. ఇక ఏ మాత్రం ఆలస్యమైనా, నా ప్రాణం కాస్తా యీ బొందిలోంచి ఎగిరిపోయేలా వుంది. ఎండిపోయిన ద్రాక్ష పళ్లల్లో విషం వుండటానికి వీలు లేదు కనుక, వాటినైన తక్షణమే తెప్పించండి." అంటూ ఆ వుద్యోగికి పుత్తరువువేసి, తన కార్యదర్శి వైపుకు తిరిగి "ఆ వుత్తరం అందిందనీ వారు చెప్పిన విధంగా అన్ని ఏర్పాట్లు చేసుకొంటామనీ, వారి ఆజ్ఞలు శిరసావహించి నడుచుకొంటామనీ డ్యూక్ గారికి సమాధానం వెంటనే వ్రాయిస్తారు కదూ!" అని అడిగారు శాంకో పాంజాగారు.

(ఇంకావుంది)

★ జంతుకోటిలో మానవలక్షణాలు ★

(43-వ పేజీ తరువాయి)

వులు యిట్టేదాటి బయటపడగలవు.

అమెరికాలో కొందరు శాస్త్రవేత్తలు కలిసి ఒక చిక్కుల పెట్టెను కట్టారు. అందులో ఆరు మలుపులు సృష్టించారు. ఈ మలుపుల్లోకి తిరగకుండా ముందుకు పోతేనే ఏజంతువైనా పరీక్ష ప్యాసు అవుతుందన్న మాట. పొరపాటున ఏ మలుపులోకి తిరిగినా బయటకు పోయేమార్గం లేక మళ్లీ అఘోరిస్తూ వెనక్కు తిరిగిరావలసిందే. ఇటువంటి చిక్కు-దారుల్లో ఒకటి తరువాత ఒకటిగా మొత్తం ఆరు రకాల జంతువులను వదిలిపెట్టారు. మిగిలిన అన్నిటికంటె తక్కువ సార్లు దారితప్పి బయట పడింది పిల్లి పిల్లలట. ఆ తరువాత తెల్ల ఎలుక. ఇక తరువాత వరుసగా చేప, గినియా కోడి, కోడిపిల్ల వచ్చాయట. అన్నిటిలోకి మొద్దబ్బాయి తాబేలు!

ఇలాటి సన్నకారు జంతువుల తెలివితేటలను పరీక్షించటానికైతే యీ చిక్కు-దారుల పద్ధతి బాగా వుంటుందేమో కాని తల్లిపాలు తాగేగుణం గల జంతువులకు యివి సరిపోవు. మనుష్యుల తెలివి తేటలను కనిపెట్టటానికి యీ మార్గాలు ఎంత మాత్రమూ చాలవు.

ఒకసారి ఒక పెద్ద విశ్వ విద్యాలయంలో కాలేజీ విద్యార్థులకు, తెల్ల ఎలుకపిల్లలకు పోటీ పెట్టారట. పోటీ అంటే మరేమీ లేదు. చిక్కు-దారుల పద్ధతే వుపయోగించారు. అయితే ఆదారులకు **రెండు వైపులా ఎత్తైన గోడలు** కట్టించారు. 27 ఎలుక పిల్లలను, 38 మంది కాలేజి విద్యార్థులను (అందులో 19మంది కాలేజిగరల్సు!) పోటీకి పెట్టారు. ఎలుకలనైతే మామూలుగానే ఆ చిక్కుదారుల్లో వదిలిపెట్టారు కాని, యీ కాలేజీ పిల్లల కళ్లకి మాత్రం గంతలు కట్టేశారు. అంటే—వీళ్లు దారి తెలుసుకోవాలంటే చేతులతో తడుముకొంటూ పోవాలన్నమాట. లేకపోతే యీ గడుసు పిల్లలు ముందుగానే ఎక్కడ గల్లీలు వున్నాయో అసలు ఆ చిక్కు-దారులు ఎలా ఎలా నిర్మించారో ఆతీరంతా ఒక్కసారి చూసి పసికట్టెయ్యగలరు. ఇంత తెలివి తేటలు ఎలుక పిల్లలకు వుండవుగా! వాటితో సమానంగా వీళ్లనూ పరీక్ష చెయ్యాలంటే కళ్లకు గంతలు కట్టటం తప్పని సరి. మరొక విశేషం. పరీక్షకు హాజరు కాబోయే ఎలుక పిల్లలకు అంతకు ముందు కొన్ని గంటలపాటు తిండి పెట్టకుండా కడుపు కాల్చారు. అలాటి స్థితిలో వుండగా వాటికి తిండి ఆశపెట్టి పరీక్ష చెయ్యటం తేలిక. మరి యీ కాలేజి పిల్లలు దేనికోసం యీ పోటీలో పాల్గొనాలి అంటే-ఎలుకల కంటె మనుష్యులు తెలివి కలవారని ఋజువు చేసి మానవుల మర్యాద కాపాడటానికే! కానీ - పరీక్ష ఫలితాలు అందరూ అనుకొన్నవీ, ఆశించిన వాటికి వ్యతిరేకంగా తయారైనాయట! ఆ ఎలుకలే కాలేజీ కుర్రల కంటె తక్కువ సార్లు చిక్కు-దారుల్లోపడి తప్పించుకు బయట పడ్డాయట. మళ్లీ మళ్ళీ యీజట్లను పరీక్షచేసి చూడగా, ఎలుకలు ఒక్కసారైనా తప్పు దారిలో పోకుండా సరాసరి సరియైన దారిలో నుంచి వరుసగా మూడు సారులు బయటపడటానికి వాటికి పట్టిన కాలంకంటె మూడింతలు ఎక్కువకాలం కాలేజీ కుర్రాళ్లకు కావలసి వచ్చిందట. ఈ పరీక్షా ఫలితాలవల్ల మానవుల మర్యాద మంటగలిసి నట్లైంది.

కానీ-మరొక విషయంలో యీ కాలేజీ కుర్రలు మానవుల మర్యాదను కాపాడారు. అదే చిక్కు-దారుల్లో అదే ఎలుకలనీ, ఆ కాలేజీ కుర్రలనే మరొక నెలరోజులు గడిచిపోయాక వదిలిపెట్టి పరీక్ష చేసి చూస్తే, యీ కుర్రలే చప్పున నెగ్గేశారు. మాసం రోజులు గడిచిపోయినా క్రిందటి పరీక్షనాటి అనుభవాలు వీళ్ల మనస్సుల్లో వుండిపోయాయి. అందుచేత వీళ్లు యీ సారి తేలిగ్గా తప్పుదారులు తప్పించుకు బయట పడ్డారు. పాపం!- ఆ ఎలుక పిల్లలకు నెలరోజుల క్రిందటి అనుభవాలు పూర్తిగా పాతబడిపోయి, పరీక్షలో మళ్లా మొదటి నుంచీ ప్రయత్నం చేయవలసి వచ్చింది.

ఇలాటి పరీక్షలవల్ల తేలిన సారాంశం ఏమిటంటే, తర్కించి తెలుసుకోవటానికి వీలు లేని కొన్ని విషయాలలో మానవుల కంటె జంతువులే మేలనిపిస్తాయి. ఆ అనుభవాలను కొంత కాలం గడిచాక స్ఫురణకు తెచ్చుకొని, వాటివల్ల ప్రయోజనం పొందటం మానవుల ఆధిక్యత.

(ఇంకా వుంది)

భామకలాపం

(29-వ పేజీ తరువాయి)

గాక ప్రక్కనున్న బర్మాప్రాంతంవరకు అనగా ఐరావతీ నదీప్రాంతంవరకు విస్తరించి ఉండవచ్చు. నరకాసురుని వధించిన అనంతరము:

"ధవళంబులై వేగవంతంబులై యైరావతకులసంభవంబులైన చతుర్దంత దంతావళంబులను ద్వారకానగరంబునకు బనిచి."

ఐరావతములు అనబడే తెల్లఏనుగులు దొరికేటటువంటి ఐరావతీనది సమీపప్రాంతం అది. నాలుగేసి దంతములుగల ఏనుగులు అవి. అయిదు వేల ఏండ్లక్రిందట యీ ప్రకారంగా శతఘ్నులతోను, విమానాలతోను యుద్ధతంత్రం నడిచినటువంటి సమరతంత్రకాలంలో శ్రీకృష్ణునితో సమానంగా విమానంమీదనే కూర్చుండి నిర్భయంగా సత్యభామకూడా యుద్ధం చేసింది.

అయితే ఒక్క సందేహం కలుగుతోంది. శ్రీకృష్ణుడు అనేక సందర్భాలలో యుద్ధములు చేశాడు. మహాభారతయుద్ధరంగంలో అర్జునునకు రథసారథిగా తయారైనాడు. సత్యభామ నిజంగా సమరసరదాకోసమే యుద్ధరంగాలకు శ్రీకృష్ణునితో కలిసి వెళ్ళుతూ ఉండేటటువంటి వీరాంగన అయినట్లయితే, భారత యుద్ధరంగానికికూడా ఎందుకు వెళ్ళలేదు? ఈ నరకాసురసంహారానికిమాత్రమే ఎందుకు నడుము కట్టుకొని వచ్చింది? ఈ నరకాసురుని సంహరించవలెననే సంకల్పంలో సత్యభామకు రోషావేశమును పుట్టించిన ప్రత్యేక సందర్భ పరిస్థితులు ఏవైనా ఉన్నాయా? ఇది కొంచెం తర్కించదగిన విషయమే. నరకాసురుడు చాలామంది స్త్రీలను చెరబెట్టి హింసించినట్లుగా చెప్పబడి ఉన్నది. అతని బందిఖానాలో ఉంచబడిన స్త్రీల నందరిని నరకాసురసంహారానంతరము శ్రీకృష్ణుడు చెరనుండి విడిపించాడు. నరకాసురుడు స్త్రీలోకకంటకుడు. అంతమంది అపహృత స్త్రీల యొక్క, నిర్బంధిత అస్వతంత్ర స్త్రీల యొక్క దుర్గతి విషయమై తెలిసికొన్నటువంటి సత్యభామ రోషావేశపూరిత అయియుండవచ్చును. ఆ కారణంచేతనే ఆమె స్వయంగా యీ యుద్ధం చేసి మహిళాలోకోద్ధరణం చేసింది. ఆ కీర్తి సత్యభామ సంపాదించింది. ఈ 16 వేలమంది స్త్రీలను శ్రీకృష్ణుడు సరాసరి ద్వారకానగరానికి సగౌరవంగా పంపించాడు. వాళ్ళందరూ అక్కడ ఆయననే ఆశ్రయించుకొని హాయిగా కాలక్షేపం చేశారు.

ఇంతకూ చెప్పవచ్చింది ఏమిటంటే, సత్యభామవంటి సామర్థ్యాతిశయం గల నారీరత్నం, ఒక ప్రభువునకు అర్ధాంగిగా ఉండడంవల్ల నారీలోకమును ఉద్ధరించగల్గింది. ఆమె యుద్ధచాతుర్యాన్ని పోతన్నగారికంటె ఇంకెవ్వరూ అంత చక్కగా వర్ణించలేరు.

"వీర శృంగార భయ రౌద్ర
విస్మయములు
గలసి భామిని యయ్యెనో
కాక యనగ
నిగుడు దొడుగుట దివుచుట
యేయు టెల్ల
నెఱుగ రాకుండ నని సేసె
నిందువదన."

వీర, శృంగార, భయ, రౌద్ర, ఆశ్చర్య రసాలు మూర్తీభవించినట్లుగా ఉంది. బాణం ఎప్పుడు సంధించిందో, ఎప్పుడు తీసిందో, ఎప్పుడు వేసిందోకూడా ఎరుగరాకుండా యుద్ధం చేసింది ఆ యిందువదన.

"పరు జూచు వరు జూచు;
నొంప నలరింపన్; రోష రాగోదయా
విరత; భ్రూకుటి మందహాసములతో;
వీరంబు శృంగారమున్
జరగం; గన్నుల గెంపు సొంపు బరగం;
జండాస్త్ర సందోహమున్
సరసాలోక సమూహమున్ నెరపుచుం
జంద్రాస్య హేలాగతిన్."

అటు శత్రువువంక, ఇటు వరుని (పెనిమిటి) వంక చూస్తోంది. శత్రువును సంహరించడానికి చూస్తోంది. భర్తను సంతోషపెట్టడానికి చూస్తోంది. శత్రువుమీద రోషం చూపించింది. భర్తమీద అనురాగభావం చూపించింది. నొసలు ముడిచి చూచింది శత్రువువంక—భర్తవంక మందహాసంతో చూచింది. శత్రువు విషయంలో వీరరసం, భర్త విషయంలో శృంగారరసం ప్రకటించింది. తన కన్నులయందలి ఎరుపు శత్రువుకు చూపింది. తన కన్నుల సొంపు భర్తకు చూపింది. శత్రువుమీద ప్రచండ అస్త్రముల సమూహమును ప్రయోగించింది. తన భర్తమీద సరసమైన ఓరచూపు బాణాలు ప్రయోగించింది. ఈ విధంగా ఆ చంద్రముఖి దివ్యంగా యుద్ధం చేసింది."


పోతన్నగారు వ్రాసిన యీ ఒక్క పద్యానికి, ఏ ఆంధ్ర మహిళామండలి వారైనా ఏ నరక చతుర్దశినాడైనా సభ చేసి ఆయనను ప్రత్యేకంగా సన్మానించవలసి ఉంటుంది. అక్షరలక్ష లీయదగిన ఆంధ్ర పద్యరత్నం ఇది. సత్యభామ తండ్రి సత్రాజిత్తు. అతనివద్ద శమంతకమణి ఉండేది. దానిమూలంగా రోజు 1కి 8 బారువుల బంగారం లభించేదట. అటువంటి శమంతకమణికంటె అతనికి కీర్తి తెచ్చిన కుమార్తె యగు సత్యభామామణి చాలా గొప్పది. ఈ సత్యభామ కీర్తి స్థిరస్థాయిగా ఆచంద్రతారార్కంగా ఆంధ్రభాషలో ఉండేటట్లు బమ్మెర పోతన్నగారు వ్రాసిన పద్యరత్నం సత్యభామామణికంటె ఎక్కువ శాశ్వతదీప్తి గలది.

స్త్రీ స్వాతంత్ర్యం అంటే ఏమిటో బోధించిన యీ భామకలాపం ఆంధ్ర రక్తంలో జీర్ణించి పోయింది. "మాది కృష్ణాతీరం—మాది కూచిపూడి అగ్రహారం" అని కూచిపూడి భాగవతశిఖామణులు ఆంధ్రదేశంలో గజ్జకట్టిన దివ్య సుముహూర్తము ఆంధ్రుల నాగరికతా విజ్ఞానవికాసంలో ఒక ప్రధాన ఘట్టం – సత్యభామకు ఆంధ్రలోకం యిచ్చిన గౌరవ ప్రఖ్యాతి ఇంతా అంతా కాదు. శ్రీకృష్ణమూర్తి పాత్రకంటె భామవేషం పాత్ర మన భామకలాపంలో ఎక్కువ జనాకర్షణకలుగచేసింది. స్వామివారి వేషంకంటె, అమ్మవారివేషం ఆ కలాపంలో అగ్రస్థానం వహించింది. భామవేషం ఎప్పుడు వస్తుందా అని అర్ధరాత్రి దాటినాసరే అతి దీక్షతో జనం నిరీక్షిస్తూ ఉండేవారు.

"భామానే, సత్యాభామానే" అనే కీర్తన వినిపించేసరికి, ఆడియన్సుకు తొలకరివాన కురిసినట్లయ్యేది. సత్యభామ యొక్క ధీరత్వం ఆంధ్రలోకానికి రుచించింది. ఆంధ్రరాణులు కూడా అటువంటి వీరాంగనలు కావాలని ఆంధ్రరాజులు అభిలషించేవారు. పారిజాతాపహరణం శ్రీకృష్ణదేవరాయలకు నందితిమ్మన అంకితం యిచ్చాడు.

"శ్రీ మదికిం బ్రియం బెసగ
జేర్చిన యయ్యొలలీల వైజయం
తీమిళితాచ్ఛ కౌస్తుభము
నిద్దపు గాంతి దనర్చి యాత్మవ
క్షోమణివేది బొల్పెసగ
జూడ్కుల పండువుసేయు వేంకట
స్వామి కృతార్థు జేయు నరసక్షితి
నాథుని కృష్ణరాయనిన్"

అనే మంగళాశీర్వచనంతో నంది తిమ్మన యీ పారిజాతాపహరణం ప్రారంభించి చాలా సొంపుగా ప్రబంధం ముగించాడు. వేంకటేశ్వరుడు శ్రీకృష్ణరాయలవారికి సర్వసంకల్ప సిద్ధిని కలుగజేయుగాక! అని ఆశీర్వదించాడు. నరకాసురవధ అయిన పిమ్మట భూదేవి శ్రీకృష్ణునకు వైజయంతీ అనే వనమాలను సమర్పించింది.


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
"స్వామివారు తమ తనువు నిక్కడే త్యజించి వేరే రూపం లోటి వైకుంఠానికి వెడతారు గదా! ఆ రూపాన్నొక సారి చూడగా మనసవుతోందో మహారాజా! కళేబరాన్నే దహనం చేస్తే స్వామివారు తమ మారు రూపములో భూలోకానికి వస్తారు
"పామును పరిణయమాడిన కన్య పాము శరీరం దహనం చేసి మానవ రూపంలో తన భర్తను పొంది సుఖించగలేదా, పూర్వం?
"ఎవరా కన్య? ఏమా కథ?"
పార్శ్వ నగరమను పురవరమందున దేవదత్తుడను విప్రుడు గలడు. బిడ్డలు కలగని ఆతని భార్య ఇరుగు పొరుగులా పిల్లల చూచి కుమిలి కుమిలి విలపించేది
"ఏమేవ్! నీకిక దిగులే లేదే! వేకువజామున జపమందుండగ ఏదో అదృశ్యవాణి చెప్పినది - త్వరలో మనకొక సుందర రూపుడు కుమార రత్నం జన్మిస్తాడట!!"
కొన్నాళ్లకు ఆ సాధ్వి కడుపునా జన్మించిన దొక చక్కని సర్పం! ఇరుగుపొరుగులా అమ్మలక్కలూ ఈసడించినా లెక్క చేయకా పాలూ, మీగడ, తేనెలు తెచ్చి పామునే ప్రేమతో పెంచింది.
"చూశారా! మన పక్క యింటిలో - పిల్లది పెళ్లిని చేశారు. - మన అబ్బాయికి కూడా త్వరగా - పెండిలి అయితే బావుణ్ణు!"
"సర్లే, మరినే పోయొస్తాను దేశాలన్నీ తిర్గిగైనా ఒక సంబంధం కుదిరించుకువస్తా"
మర్నాడే ఆ విప్రుడు లేచి తినుబండారపు మూటలతోటి బయలు దేరి తన పూర్వమిత్రుడూ నివసించే ఒక పట్నం చేరెను. మిత్రుడు ఎంతో ఆదరించి ఇటుద కడిగాడెందుకు వచ్చావంటూ
"ఏమీ లేదోయ్, స్నేహితుడా! నాకొక పుత్రుడు, యుక్తవయస్కుడు ఉన్నాడ తనికి వధువు కోసమై దేశాలన్నీ గాలిస్తున్నా."
"అట్లాగా, మరి చెప్పవేమిటోయ్! మా అమ్మాయిని మీ అబ్బాయికి చేసేస్తే ఇక గొడవే లేదోయ్! ఏమంటావ్ నే చెప్పిందానికి?"
"అయితే యింకేం? ఆలసించకా పిల్లదాన్నిపుడె బంధుజనులతో నాతో కూడా పంపించు."
మిత్రుని పుత్రిని వెంట బెట్టుకొని బ్రాహ్మడు తన స్వగ్రామం చేరెను.
ఊళ్లో జనమంతా పోగై "చక్కని చుక్కను సర్పం పాల్జేసును పెడతారా?" అని బంధు జనులనూ చాటుగ చివాట్లు పెట్టారు
"అయ్యో తల్లీ! ఎంతటి మోసం? చూస్తూ చూస్తూ పాముతో నీకూ ఎట్లా ముడిపెడతామమ్మా! పద పద పోదాం మన గ్రామానికి."
"అదేమిటమ్మా, అట్లుంటావు? ఇప్పుడు వెనక్కి వెళిపోతే మాటిచ్చిన మా తండ్రి గారికి అసత్య దోషం సంక్రమించదా? విధికెదురీదుట ఎవరికి శక్యము? పూర్వం యింద్రుడి పెంపుడు చిలకకు పట్టిన గతి మీ రెరుగనిదా!"
"ఎవరా చిలక? ఏమా కథ?"

Regd No M. 4479 Andhra patrika Illustrated Weekly